
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
3-9-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 213 పేజీలు: 8+16 వెల: 6.50

1400కు పెరిగిన అఫ్గాన్ భూకంప మృతులు
నియంతలతో మోడీకి సావాసమా?: అమెరికా 5లో



మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన వైఎస్ మెమోరియల్ అవార్డు కార్యక్రమంలో డా. సుభాష్ పాలేకర్‌కు 25 లక్షల అవార్డును అందజేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో హర్యానా మాజీ సిఎం భూపేందర్ హుడా, కెవిపి తదితరులు

# ఉచిత విద్యుత్ అంటేనే వైఎస్

## సాగును పండుగ చేసిన నేత

### రూపాయికే కిలో బియ్యం కూడా వైఎస్ పథకమే
### రాహుల్‌ను ప్రధానిని చేయడం ఆయన జీవితాశయం
### వైఎస్సార్ మెమోరియల్ అవార్డు కార్యక్రమంలో సిఎం రేవంత్
### డా. సుధ, డా. నాగేశ్వరరావులకు పురస్కారాలందించిన సిఎం
### డా. పాలేకర్‌కు రూ. 25 లక్షల అవార్డు ప్రదానం

**హైదరాబాద్,సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:** ఉచిత విద్యుత్ అంటే వెంటనే గుర్తొచ్చొ పేరు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని, వ్యవసాయం దండగ కాదు.. పండుగ అని నిరూపించిన జన నేత వైఎస్ఆర్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం, ఆరోగ్యశ్రీ పథకం, 108 ఇలాంటి ఎన్నో పథకాలు వైఎస్ఆర్ మదిలోనుంచి వచ్చాయన్నారు. లోక్‌సభలో ప్రతి పక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీని ప్రధానినిచేయడమే తమ జీవితలక్ష్యమని వైఎస్ఆర్ గతంలోనే ప్రకటించారని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మోమోమరియల్ అవార్డు-2025 కార్యక్రమం మంగళవారం హైదరాబాద్ లోని ఒక ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు హరియాణ మాజీ ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్ హుడా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెవిపి రామచంద్రరావు, మాజీ పిసిసిచీఫ్ రఘువీరా రెడ్డి పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయంలో విశిష్ట కృషి చేస్తున్న డాక్టర్ సుభాష్ పాలేకర్,డాక్టర్ సి సుధా, డాక్టర్ నాగేశ్వరరావుకు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి మెమోరియల్ అవార్డును ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు. రూ. 25 లక్షల అవార్డును డాక్టర్ సుభాష్ పాలేకర్‌కు ప్రధానం చేశారు. ఈ అవార్డు డబ్బులను కెవిపి మనుమళ్లు అందజేశారు. ఈ సంద >>2



# వరదసాయం 200 కోట్లు

## తక్షణమే ఇస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం

### అత్యధికంగా నష్టపోయిన జిల్లాలకు రూ. 10 కోట్లు
### సాధారణ నష్టానికి రూ. 5 కోట్లు

**హైదరాబాద్,సెప్టెంబరు 2,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు తీవ్రంగా నష్టపోవడంతో ప్రభుత్వం తక్షణ సాయం కింద రూ.200కోట్ల వరద సాయాన్ని ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మంగళవారం జారీచేసింది. భారీగా నష్టపోయిన జిల్లాలకు రూ.10 కోట్ల చొప్పున,తక్కువ నష్టం వచ్చిన జిల్లాలకు రూ.5 కోట్ల చొప్పున నిధులను కేటాయించింది. అధికారులు వెంటనే,సహాయక చర్యలు చేపట్టి బాధితులకు వరద సాయాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఏడు జిల్లాలో భారీ వర్షాలు, వరదలతో భారీగా నష్టాన్ని చూడటంతో ఒక్కో జిల్లాకు రూ.10 కోట్ల చొప్పున నిధులను మంజూరు చేసింది. అదే సమయంలో కొంత తక్కువగా నష్టపోయిన మిగిలిన 26 జిల్లాలకు ఒక్కో జిల్లాకు రూ.5 కోట్ల చొప్పున నిధులను మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇళ్ల, రోడ్లు, భవనాలకు నష్టంవాటిల్లింది. వరదలతో రాష్ట్రవ్యాప్తంగా 257 చెరువులు, కుంటలకు గండిపడింది. భారీ వానలకు తెలంగాణ రాష్ట్రం అతలాకుతలం అయింది. ప్రాథమిక >>2

## కాళేశ్వరం అక్రమాలపై సిబిఐ

# విచారణ జరపండి






### • కేంద్రానికి ప్రభుత్వం లేఖ • సిబిఐ ప్రవేశంపై గతంలోని నిషేధాన్ని తొలగిస్తూ జీవో జారీ • ప్రాజెక్టు లోపాలపై దర్యాప్తునకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాజకీయంగా దుమారం రేపిన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర సర్కారు సిబిఐ విచారణను కోరుతూ కేంద్రానికి సోమవారం అర్థరాత్రి సమయంలో లేఖ రాసింది. ఈ లేఖ మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణను అడ్డుకునేందుకు మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావులు సోమవారం దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్ మంగళవారం ఉదయం హైకోర్టులో విచారణను రానున్న వేళ హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా సోమవారం అర్థ రాత్రి సిబిఐ విచారణకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశారు. జస్టిస్ పిసి ఘోష్ నివేదిక ఆధారంగా సిబిఐ విచారణను అడ్డుకునేందుకు కెసిఆర్, హరీష్ రావుల తరపున మధ్యంతర పిటిషన్ దాఖలవగా హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా ఎన్‌డిఎస్ఎ నివేదిక ఆధారంగా సిబిఐ విచారణకు కేంద్రానికి లేఖ రాయడం సంచలనం రేపింది. కాళేశ్వరం నిర్మాణంలో లోపాలువున్నాయని, ఎన్‌డి ఎస్ఎఎ గుర్తించిందని, ప్రణాళిక డిజైన్, నాణ్యత, నిర్మాణంలో లోపాలు వున్నాయని తేలిందని హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా తన ఉత్తర్వులో >>2

రాజ్‌భవన్‌కు చేరిన ఐదు బిల్లులు 2లో




## బిఆర్ఎస్ నుంచి

# కవిత సస్పెన్షన్

### ఆమెపై క్రమశిక్షణ చర్యకు పార్టీ అధినేత కెసిఆర్ ఆమోదం
### పార్టీకి నష్టం తెచ్చే రీతిలో ఆమె కార్యకలాపాలంటూ అభియోగం
### కవితపై 'వేటు'ను స్వాగతించిన బిఆర్ఎస్ శ్రేణులు
### ఆమె నేతృత్వంలో 'తెలంగాణ బహుజన రాష్ట్రసమితి' ఆవిర్భావం?



**హైదరాబాద్, సెప్టెంబరు 2,ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌లో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుఫానుగా మారి ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ తీరం తాకింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఆమెను సస్పెండ్ చేయడానికి ఆమోదించారు. బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి టి. రవీందర్ రావు, పార్టీ క్రమశిక్షణ వ్యవహారాల బాధ్యులు సోమ భరత్ అధికారికంగా ప్రకటన విడుదల చేశారు.తెలంగాణ వ్యాప్తంగా బిఆర్ఎస్ శ్రేణులు కవిత దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తూ పార్టీ నిర్ణయాన్ని స్వాగతించారు. కల్వకుంట్ల కవిత బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కూతురు, నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా శాసనమండలిలో కొనసాగుతున్నారు. పార్టీ అంతర్గత వేదికలపై చర్చించాల్సిన అంశాలను క్రమశిక్షణ రాహిత్యంతో బహిరంగ వేదికలపై ఆమె ప్రస్తావించడం రివాజుగామారింది. ఇటీవలికాలంలో బిఆర్ఎస్‌పార్టీలో కెసిఆర్ వెంట దెయ్యాలు ఉన్నాయని పేర్కొంటు తొలుత తన అసంతృప్తిని వ్యక్తీరించింది. నల్లగొండ జిల్లాకు వెళ్లి మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిని లిల్లీపుట్ అంటూ బహిరంగంగా చులకన చేశారు. తాజాగా విదేశాల నుంచి రాగానే కాళేశ్వరం రిపోర్టుపై మాట్లాడుతూ హరీష్‌రావు, సంతోష్‌రావులపై విమర్శలు చేశారు. ఎమ్మెల్సీ కవిత ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు బిఆర్ఎస్ పార్టీకి నష్టం కలిగించే రీతిలో ఉన్నందున పార్టీ అధిష్టానం ఈ విషయాన్నీ తీవ్రంగా పరిగణిస్తున్నది. క్రమశిక్షణా రాహిత్యంతో వ్యహరించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేదిలేదని పార్టీఅధ్యక్షులు కెసిఆర్ కవితను తక్షణం పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారని బిఆర్ఎస్ పార్టీ అధికారంగా ప్రకటించింది. పార్టీ లైన్‌దాటి కవిత పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ నుంచి సస్పెన్షకు గురైన ఎమ్మెల్సీ తన రాజకీయభవిష్యత్ వెతుక్కొనేందుకు ముందుగానే కార్యచరణ ప్రణాళిక రూపొందించుకొందని రాజకీయవర్గాల్లో చర్చకొనసాగుతోంది.బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తరహాలోనే పదవులను త్యాగం చేస్తూ కొత్త రాజకీయపార్టీతో తెలంగాణలో తన సత్తా చాటు కొంటుందని కవిత అనుచరగణంలో చర్చకొనసాగుతోంది. >>2

## కొడంగల్‌లో మెడికల్ కాలేజికి

# గ్రీన్ సిగ్నల్

### ఈ యేడాదినుంచే అడ్మిషన్లు

**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 2:** తెలంగాణ రాష్ట్రంలో మరొక ప్రభుత్వ మెడికల్ కాలేజీకి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) అనుమతించింది. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో ఏర్పాటు చేయనున్న కొడంగల్ మెడికల్ కాలేజీకి నేషనల్ మెడికల్ కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్తగా ఏర్పాటు కానున్న మెడికల్ కాలేజీలో 50 ఎంబిబిఎస్ సీట్లతో అనుమతులు ఇచ్చింది. గతంలో రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుమతులను పెండింగ్‌లో పెడుతూ ఎన్ఎంసి నిర్ణయం తీసుకుంది. మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లు లేకపోవడంతో.. అనుమతులను పెండింగ్‌లో పెట్టింది. అందులో భాగంగా ఎన్ఎంసి అనుమతులు ఏ కారణాలతో పెండింగ్‌లో పెట్టిందో వాటిని సరిచేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఎన్ఎంసిని అనుమతుల కోసం సంప్రదించింది. దీంతో కొడంగల్ మెడికల్ కాలేజీకి అనుమతులు ఇస్తూ ఎన్ఎంసి నిర్ణయం తీసుకుంది. 50 ఎంబిబిఎస్ సీట్లకి అనుమతి ఇచ్చింది. దీంతో ఈ ఏడాది నుంచే 2025-26 విద్యా సంవత్సరం నుంచే ఎంబిబిఎస్ అడ్మిషన్లను చేపట్టనున్నారు.కొడంగల్‌మెడికల్‌కాలేజీకి ఎన్ఎంసి >>2



# ఇక మానవరహిత విద్యుత్ రీడింగ్

### కొత్తపుంతలు తొక్కుతున్న పంపిణీ సంస్థలు
### తొలిదశలో 400 హెచ్‌టి సర్వీసులకు అమలు

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** త్వరలో రాష్ట్రంలో మానవ రహిత విద్యుత్ మీటర్ల రీడింగ్ రాబోతోంది. ప్రధానంగా విద్యుత్ మీటర్ రీడింగ్ తీసే సమయాల్లో తరచూ ఏర్పడుతున్న పొరపాట్లు, తప్పిదాలతో భారీ మొత్తంలో బిల్లులు రావడాన్ని నియంత్రించడంతో పాటు, బిల్లులను అంద చేయడాన్ని వేగవంతం చేసేందుకు పంపిణీ సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో మానవ రహితంగా ఆటోమేటిక్ మీటర్ రీడింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కసరత్తు చేస్తున్నాయి. >>2


తల్లి హీరాబెన్‌తో ప్రధాని మోడీ (ఫైల్)

# నా తల్లిని అవమానిస్తారా?

### ఇది దేశంలోని అందరు తల్లులను అగౌరవించినట్లే
### రాజకీయాలతో ఆమెకు ఏం సంబంధం!
### కాంగ్రెస్, ఆర్జేడిపై మండిపడిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 2:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్‌లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఆయన తల్లిపై కొందరు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ వ్యాఖ్యలపై ప్రధాని తాజాగా స్పందించారు. ఇటీవలే బీహార్‌లో నిర్వహించిన సమావేశాల్లో >>2

## వారంలో 27,470 ట.

# యూరియా రాక

### త్వరలో పంట నష్టం సర్వే: మంత్రి తుమ్మల

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** వారంలో రోజుల్లో రాష్ట్రానికి 27,470 టన్నుల యూరియా రానుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. రెండు రోజులుగా 14 వేల టన్నులు మేర సరఫరా అయినట్లు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో యూరియా సరఫరాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా ఇటీవల రాష్ట్రంలో కురిసిన వర్షాల నేపథ్యంలో జరిగిన పంట నష్టంపై ఐదు రోజుల్లో సర్వే పూర్తి చేయాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఎరువుల సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రైతులకు ఎరువుల కొరత ఉండకుండా, అవసరమైనచోట తక్షణమే అందేలా సమన్వయం చేయాలని తెలిపారు. నిన్న ఒక్క రోజే >>2

## త్వరలో ఉద్యోగుల

# హెల్త్ కార్డులు

### విధివిధానాలు రూపొందించడానికి మంత్రుల సబ్‌కమిటీ హామీ
### బస్సు యాత్ర, ఛలో హైదరాబాద్‌ను వాయిదా వేసినట్లు ప్రకటించిన ఉద్యోగుల జెఎసి

**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 2:** తెలంగాణలోని ఉద్యోగులు, ఉపాధ్యాయసంఘాలతో మంత్రి వర్గ ఉపసంఘం, అధికారుల కమిటీతో మంగళవారం సమావేశమయ్యారు. సమావేశంలో ఉద్యోగుల హెల్త్ కార్డుల మంజూరుకు త్వరలో విధివిధానాలు రూపొందించనున్నట్టు మంత్రులు సమాధానమిచ్చారు. దాంతో పాటు మరికొన్నింటిని అంగీకరించిన నేపథ్యంలో ఈ నెల 8 నుంచి ప్రారంభించనున్న బస్సు యాత్రను, ఈ నెల 12న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నట్టు తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసి ప్రకటించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు మంగళవారం సచివాలయంలో రాష్ట్ర కాబినెట్ సబ్ కమిటి, అధికారుల కమిటితో జెఎసి సమావేశం జరిగింది. సమావేశంలో మారం జగదీశ్వర్, చైర్మన్, ఏలూరి శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్, పి. దామోదర్ రెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి, చావా రవి, సహచైర్మన్, వంగ రవీందర్ రెడ్డి, కో చైర్మన్, జి. సదానంద్ గౌడ్, కోచైర్మన్, ఎ. సత్యనారాయణ, డిప్యూటీ సెక్రటరీ జనరల్, డాక్టర్ జి. సురేష్ కుమార్, సహ చైర్మన్, జి. స్థితప్రజ్ఞ ప్రజ్ఞ, డిప్యూటీ సెక్రటరీ జనరల్. కటకం రమేష్, వైస్ చైర్మన్ పాల్గొన్నారు.
అనంతరం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ కార్యాలయంలో జేఏసి నేతలు మీడియాతో మాట్లాడారు. పెండింగ్ సమస్యల పరిష్కారంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క. మల్లు, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి డి శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావుతోపాటు అధికారుల కమిటీ ఉద్యోగుల జేఏసితో ప్రతి అంశంపై సానుకూలమైన వైఖరితో చర్చలు జరిగాయని జేఏసీ నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎప్పటినుంచో కోరుతున్న నగదు రహిత చికిత్స కొరకు హెల్త్ కార్డులు మంజూరు చేస్తామని.. అందుకోసం ఈ నెల 8న(సోమవారం) ప్రభుత్వ >>2

## లండన్‌లో ఘోర ప్రమాదం

# ఇద్దరు హైదరాబాద్ విద్యార్థుల దుర్మరణం


రాపోలు రిషికేష్ (ఫైల్)


తర్రె చైతన్య యాదవ్ (ఫైల్)

### మరో ఐదుగురి పరిస్థితి విషమం

**హైదరాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** లండన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు హైదరాబాద్ విద్యార్థులు దుర్మణం పాలయ్యారు. ఈస్ట్ లండన్‌లో గత సోమవారం ఉదయం తెల్లవారుజామున సూర్యోదయం చూసేందుకు రెండు కార్లలో 9 మంది స్నేహితులు వెళుతుండగా ఒక కారు డివైడర్‌ను ఢీకొట్టగా, వారి వెనుకే వస్తున్న మరో కారు ముందు వెళుతున్న కారును ఢీకొట్టినట్లు తెలిపారు. వెనుకే వస్తున్న ట్రక్ కారును ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఐదుగురు అసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కార్లు నడిపించిన ఇద్దరిని అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత ఆదివారం వినాయక నిమజ్జనం చేసుకుని తిరిగి సోమవారం ఈస్ట్ లండన్ సమీపంలోని బీచ్ వద్ద సూర్యోదయం చూసేందుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. బాధితులంతా తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తించారు.మృతుల బంధువులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. ఉప్పల్‌సమీపంలోని పీర్జాదిగూడ అమృతకాలనీలోని సాయి అపార్ట్ >>2



మంగళవారం జరిగిన వైఎస్ మెమోరియల్ అవార్డు కార్యక్రమంలో డా. సుధ, డా. నాగేశ్వరరావుకు పురస్కారాలు అందిస్తున్న సిఎం రేవంత్

# రాజ్‌భవన్‌కు చేరిన ఐదు బిల్లులు

## న్యాయ సలహా కోసం గవర్నర్ సిఫార్సు?

**హైదరాబాద్,సెప్టెంబరు 2,ప్రభాతవార్త:** శాసనసభ, శాసనమండలిలో ఆమోదించిన ఐదు బిల్లులు మంగళవారం రాజభవన్ చేరినట్లు తెలిసింది. బిసిలకు స్థానిక సంస్థల్లో ఉన్న 50 శాతం నిబంధన ఎత్తివేస్తూ రిజర్వేషన్లను పెంచుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్ సవరణ బిల్లు ఏకగ్రీవ ఆమోదం పొందింది. పురపాలక చట్ట సవరణ బిల్లు కూడా రెండు సభలలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టిన అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్స్ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది.

సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ చేస్తూ మంత్రి సీతక్క ప్రవేశపెట్టి బిల్లులు ఉభయ సభలో ఆమోదం పొందాయి. తాజాగా అసెంబ్లీతో పాటు మండలిలో ఆమోదించిన మొత్తం ఆ ఐదు బిల్లులు రాజ్ భవన్ చేరాయి. అయితే, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వాటిని ఆమోదించే ముందు న్యాయ సలహా తీసుకోవాలని నిర్ణయించినట్లుగా సమాచారం. గవర్నర్ ఐదు బిల్లులకు ఆమోదం తెలుపుతారా లేక తిరిగి వెనక్కి పంపుతారా అని ప్రభుత్వ వర్గాల్లో ఉత్కంఠగా మారింది.



మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన 'సెమికాన్' కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోడీ

# ఉచిత విద్యుత్ అంటేనే వైఎస్

>> ర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో ప్రభుత్వాలు ఏర్పాటు చేసినా ఉచిత విద్యుత్ ఇవ్వాల్సిందే అన్నట్లుగా వైఎస్ ప్రభావితం చేశారని అన్నారు. ఉచిత విద్యుత్ పైన తొలి సంతకం చేయడంతోపాటు రైతుల విద్యుత్ బకాయిలను, వారి పైన పెట్టిన కేసులను వైఎస్ రద్దు చేశారని గుర్తు చేశారు. 2 రూపాయల కిలో బియ్యాన్ని రూపాయికే ఇచ్చిన ఘనత వైఎస్‌కే దక్కుతుందన్నారు. ఉచిత కరెంట్ అంటేనే వైఎస్ పేరు గుర్తుకు వస్తుందన్నారు. పేద విద్యార్థులకు ఫీజు రీయంబర్స్ మెంట్ పథకం, పేదల రోగుల చికిత్సకు ఆరోగ్యశ్రీ వంటి పథకాలను ప్రారభించి.. ఎవరు అధికారంలోకి వచ్చినా కొనసాగించేలా చేశారని కొనియాడారు. ప్రస్తుతం తెలంగాణలో 3.10కోట్ల మందికి ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నా మన్నారు. అందులో వైఎస్ స్ఫూర్తి ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన 3 నెలలోనే 2 లక్షల రైతు రుణ మాఫీ చేస్తామన్నాం.. 25,35,694 మంది రైతులకు 20,617 కోట్ల రుణ మాఫీ చేసి రుణ విముక్తి కల్పించామన్నారు. వరి వేస్తే ఉరే అని గత సిఎం అంటే.. మేం మాత్రం వరి వేస్తే 500 రూపాయల బోనస్ ఇచ్చామన్నారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కొన్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం కోసం ప్రణాళికలు తయారు చేస్తామన్నారు. తెలంగాణలో కరవు, వలసలను నివారించడం కోసం గోదావరి జలాలను తీసుకు రావడానికి వైఎస్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టారని, నల్గొండ ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం కోసం ఎస్ఎల్‌బిసిని వైఎస్ చేపట్టారని.. 30 కిలో మీటర్ల సొరంగం తవ్విన తర్వాత పనులు ఆపేశారన్నారు. ఎస్ఎల్‌బిసిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసి రైతుల కలను నెరవేరుస్తుందన్నారు. వైఎస్ఆర్ బ్రతికున్న సమయంలోనే నా జీవిత ఆశయం రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమేనని వైఎస్ గతంలోనే ప్రకటించారని అన్నారు. తాను, వైఎస్ షర్మిల రాహుల్ గాంధీని ప్రధాని చేయడం కోసం అవిశ్రాంతంగా పని చేస్తామన్నారు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ప్రతిపక్ష ఎంఎల్ఏగా అసెంబ్లీలో బడ్జెట్‌పైన ప్రభుత్వాన్ని నిలదీశానని.. మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పటికీ నా విమర్శలకు వైఎస్ సభలో సమాధానం ఇచ్చారని.. కోపం అనే నరం తెగిపోయిందని వైఎస్ చెప్పారని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. అధికారంలో ఉన్నపుడు అహంకారం లేకుండా ఆలోచనతో ప్రతిపక్షాలకు వైఎస్ సమాధానం చెప్పారని కొనియాడారు. చదువుకునే రోజుల నుండి మరణం వరకు వైఎస్‌కి కేవీపీ రామచంద్ర రావు తోడు నీడగా నిలబడ్డారన్నారు. రైతుల కోసం, వ్యవసాయం దండగ కాదు పండుగ అని చెప్పడానికి వైఎస్ పని చేశారన్నారు. కేవీపీ రామచంద్ర రావు లాగా ఉంటానని కొంతమంది నా దగ్గరకి వస్తున్నారన్నారు. ఈ తరానికి ఒకే వైఎస్, ఒకే కేవీపీ ఉంటారని.. వారికి ప్రత్యామ్నాయం లేదన్నారు. తప్పులను తన ఖాతాలో, మంచిని వైఎస్ ఖాతాలో కేవీపీ వేసేవారన్నారు. సర్వం త్యాగం చేయగల గుణం, సమస్యలను ఎదుర్కొనే శక్తి కేవీపీకి ఉందన్నారు.

**వైయస్ ఆలోచనలు, కాంగ్రెస్ భావజాలాన్ని అమలు చేస్తున్నాం : డిప్యూటీ సిఎం భట్టి**

దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆలోచనలను, కాంగ్రెస్ బావ జాలాన్ని రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తూ ముందుకు పోతుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.మంగళవారం సాయంత్రం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన వైయస్‌స్మారక అవార్డుల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైయస్ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోతున్నామన్నారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని 10 లక్షలకు పెంచాం, అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 21 వేల కోట్ల రైతు రుణమాఫీ చేశాం,తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లురైతు భరోసా కింద అన్నదాతల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.

రైతులు పండించిన పంటకు మద్దతు ధర అందించడమే కాకుండా సన్నధాన్యానికి క్వింటాలుకు రూ 500 చొప్పున బోనస్ అందిస్తున్నామని వివరించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి నడివే వేసవిని లెక్క చేయకుండా తన సుదీర్ఘ పాద యాత్రలో రాష్ట్రంలోని తాడిత, పీడితులు, రైతుల సమస్యలను తెలుసుకుని అవగాహన చేసుకున్నారు, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజే మొదటి సంతకం ఉచిత విద్యుత్ పై చేశారని వివరించారు. భారతదేశంలో ఎవరైనా ఉచిత విద్యుత్తు అందజేస్తున్నారు అంటే అది వైయస్ రాజశేఖర్ రెడ్డి పేటెంట్ అన్నారు.వైఎస్ పిసిసి అధ్యక్షుడిగా, సిఎల్పీ నేతగా, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారితో కలిసి పనిచేసే అవకాశం తనకు దక్కిందని భట్టి తెలిపారు. రైతు ఆత్మహత్యలకు పంట పెట్టుబడి ఒకటే కారణం కాదు, పెరిగిన విద్య, వైద్యం ఖర్చులు కారణమని డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గుర్తించి రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించారని తెలిపారు. పెట్టుబడి భారాన్ని తగ్గించేందుకు ఉచిత కరెంటు,సకాలంలో వ్యవసాయ రుణాలు అందిస్తూ రైతు కుటుంబాలపై విద్యాబారం తగ్గించేందుకు ఫీజు రియంబర్స్మెంట్, వైద్యభారం తగ్గించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలు తీసుకువచ్చారని రైతు కుటుంబాలను కాపాడారని అన్నారు.పాలన అంటే ఎలా ఉండాలి, ప్రభుత్వం అంటే ఎలా ఉండాలో చూపించిన మహానేత వైయస్, వారి భావాలు ఆలోచనలను ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత వారి మిత్రులుగా అందరిపై ఉందని తెలిపారు.

మిత్రుడుగా కెవిపి రామచంద్ర రావు ఏర్పాటుచేసిన వైఎస్ఆర్ స్మార్క్ అవార్డుల పంపిణీ కార్యక్రమం అభినందనీయం, వైయస్,కెవిపి ఒకరికి మరొకరు మంచి మిత్రులుగా దొరకడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు.కెవిపి మనవళ్లు25 లక్షల నగదు బహుమతిని వైయస్ స్మారక అవార్డుల పేరిట ఇవ్వడం అభినందనీయం, ఇంత పెద్ద మొత్తంలో నగదు బహుమతి ఇవ్వడం ఇదే ప్రథమం అని తాను భావిస్తున్నట్టు తెలిపారు.భవిష్యత్తులో కూడా వారి ఆలోచనలను ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నం వైయస్ మిత్రులు చేయాలని కోరారు.

## అవమానిస్తారా?

>> విపక్షాలు చనిపోయిన తన తల్లిని లక్ష్యంగా చేసుకున్నాయని మండిపడ్డారు. తన తల్లిని అవమానిస్తూ మాట్లాడారని, ఆమెకు అవమానం జరిగిందన్నారు. ఈ మేరకు ఆర్జేడీ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలోమండిపడ్డారు. 'అమ్మే మన ప్రపంచం. అమ్మే మన ఆత్మగౌరవం. బీహార్‌లో ఆర్జేడీ కాంగ్రెస్ నిర్వహించిన సమావేశాల్లో విపక్షాలు చనిపోయిన నా తల్లిని లక్ష్యంగా చేసుకున్నారు. మా అమ్మను అవమానిస్తూ మాట్లాడారు. ఇది నా తల్లికి జరిగిన అవమానం మాత్రమే కాదు. దేశంలోని తల్లులు, సోదరీమణులు, కుమార్తెలకు జరిగిన అవమానం. వారిమాటలు నన్నుఎంతో బాధించాయి. బీహార్ ప్రజలు కూడా అదే బాధలో ఉన్నారని నాకు తెలుసు. నా తల్లికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదు. అయినా ఎందుకు ఇందులోకి లాగారు అంటూ మోడీ ఫైర్ అయ్యారు.

## విద్యుత్ రీడింగ్

>> రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా కొన్ని జిల్లాలను అధికారులు ఎంపిక చేస్తున్నారు. మొదటి దశలో 400 హైటెన్షన్ విద్యుత్ సర్వీసులకు ఎఎంఆర్ (ఆటోమేటిక్ మీటర్ రీడింగ్)ను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. పరిశ్రమల్లో మీటరు రీడింగ్‌ను హెచ్‌టి విద్యుత్తు వాడుకునే కేటగిరీలో 55 హెచ్‌పికి మించి సార్థం ఉంటే ఎడిఇ స్థాయి అధికారి, 55 హెచ్‌పిలోపు ఉంటే ఏఈ స్థాయి అధికారి సేకరిస్తారు. నాన్ స్లాబ్ రీడింగ్‌ని లైన్ ఇన్‌స్పెక్టర్లు, స్లాబ్ రీడర్‌ను ప్రైవేట్, జూనియర్ లైన్‌మెన్లు సేకరిస్తారు. మీటరు రీడింగ్ నమోదులో రోజులు ఆలస్యమైతే స్లాబ్ రేటు మారిపోతుంది. ఈ కారణంగా కరెంటు బిల్లు ఎక్కువగా వస్తోందన్న ఫిర్యాదులు తరచూ వస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ఎఎంఆర్ విధానాన్ని సంస్థ ఎంచుకుంది.

## యూరియా రాక

>> 9 వేల టన్నుల యూరియా వచ్చిందని, అలాగే ఈ రోజు మరో 5వేల టన్నులు రానుందని చెప్పారు. అదేవిధంగా ఇటీవల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టానికి పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రిగారు తెలిపారు. రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా, సకాలంలో సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

# 6న రాష్ట్రానికి అమిత్ షా

## గణేశ నిమజ్జన వేడుకలలో పాల్గొననున్న కేంద్ర హోంమంత్రి

**హైదరాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగరంలో నిర్వహించే గణేశ నిమజ్జన వేడుకలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా వస్తున్నారు. వినాయకుడి నిమజ్జనం నేపథ్యంలో హైదరాబాద్ రానున్నారు. భాగ్యనగర్ ఉత్సవసమితి ఆహ్వానంమేరకు అమిత్‌షా నిమజ్జనం వేడుకలో పాల్గొంటున్నట్లు పార్టీ నేతలు పేర్కొన్నారు. ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం కార్యక్రమానికి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరు కానున్న నేపథ్యంలో నగర పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 6న ఉదయం 11 గంటలకు అమిత్ షా బేగంపేట ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటారు. ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఐటిసి కాకతీయలో బిజెపి ముఖ్య నేతలతో సమావేశం కానున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు చార్మినార్‌దగ్గర వినాయక నిమజ్జన శోభాయాత్రలో పాల్గొననున్నారు. ఎంజే మార్కెట్ వద్ద నిమజ్జన శోభాయాత్రలో పాల్గొని ప్రసంగించనున్నారు.

# బిఆర్ఎస్ నుంచి కవిత సస్పెన్షన్

>> అందులోభాగంగా తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని భావిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. అదే సమయంలో బిఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేయాలని భావిస్తున్నారట.ఈ విధంగా బిఆర్ఎస్ పార్టీతో పూర్తిగా తెగదెంపులు చేసుకోవాలనే యోచనలో కవిత ఉన్నారని ఆమె అనుచరులు చెబుతున్నారు. త్వరలో కవిత కొత్త పార్టీని ప్రకటిస్తారని కూడా ఆమె అనుచరులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలోనే బుధవారం నాడు ఎమ్మెల్సీ కవిత ప్రసార మాధ్యమాల ముందుకు వచ్చి తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తారని ఆమె అనుచరులు చెబుతున్నారు.లిక్కర్ స్కామ్ కేసులో జైలు నుంచి బయటకు వచ్చినప్పటి నుంచి పార్టీ లైన్ దాటి అడుగులు వేస్తూ వస్తున్న కల్వకుంట్ల కవిత త్వరలోనే కొత్త పార్టీపెట్టాలని నిర్ణయం తీసుకున్నారని ఆమె అనుచరులు చెప్పారు.తెలంగాణలో బిఆర్ఎస్‌లో ఉంటూనే తన సొంత సంస్థ జాగృతిని బలోపేతం చేస్తూ వచ్చిన కవిత అదే పేరుతో గానీ.. మరో పేరు తెలంగాణ బహుజన రాష్ట్ర సమితి పేరుతో గానీ కొత్త పార్టీ పెట్టాలని భావిస్తున్నారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కొత్త పార్టీ ఏర్పాటుకు సంబంధించి సన్నాహాలు కూడా ప్రారంభించారని సమాచారం. బిఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ ప్రకటన రావడంతో కొత్త పార్టీ వ్యవహారంలో కవిత మరింత స్పీడ్ పెంచనున్నట్లు తెలుస్తోంది. బిఆర్ఎస్ నుంచి కవిత సస్పెండ్ వ్యవహారం రాష్ట్ర రాజకీయాలను వేడెక్కించాయి. పార్టీ నుంచి బహిష్కరణపై అధికారిక ప్రకటన వెలువడగానే జూబ్లీహిల్స్ లోని జాగృతి ప్రధాన కార్యాలయానికి నేతలు భారీగా చేరుకుంటున్నారు. "జై కవితక్క.. జై జాగృతి" అంటూ కార్యకర్తల నినాదాలు చేస్తున్నారు. అదే విధంగా మాజీ మంత్రులు హరీష్ రావు , జగదీశ్ రెడ్డికి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శిస్తూ హల్చల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కవిత సస్పెన్షన్‌పై జాగృతి నేతలు మాట్లాడుతూ కవితను పార్టీ నుంచి బహిష్కరించినంత మాత్రాన ఆమెకు ఎలాంటి నష్టం జరగబోదని కామెంట్ చేశారు. కన్నతండ్రి కెసిఆర్‌పై సిబిఐ విచారణను ఆమె తట్టుకోలేకపోయిందని జాగృతిపరులు అన్నారు. అప్రకటిత సస్పెన్షన్‌తో చాలా రోజులునుంచి కవితను పార్టీకి దూరం పెట్టే కుట్రలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. కవిత ఏ నిర్ణయం తీసుకున్నా తాము ఆమె వెంటే ఉంటామని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజల కోసం కవితక్క కొట్లాడుతుందని, సామాజిక తెలంగాణ కోసమే కవిత అక్క ఫైట్ చేస్తోందని అన్నారు. రాబోయే రోజుల్లో బడుగు బలహీన వర్గాల ప్రజలు మొత్తం ఆమె వెంటే ఉంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. కవిత తాజాగా పరిణామాలపై సన్నిహితులతో సమాలోచనలు చేస్తున్నారు.

# ఉద్యోగుల హెల్త్ కార్డులు

>> ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జేఏసీ నేతలతో అధికారుల కమిటీ చర్చించి విధి విధానాలతో ఉత్తర్వులు జారీచేస్తామని ఖచ్చితమైన హామీ ఇచ్చినట్లు జేఏసి నేతలుతెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం వారితో ప్రత్యేకంగా ఒక సమావేశం నిర్వహించనున్నట్లు ప్రభుత్వం తెలిపిందన్నారు. పెండింగ్ బిల్లులను నెలకు రూ.700 రూ.750 కోట్లు ఇచ్చి వాటిని క్లియర్ చేస్తామని, నర్సింగ్ డైరెక్టరేట్‌ని కూడా త్వరలో ఏరాటు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు తెలిపారు. విజిలెన్సు, ఎసిబి కేసులు ఎదుర్కొంటున్న ఉద్యోగులు 2 సంవత్సరాలకు పైగా సస్పెన్షన్ లో ఉన్నవారికి క్రమంగా పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వం వేరు వేరు కాదని, సుపరిపాలన కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చినట్లు నాయకులు తెలిపారు. సిపిఎస్ విధానం రద్దు దిశగా కాల పరిమితితో కూడిన కమిటీ నియమించాలి సిపిఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్ర తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ తరపున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. సిపిఎస్ విధానం కాంగ్రెస్ పార్టీ పాలిస్తున్న హిమాచల్ ప్రదేశ్, పాలించిన రాజస్థాన్, చత్తీస్గడ్ ఝార్ఖండ్ రాష్ట్రాల్లో రద్దు చేశారని, దీని పై సవివరణ రిపోర్ట్‌ను ఉప ముఖ్యమంత్రితోపాటు మంత్రి శ్రీధర్ బాబుకి, ప్రభుత్వ సలహాదారు కేశవ్ రావుకి అందచేశారు.

# గాలిలోనే ఢీకొన్న చిన్నవిమానాలు

**ఫోర్ట్‌మోర్గాన్(కొలరాడో), సెప్టెంబరు 2:** రెండు చిన్నవిమానాలు గాలిలోనే పరస్పరం ఢీకొనడంతో ఒక వ్యకినత మృతిచెందగా మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈశాన్యకొలరాడోలో ఉన్న ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ అయ్యేందుకు సిద్ధం అవుతున్న తరుణంలోనే ఈప్రనమాదం జరిగింది. సెస్నాన172, ఎక్స్‌ట్రా ఫ్లూగఝిగ్‌బావు ఇఎ 300 రెండు విమానాలు ఏకకాలంలో ఫోర్ట్ మోర్గాన్ మున్సిపల్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయ్యేందుకు సిద్ధం అవుతున్న తరుణంలో పరస్పరం ఢీకొన్నాయి. రెండు విమానాల్లోను ఇద్దరేసి చొప్పున ప్రయాణిస్తున్నారు. మోర్గాన్ కౌంటీ షరీఫ్ కార్యాలయం వివరాలప్రకారం రెండు విమానాలు కూడా పరస్పరం ఢీకొని మంటల్లో చిక్కుకుని పూర్తిగా ధ్వంసం అయినట్లు తేలింది. సెస్నాలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. మరో ప్లేన్‌లో ఉన్న ఒకరిని ఆసుపత్రికి తరలించగా మరొకరు స్పాట్‌లోనే చనిపోయారు.

# హైదరాబాద్ విద్యార్థుల దుర్మరణం

>> మెంట్‌లో నివసించే రాపోలు రవీందర్‌రావు, కిరణ్మయిల కుమారుడు రాపోలు రిషికేష్(21) నగరంలో బిబిఎ చేసి లండన్‌లో ఎంబిఎ చేసేందుకు గత మే 19వ తేదీన వెళ్లినట్లు తెలిపారు. అక్కడే ఉంటున్న తెలుగువారితో కలిసి రూమ్‌లో ఉంటూ కళాశాలలో చదువుకుంటున్నాడని తెలిపారు. ఇటీవలే వినాయక చవితి వేడుకలు ఘనంగా చేసి నిమజ్జనం కూడా చేశారని తెలిపారు. లండన్ కాలమానం ప్రకారం గత సోమవారం ఉదయం 3 గంటల ప్రాంతంలో సమీపంలోని బీచ్‌లో సూర్యోదయం చూసేందుకు రెండు కార్లలో తొమ్మిది మంది బయలుదేరినట్లు తెలిపారు. ముందు వెళుతున్న కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో వారి వెనుకే వస్తున్న మరో కారు ముందు వెళుతున్న కారును ఢీకొట్టినట్లు తెలిపారు.వీరి వెనుకే వస్తున్న మరో ట్రక్ రెండు కార్లను ఢీకొట్టడంతో కారులో ఉన్న ఉప్పల్ పీర్జాదిగూడ అమృతకాలనీకి చెందిన రాపోలు రిషికేష్(21) నగరంలోని బాలాపూర్ మండలం, నాదర్‌గుల్‌కు చెందిన తర్రె ఐలయ్య, మంగమ్మల కుమారుడు తర్రె చైతన్య యాదవ్(22) అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో రావుల సాయిగౌతమ్(30) రాయల్ లండన్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. వీరితోపాటు తాటికాయల నూతన్(23), బట్టమేకల గోపిచంద్(24), సబ్బని మనోహర్(24), గుర్రం యువతేజరెడ్డి(22), గొల్ల వంశీ (22), పెంట్యాల వెంకట సుమంత్(24)లు గాయపడినట్లు తెలిపారు. గాయపడిన వారిని రాయల్ లండన్ ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు. వీరిలో బట్టమేకల గోపిచంద్(24), సబ్బని మనోహర్(24)లను అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారని,మరో ఐదుగురికి తీవ్రంగా గాయాలు అయినట్లు బంధువులు పేర్కొంటున్నారు.

**తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందన :**

లండన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తమ కుమారుడు మృతి చెందడంతో తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం నుంచి వెంటనే స్పందిచారని, సిఎం పేషీ సిబ్బంది వచ్చి వివరాలు తెలుసుకున్నారని, సాధ్యమైనంత త్వరగా మృతదేహాలు తెప్పిస్తామని హామీ ఇచ్చినట్లు రాపోలు రిషికేష్ తండ్రి రవీందర్‌రావు, పెద్దనాన్న నాగేందర్‌రావు తెలిపారు. అక్కడి ప్రమాదంపై తెలంగాణ ప్రభుత్వం తగు సహకారం అందిస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి కార్యాలయం నుంచి కూడా తమకు సమాచారం అందిందని, మృతదేహాలు త్వరగా తెప్పించాలని మృతుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. గాయపడిన వారిలో కూడా కొందరి పరిస్థితి విషయంగా ఉందని, తమ కుమారుడు మూడునెలల క్రితమే లండన్ వెళ్లాడని, తల్లిదండ్రులను పోషించాల్సిన తమ కుమారుడు అకారణంగా మృత్యువాత పడడంతో తీవ్రంగా కలిచివేసిందని వారు కన్నీరు, మున్నీరు అయ్యారు. రిషికేష్ తాత, నాన్నమ్మలకు ఇంకా సమాచారం తెలియకపోవడంతో వారు ఏమి జరిగిందో తెలియక అయోమయంలో ఉన్నారు.

## 200 కోట్లు

>> అంచనా ప్రకారం రాష్ట్రంలోని 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు లెక్కించారు.రాష్ట్రం లో వర్షాల కారణంగా 1052 చోట్ల 1023 కిలోమీటర్ల మేర కు రోడ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ మౌళిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. భారీ వర్షాల సమయంలో 42 ఆపరేషన్లలో పాల్గొని 217 మందిని ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది రక్షించారు. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రభుత్వం వరదలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాలకు తక్షణ వరదసాయం కింద నిధులను మంజూరుచేసింది. ఇప్పటికిప్పుడు అత్యవసర సాయం కింద రూ.200 కోట్ల నిధు లను మంజూరుచేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## గ్రీన్ సిగ్నల్

>> అనుమతులు లభించడంతో వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శిని, మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 19 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు కొనసాగుతున్నాయి. వాటిల్లో 2990సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటు మెడికల్ కాలేజీలు 23 ఉండగావాటిలో 3,700సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటుమెడికల్‌కాలేజీలు 42ఉండగా వాటిలో 6690సీట్లు అందుబాటులో ఉన్నాయి.

# రాష్ట్ర ఆదాయం రూ.74,955 కోట్లు

## కొత్త రుణాలు రూ.24,670 కోట్లు

### రూ.68,823 కోట్ల వ్యయం, తగ్గిన పన్నుల ఆదాయం

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలలకు రాష్ట్ర ఖజానాకు 74,955 కోట్ల రూపాయల మేర ఆదాయం సమకూరింది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రుణాలు రూ.24,670 కోట్లు తీసుకుంది. ఇక రుణాల నిమిత్తం వడ్డీ చెల్లింపుల కింద రూ.9,355 కోట్లు ఖర్చు చేసింది. ఈ విషయాన్ని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం ప్రభుత్వం జూలై నాటికి వడ్డీ చెల్లింపుల కోసం 9, 355 కోట్లు ఖర్చు చేసింది. ఈ లెక్కన ప్రతీ నెలా చెల్లిస్తున్న వడ్డీ 2,338 కోట్లు కావడం విశేషం. మరోపక్క రోజు రోజుకు సర్కార్ ఖజానాకు ఆదాయం తగ్గుతూ వస్తోంది. రాష్ట్ర ఖజానాకు ప్రధాన ఆదాయ వనరులైన జీఎస్టీ, ల్యాండ్ రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, సేల్ టాక్స్, ఎక్సైజ్ ఆదాయం గడిచిన నాలుగు నెలల్లో పెరగకపోగా తగ్గుతూ వస్తుండటం సర్కార్‌కు మరింత గుదిబండగా మారింది. గతేడాది కంటే ఈ ఏడాది జీఎస్టీలో 3శాతం, సేల్స్ ట్యాక్స్‌లో 2శాతం, స్టేట్ ఎక్సైజ్ పన్నులో 2.50 శాతం, ల్యాండ్ రెవెన్యూ ఆదాయం 2.3 శాతం తగ్గింది. మరోవైపు అప్పులు మాత్రం ఈ నాలుగు నెలల్లో 45 శాతం రుణాలు చేసింది. జూలై చివరి నాటికి, రెవెన్యూ వసూళ్లు రూ.50,270 కోట్లుగా ఉన్నాయి. ఇది వార్షిక లక్ష్యం రూ.2.29 లక్షల కోట్లలో కేవలం 21.88 శాతం మాత్రమే. పన్ను వసూళ్లు అంచనాలలో 27.5 శాతం వద్ద సాపేక్షంగా మెరుగ్గా పనిచేశాయి మరియు రూ.1.75 లక్షల కోట్ల లక్ష్యంతో పోలిస్తే రూ.48,145.57 కోట్లుగా నమోదయ్యాయి. అయితే, పన్నుయేతర ఆదాయాలు (4.2 శాతం) మరియు కేంద్ర గ్రాంట్లు (3.5 శాతం) బాగా తగ్గాయి. వరుసగా రూ.1,334 కోట్లు మరియు రూ.790 కోట్లు మాత్రమే వచ్చాయి. ఖర్చుల విషయానికొస్తే, ప్రభుత్వం జూలై నాటికి రూ.68,823 కోట్లు లేదా వార్షిక కేటాయింపులో 26.1 శాతం ఖర్చు చేసింది. రెవెన్యూ వ్యయం ఒక్కటే రూ.62,835 కోట్లు ఖర్చయింది. జీతాలు, పెన్షన్లు, సబ్సిడీలు మరియు వడ్డీ చెల్లింపుల ద్వారా ఇది జరిగింది. రూ.36,504.45 కోట్ల వార్షిక లక్ష్యంలో 16.4 శాతం అంటే రూ.5,988 కోట్ల మాత్రమే ఉన్న పేలవమైన మూలధన వ్యయం ఆందోళనకరంగానే ఉంది.

# సిబిఐ విచారణ జరపండి

>> తెలిపారు. జస్టిస్ పిసి ఘోష్ విచారణ కమిటీకూడా లోపాలను గుర్తించిందని ఆయన తెలిపారు. ఎన్‌డిఎస్‌ఎ నివేదికలో వెలుగు చూసిన అంశాలను అసెంబ్లీలో చర్చించినట్లు రవి గుప్తా కేంద్రానికిరాసిన లేఖలోతెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ఆధారంగా జరిగే సిబిఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని ఆయన వెల్లడించారు. సిబిఐకి లేఖ రాయడంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై జస్టిస్ పిసి ఘోష్ నివేదిక, ఎన్‌డిఎస్‌ఎ నివేదిక, ఇతర విభాగాల నివేదికలను కూడా హోం శాఖ పంపింది. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల కలిగిన నష్టాలపై సిబిఐ విచారణే సరైందని అసెంబ్లీ అభిప్రాయ పడిందని, ఈ నేపథ్యంలోనే హోం శాఖ జిఓ జారీ చేసిందని అడ్వకేట్ జనరల్ హైకోర్టు కు మంగళవారం ఉదయం విన్నవించారు.

**రాష్ట్రంలో సిబిఐ ప్రవేశంపై వున్న నిషేధాన్ని తొలగిస్తూ జిఒ జారీ**

మరోవైపు రాష్ట్రంలో సిబిఐ ప్రవేశంపై వున్న జిఒ 51ను రద్దు చేస్తూ హోం శాఖ మరో జిఒ 104ను జారీ చేసింది. తెలంగాణలో సిబిఐ ప్రవేశంపై 2022 ఆగస్టులో నాటి బిఆర్ఎస్ సర్కారు నిషేధంవిధించడం తెలిసిందే. దీని తరువాత తెలంగాణలో సిబిఐ ఎలాంటి కేసులను నమోదు చేయలేదు. దీనిపై ఇప్పుడు నిషేధాన్ని తొలగిస్తూ తాజాగా జిఒ విడుదల అయ్యింది. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై సిబిఐ విచారణకు సహకరి స్తామని ఆ జిఓలో హోం శాఖ వెల్లడించింది. ఇందుకు సంబంధించి జస్టిస్ పిసి ఘోష్, ఎన్‌డిఎస్‌ఎ నివేదికలను అసెంబ్లీలో చర్చించిన విషయాలను హోం శాఖ తన జిఓలో పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్ర సంస్థల ప్రమేయం దృష్ట్యా ఇందులో జరిగిన అక్రమాలను వెలుగులోకి తెచ్చేందుకు సిబిఐవిచారణ జరపడం ఉత్తమమనిభావించి సర్కారు ఈనిర్ణయం తీసుకున్నట్లు హోంశాఖ వెల్లడించింది.

**కాళేశ్వరం ప్రాజెక్టుపై హోం శాఖ లేఖను అందుకున్న సిబిఐ**

ఇదిలావుండగా కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణ కోరుతూ రాష్ట్ర హోం శాఖ రాసిన లేఖను సిబిఐ అధికారులు మంగళవారం ఉదయం అందుకున్నారు. ఢిల్లీలోని సిబిఐ కేంద్ర కార్యాలయానికి ఈలేఖ వెళ్లగా దీనిపై అక్కడి అధికారులు వెంటనే రాష్ట్ర హోం శాఖకు అక్నాలెజ్‌మెంట్ పంపారు. దీంతో పాటు ఈ లేఖను కోఠిలోని జోనల్ సిబిఐ కార్యాలయానికి పంపారు. ఈ లేఖ ఆధారంగా జోనల్ సిబిఐఅధికారులు అన్నివివరాలు పరిశీలించి ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నారు. బుధవారం ఈ ప్రక్రియ పూర్తయ్యేవీలుంది. దీని తరువాత కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణ అధికారికంగా మొదలవుతుంది. అనంతరం ఈ కేసులో నిందితులుగా వున్నవారిని విచారించి తదుపరి చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

## వారం - వర్జ్యం

03-09-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
ఏకాదశి తె.4.21
పూర్వాషాఢ రా.11.04
వర్జ్యం : ఉ.7.16-8.54
దు.ఉ.11.43-మ.12.33
శుభసమయం: ఉ.5.30-6.30,సా.4.30-5.15
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** కుటుంబ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. శుభవార్తలు వింటారు.

**వృషభం:** ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. భూ తగాదాలు తీరి ఊరటచెందుతారు.

**మిథునం:**సహోదర, సహోదరి వర్గం వారికి విశేషంగా సహాయ, సహకారాలు అందించవలసి వస్తుంది.

**కర్కాటకం :**శ్రమకు ఓర్చి మీ వంతు సహాయం అందిస్తారు. ఆస్తుల విలువ అనూహ్యంగా పెరుగుతుంది.

**సింహం:** ఇంటి యందు శుభకార్యల ప్రస్తావన వుంటుంది. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**కన్య :** నూతన కాంట్రాక్టులు కైవసం చేసుకుంటారు. అనుకున్న పనులు దిగ్విజయంగా నెరవేరుస్తారు.

**తుల :**దూరపు బంధువుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.

**వృశ్చికం:** కుటుంబము నందు ఒడిదుడుకులను ఎదుర్కొంటారు. ఉద్యోగులకు బదిలీల సూచన.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులలో తొందరపాటు వద్దు, ఉద్యోగ యత్నాలు నిదానంగా నెరవేరుతాయి.

**మకరం:** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండడం చెప్పదగిన సూచన. వృత్తి వ్యాపారాలలో స్వల్ప మార్పులు.

**కుంభం:** జీవిత భాగస్వామితో ఏర్పడిన స్వల్ప విభేదాలు తొలుగుతాయి. వాహనయోగం.

**మీనం :** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సైబర్ నేరాల నివారణలో మరో ముందడుగు

## టిజిసిఎస్‌బి, ఐఐఐటి ఆధ్వర్యంలో సంయుక్తంగా వ్యూహాల్యాబ్స్, సైబర్ ఇన్నోవేషన్ హబ్ ఆవిష్కరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** దేశంలో సైబర్ నేరాల నివారణకు మరో ముందడుగు పడింది. సైబర్ నేరాల కట్టడికి, నేరగాళ్ల భరతం ప ట్టేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) చేబడుతున్న వినూత్న కార్యక్రమాలకు గచ్చిబౌలిలోని ఐఐఐటి చేయూత నందించింది. ఇందు కోసం రెండు సంస్థలు వ్యూహా ల్యాబ్స్, సైబర్ ఇన్నోవేషన్ హబ్ పేరిట నూతన ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాయి. ఈ కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం గచ్చిబౌలిలోని ఐఐఐటి క్యాంపస్‌లో డిజిపి జితేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఈ త రహా ఆవిష్కరణ ఏర్పాటవడం ఇదే తొలిసారి అని ఆయన అన్నారు. ఈ హబ్ ద్వారా స్టార్టప్‌లు, విద్యా సంస్థలు, పరిశ్రమలు కలిసి సైబర్ నేరాల కట్టడికి, భద్రతకు సంబంధించి ఆధునిక పరిష్కారాలను రూపకల్పన చేస్తాయని డిజిపి తెలిపారు. ఈ ఆవిష్కరణ లక్ష్యం ఆంత్రప్రెన్యూర్షిప్ ద్వారా ప్రోత్సహిస్తూ కొత్త ఆలోచనలను, పరిశోధనలకు నాంది పలకడం అని డిజిపి అన్నారు. దీంతో పాటు వీటిని ప్రోత్సహించడం, వినియోగించే ఉత్ప త్తులుగా మలచడం లక్ష్యమని ఆయన తెలిపారు. ఇందుకోసం టిజిసిఎస్‌బి, గచ్చిబౌలిలోని ఐఐఐటిల మధ్య ఎంఒయు కుదరిందని ఆయన తెలిపా రు. ఈ ఒప్పందం వల్ల పరిశోధన, శిక్షణ, ఇన్నోవేషన్, సామర్థ్య నిర్మాణం వంటి విభాగాల్లో సంయుక్తంగా కార్యక్రమాలను చేబడతామని ఆయన వెల్లడించారు. ఈ ఆవిష్కరణకు సంబంధించిన హబ్ కోసం ఐఐఐటి క్యాంపస్‌లో మూడు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో విశాలమైన ప్రాంగణం వుంటుందని డిజిపి చెప్పారు. సైబర్ డొమైన్‌కు సంబంధించిన ప్రత్యేక పరికరాలు, మౌలిక వసతులు కలిగిన ఈ కేంద్ర దేశంలోనే మొదటి కేంద్రం గా వుంటుందని ఆయన తెలిపారు. పోలీసు వ్యవస్థలో ఇది ఒక వినూత్న ప్రయత్నంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ ఈ హబ్ వల్ల అనేక ప్రయోజనాలు వుంటాయని తెలిపారు. సైబర్ నేరాల పరిశోధన, నేరగాళ్ల పట్టివేతకు ఇది ఎంతగానో ఉ పయోగపడుతుందని ఆమె తెలిపారు. సైబర్ నేరాల నివారణలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇప్పటికే దేశంలోనే తల మానికంగా వుండగా రాబోయే రోజుల్లో మరిన్ని ఫలితాలను అందుకో బోతుందని ఆమె అన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన హబ్‌లో డిజిటల్ భద్రత పరికరాలను అభివృద్ధి చేసే ఎకోసిస్టంను అందిస్తుందని ఆమె తెలిపారు. ఐఐఐటి డైరక్టర్ ప్రొఫెసర్ సందీప్ శుక్లా మాట్లాడు తూ సైబర్ సెక్యూరిటీ అనేది కేవలం సాంకేతిక సమస్య కాదని, సామాజిక సమస్య కూడా అని తెలిపారు.

పరిశోధన, ప్రతిభ, జ్ఞాన నిర్మాణంలో విద్యా సంస్థల పాత్ర కీలకంగా వుందని, భవిష్య త్తులో వ్యూహా ల్యాబ్స్‌లో శిక్షణ పొందిన వారు సైబర్ నేరాల కట్టడికి, ఇందుకు సంబంధించిన సంస్థలను రక్షించడంలో కీలకంగా ఉంటారని ఆయ న తెలిపారు. ఈ కార్య క్రమంలో టిజిసిఎస్‌బి ఎస్‌పి హార్షవర్ధన్ రాజు, ఐఐఐటి సభ్యులు నారాయణన్, సతీష్, రమేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలిలోని ఐఐఐటి ప్రాంగణంలో టిజిసిఎస్‌బి, ఐఐఐటి ఆధ్వర్యంలో జరిగిన వ్యూహా ల్యాబ్స్, సైబర్ ఇన్నోవేషన్ హబ్ ఆవిష్కరణలో పాల్గొన్న డిజిపి జితేందర్, టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ తదితరులు.

# అందరికి వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## మెడికల్ కాలేజి బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాన్ని ప్రారంభించిన మంత్రులు

### 310 పడకల ఆస్పత్రి, క్రిటికల్ కేర్‌లకు శంకుస్థాపనలు

**మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసి ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలలు నిర్మించి ప్రతి ఒక్కరికి వైద్యసేవలు అందించడం కోసం ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు వెళ్తుందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లాలోని మెడికల్ కాలేజి హాస్టల్‌ను ఆసుపత్రిని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దేవాదయ శాఖ మంత్రి కొండ సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ జాటోతు రామచంద్రునాయక్, ఎంపి బలరాంనాయక్ లతో కలసి ప్రారంభించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళినాయక్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మురళినాయక్ మాట్లాడుతూ 2022-23 సంవత్సరంలో జిల్లాలో మెడికల్ కాలేజి


హాస్టల్‌ను భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు

అకాడమిక్ తరగుతులు ప్రారంభమైయ్యాయన్నారు. 310పడకల ఆసుపత్రిని, క్రిటికల్ కేర్ ఆసుపత్రులకు శంకుస్థాపనలు చేశామన్నారు. గతంలో బిఆర్‌ఎస్ పార్టీ హడావిడిగా కళాశాల ఏర్పాటు కొరకు శంకుస్థాపనలు చేశారన్నారు. అదేవిధంగా వినాయక నిమజ్జనం, బతుకమ్మ నిమజ్జనానికి బతుకమ్మ ఘాట్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సలహాదారుని కొరగా వారు వెంటనే స్పందించి 2కోట్లతో పనులు చేస్తామని హామి ఇచ్చారు. జిల్లాలోని సీతానాగారం, నారాయణపురం, పంతుల్యాతండా గ్రామాలకు ఇప్పటి వరకు పట్టాలు రాలేదని వారికి పట్టాలు ఇప్పించాలని రెవెన్యూ మంత్రిని కోరారు. గిరిజన జిల్లా కావున రైతులు గడ్డిమందు తాగి అనేకమంది మరణిస్తున్నారని ఈ మందుకు సంబందించిన కంపెనీని రద్దు చేయాలని కోరారు.

వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలలో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. వైద్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటుందన్నారు. నర్సింగ్ కాలేజిల ద్వారా విద్యార్థిని విద్యార్థులకు ఉపాధి కల్పించడం కోసం ఇతర దేశాల భాషలపై నైపుణ్యత కల్పించడం కోసం వినూత్న కార్యక్రమం చేపడుతుందని తద్వారా ఆర్థికంగా స్థిరపడతారని అన్నారు. ఎన్సిడిని నియంత్రించాలని, అందుకు వైద్యశాఖ కృషి చేయాలన్నారు. అవయవాల మార్పిడి ద్వారా ఈస్టర్న్ తెలంగాణ హబ్‌గా మారాలని సూచించారు. వైద్యరంగంలో నూతన టెక్నాలజి వినియోగించి ముందుకు సాగాలన్నారు. జిల్లాకేంద్రంలో క్యాన్సర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం కోసం ప్రత్యేక కార్యాచరణ ద్వారా క్షేత్రస్థాయిలో ఆసుపత్రులు విద్యాసంస్థలు అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళికతో అభివృద్ధి సంక్షేమంపై ముందుకు సాగుతుందన్నారు. అదేవిధంగా జిల్లాకు 18టన్నుల యూరియా రావడం జరుగుతుందని ప్రతి ఒక్క రైతుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం కేంద్రంతో చర్చిలు జరిపి మరింత యూరియా కోటాను సాదించడం కోసం మంత్రివర్గం ఢిల్లీకి వెళ్లనుందని తెలిపారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా గిరిజన జిల్లా అయినందున పూర్తిస్థాయిలో అధిక నిధులు కేటాయించి జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందని అందులో భాగంగానే వైద్య, నర్సింగ్ కళాశాలను నిర్మించి మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు.

ఎంపి బలరాంనాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో గిరిజనులు అధికంగా ఉన్నారని మెడికల్ కాలేజికి భూములు ఇచ్చిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని అదేవిధంగా గిరిజనుల భూముల్లో హోంగార్డులు ఉంటున్నారని వారికి వెరే దగ్గర స్థలాన్ని చూపెట్టి గిరిజనుల భూములను గిరిజనులకు ఇప్పించాలన్నారు. మహబూబాబాద్ జిల్లాకు పి.జి కాలేజి మంజూరు చేయాలని, అదేవిధంగా ఎం.ఆర్.ఐ స్కానింగ్ సెంటర్‌ను కూడా తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఇంచార్జ ఝాన్సీ రెడ్డి, జిల్లా డిసిసి అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పి సుధీర్ రాంనాథ్‌కేకన్, అధనపు కలెక్టర్‌లు లెనిన్ వత్సల్‌టొప్పొ, అనిల్‌కుమార్, ఆర్డివో కృష్ణవేణి, డిఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, ఎన్‌ఎంసి రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ విమల తమస్, డియంహెచ్‌వో రవిరాథోడ్, డిపివో విజయనిర్మల, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లకావత్ వెంకట్, ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, సివిల్ సర్జన్ చింత రమేష్, తహాశీల్దారు రాజేశ్వర్, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 21న పాక్షిక సూర్య గ్రహాణం..

## భారత్‌లో కనిపించదు

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** ఈ ఏడాదిలో చివరి సూర్య గ్రహాణం ఈ నెల 21వ తేదీన సంభవించనుంది. ఈ ఏడాది ఇది రెండవ సూర్య గ్రహాణం కూడా కావడం గమనార్హం. భారత కాలమానం ప్రకారం రాత్రి 10.59 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున 3.23 గ ంటల వర కు ఈ గ్రహాణం వుంటుంది. అయితే ఈ పాక్షిక సూర్య గ్రహాణం భారత్‌లో కనిపించదని ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ కారణం గా భారత్‌లో ఆలయాల మూసివేత, సూతకాలం వంటివి వుం డవని ఆగమన పండితులు చెబుతున్నారు. సెప్టెంబర్ 21వ తేదీన సంభవించే పాక్షిక సూర్య గ్రహాణం ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, అట్లాంటిక్ మహా సముద్రం, అంటార్కిటికా, పసిఫిక్ మహా సముద్రం సహా యూరప్‌లోని పలు దేశాల్లో కనిపిస్తుంది. దీని తరువాత 2027 ఆగస్టు రెండవ తేదీన సంభవించే సంపూర్ణ సూర్య గ్రహాణం ఈ దశాబ్దంలోనే అతి పెద్దదని, ఇది భారత్‌లో కని పిస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

# నేటితో ముగియనున్న ఇంజినీరింగ్ కాలేజీల ముఖాముఖి విచారణ

## 130 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలతో ఎఫ్ఆర్‌సి ముఖాముఖి విచారణ పూర్తి

### వారం రోజుల్లో ఫీజుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించే అవకాశం

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రం లోని ప్రైవేటు ఇంజనీరింగ్, వృత్తి విద్య కోర్సుల్లో ఫీజుల నిర్ణయానికి సంబంధించిన ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీ పలు ప్రతి పాదనలు సమర్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలతో అధికారుల కమిటీ ప్రతిపాదించిన పారమీటర్లతో మరోసారి ముఖాముఖి విచారణ జరపాలని తెలంగాణ అడ్మిషన్లు, ఫీజు నియంత్రణ కమిటీ (ఎఫ్ఆర్‌సి) నిర్ణయించింది. అందులో భాగంగా ఆగస్టు 25 నుంచి ఈ నెల 3 వరకు కాలేజీలతో ముఖాముఖి విచారణ జరపడానికి షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇప్పటికే సుమారు 130 కాలేజీలకిపైగా విచారణ పూర్తయినట్టు తెలిసింది.

మరో 20 నుంచి 25 కాలేజీల విచారణ నేడు(బుధవారం) జరగనున్నట్టు తెలుస్తోంది. నేటితో ముఖాముఖి విచారణ పూర్తి కానుంది. అధికా రుల కమిటీ సిఫార సుల్లో ప్రధానంగా కాలేజీలు సమర్పించిన ఆడిట్ రిపోర్ట్‌కి తప్ప కుండా అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించిన నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న విచా రణలో సైతం ఆడిట్ రిపోర్ట్‌కి అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ఏఎఫ్ఆర్‌సి కాలేజీలను కోరినట్టు తెలిసింది.

బుదవారంతో ఏఎఫ్ఆర్‌సి ముఖాముఖి ముగిసిన తరువాత వారం రోజుల్లో కాలేజీలకు ఏఎఫ్ఆర్‌సి ప్రతిపాదించిన ఫీజులను ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

# రోజుకు 1.8 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి

## సింగరేణ సిఎండి బలరామ్

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** సింగరేణి గనుల్లో రోజుకు 1.8 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాలని ఆ సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ స్పష్టం చేశారు. ఇదే సమయంలో 2.10 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరగాలన్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో అన్ని విభాగాలు, అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని, ఇందులో అలసత్వాన్ని ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మార్కెట్‌లో పోటీని ఎదుర్కోవడానికి బొగ్గు నాణ్యత, ఉత్పత్తి వ్యయం తగ్గించడంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ముఖ్యంగా అన్ని ఏరియాల్లోనూ అనవసర దుబారాను నివారించి పొదుపు పాటించేలా ఏరియాల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఏడాది కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఉత్పత్తికి విఘాతం కలిగిందని, జరిగిన నష్టాన్ని పూడ్చుకుని, ప్రస్తుత లక్ష్యాలను సాధించడానికి ఇకపై గట్టి కృషి చేసి లక్ష్యాన్ని అధిగమించాలని తెలిపారు. కొత్త ప్రాజెక్టుల పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది ప్రారంభించనున్న కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని అనుమతులు వెంటనే సాధించాలని పేర్కొన్నారు. కొత్తగూడెంలో వీకే కోల్ మైన్, ఇల్లందులో జే కే ఓ సి గనులను త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది ప్రారంభించదలచుకున్న మూడు గనుల వల్ల 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థం పెరుగుతుందని, అలాగే వచ్చే ఏడాది ప్రారంభించాలనుకుంటున్న గనుల వల్ల మరో 10 మిలియన్ టన్నుల ఉత్పత్తిని పెంచుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

## మాజీ సర్పంచ్‌ల జెఎసి అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌లు బిల్లులు చెల్లించిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సర్పంచ్‌ల జేసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రజా భవన్‌లో ఇంచార్జ్ సెక్రెటరీ దివ్యశ్రీకి వినిత పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ..చాలామంది సర్పంచులు డబ్బులు అప్పులు చేసి వడ్డీలు పెరిగిపోతున్నాంతో ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదంలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోనే 20 అవార్డులు ఎంపిక చేస్తే 19 అవార్డులు సాధించిన ఘనత తెలంగాణ రాష్ట్ర సర్పంచులదని రాష్ట్ర అధ్యక్షుడు అలాంటిది ఇప్పుడు ఆత్మహత్యలు చేసుకుని పరిస్థితుల్లో ఉన్నారని ఇకనైనా ఓ ప్రభుత్వ ఆదుకోవాలన్నారు.

# ఐటి కారిడార్‌లో ప్రజారవాణా సేవల విస్తరణ




## త్వరలో 275 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి

### ఐటి సంస్థలకు అద్దెకు ఆర్‌టిసి బస్సులు

### ఐటీ సంస్థల ప్రతినిధులతో టిజిఎస్‌ఆర్‌టిసి ఎండి విసి సజ్జనార్ భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలో ప్రజా రవాణా సేవలను విస్తరించడం కోసం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్‌టిసి) నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఐటి సంస్థల ప్రతినిధులతో ఆర్‌టిసి ఎండి విసి సజ్జనార్ మంగళవారం సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్ ఆర్‌టిసి), అసోసియేటేడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా(అసోచామ్), తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్ మెంట్ కౌన్సిల్ (టీఎఫ్‌ఎంసీ) సంయుక్తంగా ఐటీ కారిడార్‌లో మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనపై సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని టెక్ మహీంద్ర క్యాంపస్‌లో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో అసోచామ్ సౌతర్న్ సెక్టార్ కో చైర్మన్, వర్చుసా వైస్ ప్రెసిడెంట్ కృష్ణ ఎదుల, టీఎఫ్ఎంసీ ప్రెసిడెంట్ సత్యనారాయణ మదాల, హెచ్‌ఆర్ హెడ్, టెక్ మహీంద్రా వినయ్ అగర్వాల్, ఆర్టీసీ ఈడీలు ముని శేఖర్, రాజశేఖర్, సిటీఎం శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు. ఐటీ కారిడార్ పరిధిలో ప్రజా రవాణా సేవలను మరింతగా విస్తరిస్తున్నామని విసి సజ్జనార్ తెలిపారు.

ఐటీ కారిడార్‌లో ప్రస్తుతం 200 ఎలక్ట్రిక్ బస్సులు సేవలందిస్తుండగా.. త్వరలోనే మరో 275 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. ఐటీ కారిడార్‌లో సాఫ్ట్ వేర్ ఉద్యోగుల రవాణా అవసరాలకు అను గుణంగా బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉద్యోగులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఐటీ కంపెనీలకు అద్దెకు బస్సులను ఇచ్చే సదుపాయాన్ని కల్పించామని సజ్జనార్ వెల్లడించారు. ఎలక్ట్రిక్ బస్సులతో పాటు మెట్రో డీలక్స్ బస్సులను అద్దెకు ఇస్తున్నామని, ఐటీ సంస్థలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రైవేట్ వాహనాల వినియోగం వల్ల ఐటీ కారిడార్ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను విని యోగించుకోవడం ఒక్కటే ట్రాఫిక్ నివారణకు ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. ప్రజా రవాణాను ఉపయోగించడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ప్రతి ఐటీ సంస్థ కూడా ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహించాలని, ఉద్యోగులకు ఆ దిశగా అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించుకునే ఉద్యోగులకు ప్రోత్సహకాలు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఈ సమావేశంలో ఐటీ కారిడార్‌లో అందిస్తోన్న రవాణా సేవలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్‌టిసి ఉన్నతాధికారులు వివరించారు. ఐటీ కారిడార్‌లో మెరుగైన రవాణా సేవల కోసం పలు ఐటీ సంస్థల ప్రతినిధులు సలహాలు, సూచనలు ఇవ్వగా.. వాటిని పరిగణలోకి తీసుకుంటామని అధికారులు ప్రకటించారు.

# అభయ్‌పాటిల్ నివాసానికి బండి సంజయ్

## రెండున్నర గంటలపాటు గడిపిన కేంద్రమంత్రి

### భారీఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు, ప్రజలు

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** అధికారిక పర్యటనలో భాగంగా మంగళవారం కర్ణాటకలోని బెళగావి జిల్లాకు విచ్చేసిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు స్థానిక ఎమ్మెల్యే, బిజెపి తెలంగాణ ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్ వెన్నంటి ఉన్నారు. ఉదయం బెళగావి ఎయిర్‌పోర్టులో బిజెపి నాయకులతో కలిసి ఘన స్వాగతం పలికిన అభయ్ పాటిల్, సాయంత్రం పర్యటన ముగించుకుని వెళ్లే వరకు ఉన్నారు. తొలుత ఎయిర్ పోర్టు నుండి అభయ్ పాటిల్‌తో కలిసి బెళగావి జిల్లాలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్)కు చెందిన కోబ్రా స్కూల్ ఆఫ్ జంగల్ వార్ ఫేర్ అండ్ టాక్టిక్స్ (సిఎస్ జేడబ్ల్యూటీ) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. అనంతరం అభయ్ పాటిల్ ఆహ్వానం మేరకు బెళగావి జిల్లా కేంద్రంలోని ఆయన నివాసానికి వెళ్లారు. అక్కడికి భారీగా తరలివచ్చిన బిజెపి నాయకులు, మహిళా నేతలు, కార్యకర్తలు తొలిసారి బెళగావికి విచ్చేసిన బండి సంజయ్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా నాయకులను అభయ్ పాటిల్ పరిచయం చేశారు. అక్కడి వచ్చిన వందలాది మంది కార్యకర్తలు సంజయ్, అభయ్ పాటిల్‌తో ఫోటోలు దిగారు. అనంతరం అభయ్ పాటిల్‌తో కలిసి భోజనం చేసిన బండి సంజయ్ అనంతరం కార్యకర్తలు, నాయకులకు అభివాదం చేస్తూ బెళగావి ఎయిర్‌పోర్టుకు చేరుకుని తిరిగి హైద రాబాద్ మీదుగా కరీంనగర్ బయలుదేరారు.

# మత్తు పదార్థాల గుర్తింపులో స్లీపర్ డాగ్స్ పనితీరు అద్భుతం

## ఎపి హోం మంత్రి అనిత




**విజయవాడ,సెప్టెంబరు 2, ప్రభాతవార్తప్రతినిధి:** మత్తు పదార్థాల గుర్తింపులో శిక్షణ పొందిన స్లీపర్ డాగ్స్ పనితీరు అద్భుతంగా ఉందని హోంమంత్రి అనిత అన్నారు. మంగళగిరి ఆరో బెటాలియన్ ప్రాంగణంలో 22న బ్యాచ్ పాసింగ్ అవుట్ పెరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు జాగిలాల ప్రదర్శన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రస్తుత జాగిలాల ప్రదర్శన,క్రమశిక్షణ చూసి తనకు ఆశ్చర్యం కల్గిందని హోంమంత్రి అనిత అన్నారు. మూగజీవాలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన సిబ్బందికి అభినందనలు తెలిపారు. ప్రతి జాగిలానికి రెండు అంశాల్లో శిక్షణనివ్వడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. వంద ఎకరాల్లో అప్పా నిర్మాణం చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు వెల్లడించారు. రేపల్లెలో... యువతిపై అత్యాచారం ఘటనలో ఎలాంటి ఆధారం దొరకలేదని తెలిపారు. డాగ్ స్క్వాడ్ వచ్చి ఆనవాళ్ళు గుర్తించాక 36 గంటల్లోనే పట్టుకున్నారన్నారు. పోలీసు జాగిలాల శిక్షణతో పాటు వాటి సంరక్షణపై కూడ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారుప. అనంతరం డిజిపి మాట్లాడుతూ...జాగిలాలకు ఏపీ పోలీసు చరిత్ర లోనే సరికొత్త శిక్షణ ఇచ్చామని తెలిపారు. డ్రగ్స్‌కు కూడ గుర్తించేలా ఈ శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో గంజాయి,డ్రగ్స్ పూర్తిగా నిరోధించాలని కార్యక్రమాలు చేపట్టనున్నారు. నిరంతరం నిఘా ఉంచి ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.



# చరిత్రలో నిలిచేలా అభివృద్ధి పనులు

## కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో మంత్రి సుడిగాలి పర్యటన

### అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

### అభివృద్ధి ఏజెండాగా ముందుకు ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి ప్రాధాన్యత

### రైతులకు మెరుగైన సేవలు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట):** రాష్ట్ర నీటిపారు దల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గాలలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కోదాడలో రూ. 5.10 కోట్లతో నిర్మించే ఇరిగేషన్ డివిజన్ కార్యాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 54 కోట్లతో కోదాడలో రాజీవ్ శాంతినగర్ ఎత్తిపోతల పథక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చిలుకూరు మండలం సీతారాంపురం లో 10 కోట్లతో నిర్మించే బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చింతలపాలెంలో 4 కోట్ల రూపాయలతో నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. 2.31 కోట్లతో హుజూర్నగర్ మండలం వేపల సింగారంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు అదేవిధంగా 6.50 కోట్లతో హుజూర్నగర్ లోని రాజీవ్ గాంధీ విగ్రహం నుండి మోడల్ కాలనీ వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. హుజూర్నగర్ మండలం లక్కవరం లో 2.20 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గాలలో అభివృద్ధి జరుగుతుందన్నారు. అభివృద్ధి ఎజెండాగా ముందుకు సాగుతున్నట్లు ఈ విషయంలో రాజీ పడేది లేదన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు మంజూరు చేయించి అభివృద్ధి పనులు వేగవంతం చేశామని మంత్రి పేర్కొన్నారు. తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి వానాకాలం, యాసంగి సీజన్లలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా కళకళలాడటం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులన్ని జలకళను సంతరించుకున్నాయన్నారు. కోదాడ నియోజకవర్గం మోతె మండలంలో సాగునీరు అందించేందుకు త్వరలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించి 45 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. నీటిపారుదల శాఖ అధికారులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కోదాడ నియోజకవర్గంలో 2.29 లక్షల ఎకరాలకు సాగునీరును పర్యవేక్షి ంచే అధికారులకు కార్యాలయము 4 అంతస్తులతో 12వేల చదరపు అడుగుల్లో నిర్మిస్తున్నట్లు వచ్చే జూన్ నాటికి నిర్మాణం పూర్తి గావించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కోదాడ నియోజకవర్గంలోని శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును 54.03 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నట్లు భారీ వరదలు వచ్చినప్పటికీ తట్టుకునే విధంగా ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు కింద పలు గ్రామాల్లో 2,138 మంది రైతు కుటుంబాలకు, 5000 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వము కృషి చేస్తుందన్నారు. విద్యారంగ అభివృద్ధికి విద్యార్థుల సంక్షేమానికి ఇన్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేసి భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు రెసిడెన్షియల్ విద్యా సౌకర్యం కల్పించేందుకే కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు ఈ పాఠశాలలను మంజూరు చేసి ప్రభుత్వము విద్యా రంగ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు.

వార్త

ఒక్కసారి కూడా నువ్వు కార్యాచరణకు పూనుకోకుండా లక్షల సార్లు ఆలోచించడం వల్ల ప్రయోజనం ఉండదు.

-గురునానక్

# కృత్రిమ మేధ వికటాట్టహాసం!


మా నవ మేధస్సును తోసిరాజని సాంకేతిక ప్రపంచంలోని వెన్ను విరుచుకుంటూ వచ్చిన 'కృత్రిమ మేధ' మానవ మేధస్సుతో ఆటలాడుకుంటోంది. కృత్రిమ మేధ ఒక విధంగా మానవాళిని హడలెత్తిస్తోంది. ఏ పేరుతో ఎలాంటి పరిస్థితుల్లో రూపకల్పన జరిగినా దుష్పరిణామాలు వెలుగు చూస్తున్నాయి. ఇటీవల కృత్రిమ మేధ వలన జరిగిన కొన్ని ఘటనల నేపథ్యంలో కృత్రిమ మేధ వికటాట్టహాసం చేస్తోందనే చెప్పాలి.. నాలుగు రోజుల క్రితం చాట్ జిపిటి సూచనలతో టీనేజర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఓపెన్ ఎఐపై తన కుమారుడి చావుకు కారణం చాట్ జిపిటేనంటూ కోర్టు కెక్కిన వైనమిది. తమ కుమారుడు పదహారేళ్ల ఆడమ్ రైస్‌ను చాట్ జిపిటి ఆత్మహత్యకు పురికొల్పిందన్నది వారి ఆరోపణ. ఇవన్నీ విచిత్రమైన ఆరోపణలే అయినా ఏ మాత్రం కొట్టేసే అంశాలు కావు. చాట్ జిపిటితో తమ కుమారుడు సంభాషిస్తున్నంత సేపూ దొర్లిన ఆలోచనలే అతని చావుకు దారితీసాయని వెల్లడి. ఆత్మహత్య విఫలమైతే తల్లిదండ్రులకు తెలియకుండా ఎలా దాచిపెట్టాలో, మద్యం ఎలా దొంగిలించాలో చాట్‌బాత్ వివరించేదన్నారు. చివరాఖరికి ఆత్మహత్య సందర్భంగా ఎలాంటి లేఖ రాయాలో కూడా చాట్ జిపిటి వివరించేదని పేర్కొన్నారు. దీనిపై ఓపెన్ ఎఐ సంస్థ సంజాయిషీ ఇచ్చుకోవల్సి వచ్చింది. పదిహేనేళ్లనాడు తమిళ దర్శకుడు శంకర్ నిర్మించిన 'రోబో' చిత్రంలో 'చిట్టి' పాత్రలో ప్రేమాభినివేశాలు పుట్టినట్లే. చాట్ జిపిటితో కూడా మానవ ప్రేరేపిత సంకల్పాల విషయమై స్పష్టంగా విశ్లేషణలు వస్తుంటాయి. వారికి సలహాలిచ్చి మరీ ఆత్మహత్యలకు పురికొల్పే దుర్ఘటనలను కృత్రిమ మేధ రూపకల్పన చేసినట్లు భావించాలి. అదే ధోరణిలో మానవుడు ఆలోచించడం చూస్తే మానవ ప్రేరిపిత ఆవేశకావేశాల కారణంగా మానవుల మధ్య విచక్షణారహిత ఆలోచనలను ప్రేరేపించడం కూడా జరిగితే మానవాళి ఏమయిపోతుందన్న ఆలోచన కూడా వచ్చినట్లు లేదు. దేశకాల మాన పరిస్థితులు భారతీయ సమాజాన్ని ఎక్కడికి తీసుకెళ్తున్నదీ ఆలోచించక లేకపోతోంది. తాజా పరిస్థితులను బట్టి కృత్రిమ మేధ వల్ల మానవ సమాజానికి చేటు తెచ్చే పరిస్థితి దాపురించింది. తమ చాట్‌బాత్‌లో ఉన్నత భద్రతా ప్రమాణాలున్నాయని ఓపెన్ ఎఐ సంస్థ వివరణ ఇచ్చినా అంతటితో సరిపోదు. సుదీర్ఘ సంభాషణ భద్రతా వ్యవస్థలు బలహీనపడినాపడొచ్చునని ఆ సంస్థ వ్యక్తం చేసింది. మరో సంఘటనలో మానవ సంకల్పిత ప్రతీకార చర్యను సూచించిన కృత్రిమ మేధ వలన ఓ తనయుడు తన తల్లిని అతి కిరాతకంగా చంపేశాడు. ఎవరి పాపమెంతో చెప్పలేకపోయినా ఓ మాజీ యాహూ టేకీ మాత్రం తనకు జన్మనిచ్చిన తల్లి ఆడమ్స్ కన్నా తాను నిరంతరం చాట్ చేసే చాట్ జిపిటి చెప్పే సూచనలు, విశ్లేషణలను అభిప్రాయాలను నమ్మి తల్లినే చంపేశాడు. ఉద్యోగం వదిలాక చాట్ జిపిటితో కాలక్షేపం చేస్తూ మానసిక ఒత్తిడికి గురయ్యేవాడు. కనెక్టికట్ నగరంలో స్టెయిన్ ఎరిక్ అనే ఇంజినీర్ ఆచర్చిలోనే తల్లిమీద ద్వేషంపెంచుకున్నాడు. భ్రమల ప్రపంచంలో బతికేవాడు. తనకు మానసిక ప్రవర్తన బాగోలేని వానిగా చిత్రీకరించి తల్లి తనను హత్య చేయబోతోందని నమ్మేవాడు. తల్లిని దోషిగా ఎంచాడు. చివరి శ్వాస వరకు తనతోనే ఉంటానని చాట్ జిపిటితో చెబుతూ దుష్కృత్యానికి ఒడిగట్టాడు. దుష్టశక్తుల విషయంలోనూ చాట్ జిపిటి సలహా తీసుకునేవాడు. అలా జరుగుతున్న సమయంలో ఒక రోజు తల్లిని విపరీతంగా గాయపరిచి తానూ గాయం చేసుకున్నాడు. తర్వాత ఆసుపత్రిలో తల్లి చనిపోయింది. ఎఐ ప్రభావంతో జరిగిన తొలి హత్యగా భావిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెల్లిజెన్స్ ఎంతటిదుష్ప్రభావాలను అందచేస్తుందో దీనినిబట్టి తెలుస్తోంది. ఇంతకు ముందు కృత్రిమ మేధతో తయారు చేసిన ఒక ప్రక్రియ క్లాడిబస్‌ను మార్పుచేయాలని చూసిన సందర్భంలో దాని రూపకర్త బ్లాక్ మెయిలింగ్‌కు గురయ్యాడు. చాట్ జిపిటి కారణంగా సమాజంలో దుష్కృత్యాలుగా ఎంచుకున్నసంగతులు, వికృత రూపాలు బయటపడి పౌరుల భద్రతకు ముప్పు ఏర్పడే ప్రమాదముంది. మానవుల మధ్యఆత్మీయ రక్తసంబంధాల పట్ల అనుమానం రేకెత్తించే విధంగా టూల్స్‌కి రూపకల్పన జరిగితే వచ్చే సమస్యలు ఇలాగే ఉంటాయి. వీటిపై మళ్లీ యుద్ధం చేయాల్సి వస్తుందేమో. ఎఐపై మానసిక విశ్లేషణల అంశాలపై ఎలాంటి వివరణలు, సూచనలు, ఇవ్వక్కర్లేని సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడం అవసరమే. జిపిటి 4.0వెర్షన్ వినియోగదారులప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా లాభార్జన కోసం ఓపెన్ ఎఐసంస్థ ఈ మాదిరి దురాగతానికి పాల్పడిందని బాధిత తల్లిదండ్రుల ఆరోపణలను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్ రూపకల్పనల్లో లోపాలు లేకుండా చూసుకోవాలి. ఒక విప్లవాత్మక సంకేతంగా భావిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను టెక్ దిగ్గజం బిల్‌గేట్స్ మరో కోణంలో కూడా విశ్లేషించారు. కృత్రిమ మేధ ఎంత అభివృద్ధి చెందినా మానవ మేధతో పోటీపడలేదని వ్యక్తం చేస్తున్నారు. సరికాదని అన్నారు. ఆశాభావాన్ని ఎవరూ కాదనలేరు. ప్రాక్టికల్‌గా చూస్తే కృత్రిమమేధ సమాజంలో ఎన్నోమోసాలకు కారణభూతమవుతోంది. దాని దుర్వినియోగం మొదలైంది. మనిషినే కృత్రిమ మేధ మింగేయగలదన్న ఆలోచనత తెలిసే సరికి సమాజం నిర్ఘాంతపోతోంది. సమాజ శ్రేయస్సుకోసం ఉపయోగపడుతున్న కృత్రి మేధ మానవ వినాశనానికి ఒక ఆయుధంగా తయారౌతోందంటే ఎవరూ హర్షించలేరు. ఒకపక్క కృత్రిమ మేధవలన ఎన్నో లాభాలుండొచ్చు. కానీ సహజ సృజనాత్మకతను మించింది లేదు. ఐనా ఎన్నో అద్భుతాలు వెలుగుచూస్తున్నాయి.

ఏ జీవినీ చంపొద్దు! ఎందుకంటే తిరిగి ప్రాణం పోసే శక్తి మనకు లేదు కాబట్టి.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య

ఏదైన మంచి సాధించాలనుకున్నప్పుడు శ్రమించే భావం, విమర్శలను భరించే సహనం ఉండాలి.



షేక్స్పియర్

## ప్రజావాక్కు



### విద్యార్థుల్లో పెరుగుతున్న ఒత్తిడి

ప్రస్తుత కాలంలో విద్యార్థుల్లో ఒత్తిడి స్థాయిలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. ఆశ్చర్యకరమేమిటంటే, ఈ సమస్య ఇప్పుడు ఉన్నత విద్యా స్థాయిలలోనే కాకుండా ప్రాథమిక తరగతుల నుంచే మొదలవుతోంది. చిన్న పిల్లలు చదువుతో పాటు ట్యూషన్లు, పోటీ పరీక్షల కోచింగ్, అదనపు కార్యకలాపాలు వంటి భారంతో మానసికంగా నలిగిపోతున్నారు. తల్లిదండ్రులు పిల్లలభవిష్యత్తుపై ఉన్న ఆందోళనతో వారిని చాలా చిన్న వయస్సులోనే పోటీ వాతావరణంలోకి నెట్టేస్తున్నారు. ఫలితంగా ఆటపాటలు, సృజనాత్మకత, సామాజిక పరిజ్ఞానం వంటి అంశాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. చదువుపట్ల ఆసక్తి పెరగాల్సిన వయసులో, భయం, ఒత్తిడి, నిరుత్సాహం ఎక్కువవడం ఆందోళన కలిగించే విషయం. ప్రభుత్వం, పాఠశాలలు, తల్లిదండ్రులు కలసి ఈ సమస్యను గమనించి పరిష్కార మార్గాలు అన్వేషించాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం స్థానికసంస్థలలో బీసీ సామాజిక వర్గానికి 42శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించనున్నది. అదే తరహాలో వికలాంగులకు స్థానిక ఎన్నికలలో 5 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి. రాజ్యాంగం ప్రకారం ఎన్నికల కమిషన్ ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తుంది. అదే తరహాలో వికలాంగులకు కూడా రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి. ఈ దేశంలో వికలాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ల డానికిగాను సమ స్యలను పరిష్కరించుకోవడానికి గాను చట్టసభలలో వికలాంగుల ప్రాతినిధ్యం ఉండాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### బదలీలకు షెడ్యూల్ ప్రకటించాలి

ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ప్రిన్సిపల్స్, పీజీటీలు, టీజీటీల బదలీలను నిర్వహించాలని దీనికి సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టీచర్స్ కోరుతున్నారు. డీఎస్సీ 2025 నిర్వహణకు ముందు బదిలీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలి. డీఎస్సీ 2018 ద్వారా నియమితులైన మోడల్ స్కూల్స్ సిబ్బందికి ఈ అవకాశాన్ని కల్పించాలి.

- సురేష్, ఆంధ్రప్రదేశ్

### హద్దులెరిగిన స్నేహం

చైనా, భారత్ మరలా స్నేహ యుగళగీతం అందుకోవడం ముదావహం. రెండు దేశాలదీ హద్దులెరిగిన స్నేహమే కనుక ఇబ్బందేమీ లేదు. అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికా అహంకార ధోరణి, శత్రు, మిత్ర బేధం లేకుండా అందరికీ ఒకేలా పన్నులు వడ్డించడం వల్ల నిన్నటిదాకా ప్రత్యర్థులుగా మెలిగిన భారత్, చైనాలు తమలో దాగిన స్నేహాన్ని గుర్తించి, పెద్దపీట వేస్తున్నాయి. తమ మధ్య భేదాలకు కారణమైన సరిహద్దు సమస్య కూడా కూర్చుని పరిష్కరించుకోవాల్సిన సమస్యే తప్ప అలవికానిది కాదని చెప్తున్నాయి. అలాంటి చిన్న చిన్న విషయాలు స్నేహానికి, కలిసి ఎదగడానికి అడ్డు రాకూడదని భావిస్తున్నాయి. ఇది అవసరార్థపు కలయిక అయినంత మాత్రాన తక్కువదేమీ కాదు. ఇరుగు పొరుగు దేశాలు వాణిజ్యంలో సహకరించుకుంటే ఇరువురికీ మేలు.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### నీటి కుంటలను ఏర్పాటు చేయాలి

కేంద్ర ప్రభుత్వం తూర్పు రాష్ట్రాలకు పూర్వోదయా ప్రణాళిక అమలు చేసినట్టు ఈశాన్య రాష్ట్రాలకు అష్టాలక్ష్మి ప్రణాళిక అమలు చేసినట్టు భూపరివేష్టిత రాష్ట్రాలకు ఎందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయదు అనేదే ఇప్పుడు పెద్ద ప్రశ్న. నర్మద చెంబల్ నది లోయలో ఉండే మధ్యప్రదేశ్ గాని కృష్ణ గోదావరి నది లోయలో ఉండే తెలంగాణ కానీ ఖనిజ సిరులకు ఆలావాలం అయిన జార్ఖండ్ చత్తీస్గఢ్ లాంటి రాష్ట్రాలకు ప్రత్యేక ప్రణాళిక అవసరం. అంత మాత్రమే కాదు నీటిని ఆపడం నీటిని భూమిలోకి ఇంకించడం ఈ ఏడూ రాష్ట్రాలకు ముఖ్యం. కాబట్టి ఉపాధి హామీ ద్వారా రైతుల భూముల్లో నీటి కుంటలు పార్కులేషన్ టాంక్స్ తవ్వించడం అవసరం.

- భారత అవినాష్, జనగామ

### జనావాసాలకు దూరంగా మద్యం షాపులు

ఇటీవల ఏపిలో కొత్తగా ఏర్పాటుచేసిన మద్యం విక్రయ కేంద్రాలు కొన్ని నగరాలలో జన వాడల మధ్య ఉంటున్నాయి. దీనికి తోడు వివిధ జంక్షన్‌లోకి వచ్చే జనం ఆ మార్గం గుండా వస్తారు. మద్యం సేవకులు మోతాదు ఎక్కువై అక్కడ ఇతరులతో ఘర్షణలు శృతి మించి కొట్టు కుంటూ ఆ దృశ్యం భయం కలుగుతున్నది. కుటుంబాల ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇకపై కొత్త షాప్ లకు ప్రదేశం కాస్త దూరంగా ఉంటే ఈ సమస్య కొంత తగ్గుతుంది.

- బొల్లోజు మేఘానద్, విశాఖపట్నం

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అఫ్ఘానిస్థాన్‌లో ప్రకృతి ఆగ్రహం, మానవ విషాదం

**అఫ్ఘానిస్థాన్ ఈ విషాద వలయం నుండి బయటపడాలంటే కేవలం అత్యవసర సహాయం సరిపోదు. అంతర్జాతీయ సమాజం దీర్ఘకాలికంగా, వ్యూహాత్మకంగా సహాయం అందించాలి. సాధారణ ఇటుకలు, మట్టితో కాకుండా, భూకంపాలను తట్టుకునే నిర్మాణ పద్ధతులను, తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతికతలను వారికి పరిచయం చేయాలి. ఉదాహరణకు, బలంగా ఉండే కలప నిర్మాణాలు లేదా ఉక్కు చట్రాలను ఉపయోగించడం. భూకంపాల గురించి ప్రజలకు ముందుగా హెచ్చరికలు జారీ చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. సహాయక బృందాలకు శిక్షణ ఇవ్వడం, నిధులు సమకూర్చడం, అత్యవసర సామాగ్రిని నిల్వ చేయడం చాలా అవసరం. పాఠశాలలు, గ్రామాలు, ఇతర సంస్థల ద్వారా భూకంపాల సమయంలో ఎలా వ్యవహరించాలో ప్రజలకు తెలియజేయడం, విపత్తు నిర్వహణ ప్రణాళికలను రూపొందించడం ముఖ్యం. అఫ్ఘానిస్థాన్ ప్రభుత్వం అంతర్జాతీయ సమాజంతో తిరిగిసంబంధాలు ఏర్పరచుకొని, విపత్తు నిర్వహణకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని పొందాలి. ఈ విషయంలో ప్రపంచ దేశాలు కూడా సహకరించాలి.**

డి జె మోహన రావు

రెండువేల ఇరవై ఐదు ఆగస్టు 31న తూర్పు అఫ్ఘానిస్థాన్‌లోని పక్టికా ప్రావిన్స్‌ను ఒక భయంకరమైన భూకంపం కుదిపేసింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.0గా నమోదైంది. ఈ భూకంపంలో 800 మందికి పైగా ప్రజలు చనిపోయారు. వేలాది మంది గాయపడ్డారు. వారి నివాసాలు ధ్వంసమయ్యాయి. ఇలాంటి భూకంపాలు ఇతర దేశాల్లోనూ జరుగుతాయి. కానీ అక్కడ ప్రాణనష్టం అంత పెద్ద సంఖ్యలో ఉండదు. ఎందుకు? దీనికి కారణం అక్కడ నిర్మాణాల నాణ్యత. భూకంపాలు తరచుగా వచ్చే జపాన్, చిలీ, టర్కీ వంటి దేశాలు కఠినమైన భవన నియమావళి అమలు చేస్తాయి. సాధారణ గృహాలు కూడా భూకంపాల ఒత్తిడిని తట్టుకునేలా నిర్మించబడతాయి. కానీ అఫ్ఘానిస్థాన్‌లో పరిస్థితి విరుద్ధం. గ్రామాల్లో ఎక్కువ ఇళ్లు మట్టిమన్ను, మట్టి ఇటుకలు, గట్టిపడని రాళ్లతో కట్టబడతాయి. ఒక్క ప్రకంపన చాలు, మొత్తం గోడ కూలిపోతుంది. ఇలాంటి బలహీన నిర్మాణాల వల్లనే తక్కువ తీవ్రత గల భూకంపం కూడా వేలాది ప్రాణాలను బలి తీసుకుంటుంది. అఫ్ఘానిస్థాన్ ఒకప్పుడు గొప్ప నాగరికతలకు నిలయం. కానీ దశాబ్దాలుగా అది యుద్ధాలు, ఘర్షణలు, మానవతా సంక్షోభాల కబంధ హస్తాల్లో చిక్కుకుంది. ఈ మానవ నిర్మిత విలయానికి తోడు, నిరంతరం సంభవించే ప్రకృతి విపత్తులు ఆ దేశ ప్రజల జీవితాలను మరింత దుర్భరం చేస్తున్నాయి. ముఖ్యంగా, భూకంపాలు అఫ్ఘానిస్థాన్ భౌగోళిక పరిస్థితులలో ఒక భయంకరమైన సత్యంగా మారాయి. 2025 ఆగస్టు 31న తూర్పు అఫ్ఘానిస్థాన్‌లో సంభవించిన భూకంపం కేవలం ఒక ప్రకృతి వైపరీత్యం కాదు. అది భూగర్భ శక్తులు, బలహీనమైన పాలన, తీవ్రమైన పేదరికం కలగలిసి సృష్టించిన ఒక భయంకరమైన విషాదం. అఫ్ఘానిస్థాన్ భూకంపాలకు నిలయంగా ఉండటానికి ప్రధాన కారణం దాని అసాధారణ భౌగోళిక స్థానం. ఈ దేశం ప్రపంచంలోనే అత్యంత క్రియాశీల టెక్టోనిక్ ప్రాంతాలలో ఒకటైన భారత, యురేషియన్ టెక్టోనిక్ ప్లేట్ల మధ్య ఉంది. భారత ప్లేట్ నిరంతరం ఉత్తరం వైపు కదులుతూ, యురేషియన్ ప్లేట్‌తో బలంగా ఢీకొంటోంది. ఈ నెమ్మదిగా జరిగే ఘర్షణ వల్ల హిమాలయాలు వంటి పర్వతాలు ఏర్పడ్డాయి. ఈ ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ ప్లేట్ల మధ్య నిరంతర ఒత్తిడి పేరుకుపోయి ఒక్కసారిగా విడుదలైనప్పుడు భూకంపాలు సంభవిస్తాయి. అఫ్ఘానిస్థాన్‌లోని హిందూకుష్ పర్వత శ్రేణులు, పాకిస్థాన్ వైపు ఉన్న చమన్ ఫాల్ట్ వంటివి ఈ ఒత్తిడికి ప్రధాన కేంద్రాలు. 2025లో సంభవించిన భూకంపం కేవలం 6.0 తీవ్రత ఉన్నప్పటికీ, దాని ప్రభావం అపారంగా ఉండటానికి కారణం దాని తక్కువ లోతు. సాధారణంగా భూకంపాలు భూమి లోపల చాలా లోతులో సంభవిస్తాయి. కానీ ఈ భూకంపం కేవలం 810 కిలోమీటర్ల లోతులో సంభవించడంతో దాని శక్తి భూమి ఉపరితలంపై నేరుగా వ్యాపించి తీవ్రమైన ప్రకంపనలను సృష్టించింది. ఇది ఇళ్లు, రోడ్లు, ఇతర నిర్మాణాలపై విధ్వంసకర ప్రభావాన్ని చూపింది. భూకంపం ప్రకృతి వైపరీత్యం కావచ్చు. కానీ ప్రాణనష్టం, ఆస్తి నష్టం ఎక్కువగా ఉండటానికి



ప్రధాన కారణం మానవ వైఫల్యం. దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్యుద్ధాలు, రాజకీయ అస్థిరత, ఆర్థిక క్షీణత వల్ల అఫ్ఘానిస్థాన్ బాగా బలహీనపడింది. దీనివల్ల దేశంలో మౌలిక సదుపాయాలు పూర్తిగా కుప్పకూలాయి. అఫ్ఘానిస్థాన్‌లోని చాలా గ్రామీణ ప్రాంతాలలో ఇళ్లు మట్టితో, మట్టి ఇటుకలతో లేదా సరిగా పటిష్టం చేయని రాళ్లతో నిర్మించబడ్డాయి. ఈ రకమైన నిర్మాణాలు భూకంపాల వల్ల వచ్చే ప్రకంపనలను తట్టుకోలేవు. భూకంపం రాగానే అవి క్షణాల్లో కూలిపోయి, నిద్రలో ఉన్న ప్రజల ప్రాణాలను హరించాయి. భూకంపాల ప్రమాదం ఉన్నప్పటికీ, వాటిని తట్టుకునే నిర్మాణ ప్రమాణాలు అమలులో లేకపోవడం ఈ విధ్వంసానికి ప్రధాన కారణం. భూకంపం సంభవించినప్పుడు సహాయక చర్యలు చేపట్టడానికి ఒక పటిష్టమైన, సమన్వయ వ్యవస్థ అఫ్ఘానిస్థాన్‌లో లేదు. తాలిబాన్ ప్రభుత్వం అంతర్జాతీయ సమాజం నుండి వేరుపడటం వల్ల సహాయం ఆలస్యంగా చేరుకుంది. అలాగే, దేశంలోని కొండ ప్రాంతాలు, దుర్గమమైన రహదారులు సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకోవడానికి అడ్డంకులుగా మారాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి అత్యంత కీలకమైన మొదటి కొన్ని గంటలు వృథా అయ్యాయి, ఫలితంగా ప్రాణనష్టం మరింతపెరిగింది. 2025 భూకంపం అఫ్ఘానిస్థాన్‌కు కొత్త కాదు. ఈ దేశ చరిత్ర అనేక విధ్వంసకర భూకంపాల జ్ఞాపకాలతో నిండి ఉంది. 1998 తఖర్ భూకంపం ఉత్తర అఫ్ఘానిస్థాన్‌లో సంభవించి దాదాపు 4,000 మందిని బలిగొంది. ఇది గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎంతగా ప్రమాదంలో ఉన్నారో ప్రపంచానికి తెలియజేసింది. 2015 హిందూకుష్ భూకంపం అఫ్ఘానిస్థాన్‌లో సంభవించి, పాకిస్థాన్, భారతదేశం వరకు ప్రభావం చూపింది. మరణాల సంఖ్య పెద్దగా లేకపోయినా, ఈ భూకంప తీవ్రత ఆ ప్రాంత ప్రమాద స్థాయిని స్పష్టం చేసింది. 2022 పక్టికా భూకంపం 2025 నాటి భూకంపంలాగే తక్కువ లోతులో సంభవించి 800 మందికి పైగా ప్రాణాలను బలిగొంది. 2023 హెరాత్ భూకంపం అఫ్ఘనిస్థాన్ పశ్చిమ ప్రాంతాన్ని దెబ్బతీసి, వేలాది మంది ప్రాణాలను హరించింది. ఈ భూకంపాలు అఫ్ఘానిస్థాన్ ప్రజలకు సహజ విపత్తు అనేది కేవలం ఒక అత్యవసర పరిస్థితి కాదని అది వారి జీవితంలో ఒక నిరంతర భాగమని స్పష్టం చేశాయి. అఫ్ఘానిస్థాన్ ఈ విషాద వలయం నుండి బయటపడాలంటే కేవలం అత్యవసర సహాయం సరిపోదు. అంతర్జాతీయ సమాజం దీర్ఘకాలికంగా, వ్యూహాత్మకంగా సహాయం అందించాలి. సాధారణ ఇటుకలు, మట్టితో కాకుండా, భూకంపాలను తట్టుకునే నిర్మాణ పద్ధతులను, తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతికతలను వారికి పరిచయం చేయాలి. ఉదాహరణకు, బలంగా ఉండే కలప నిర్మాణాలు లేదా ఉక్కు చట్రాలను ఉపయోగించడం. భూకంపాల గురించి ప్రజలకు ముందుగా హెచ్చరికలు జారీ చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. సహాయక బృందాలకు శిక్షణ ఇవ్వడం, నిధులు సమకూర్చడం, అత్యవసర సామాగ్రిని నిల్వ చేయ డం చాలా అవసరం. పాఠశాలలు, గ్రామాలు, ఇతర సంస్థల ద్వారా భూకంపాల సమయంలో ఎలా వ్యవహరించాలో ప్రజలకు తెలియజేయడం, విపత్తు నిర్వహణ ప్రణాళికలను రూపొందించడం ముఖ్యం. అఫ్ఘానిస్థాన్ ప్రభుత్వం అంతర్జాతీయ సమాజంతో తిరిగిసంబంధాలు ఏర్పరచుకొని, విపత్తు నిర్వహణకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని పొందాలి. ఈ విషయంలో ప్రపంచ దేశాలు కూడా సహకరించాలి. 2025 ఆగస్టు 31న సంభవించిన భూకంపం కేవలం ఒక విపత్తు కాదు, ఇది అఫ్ఘానిస్థాన్ ప్రజల నిరంతర బాధలకు ఒక దర్పణం. ఈ విషాదం నుండి ప్రపంచం పాఠాలు నేర్చుకొని, అఫ్ఘానిస్థాన్‌కు భవిష్యత్తులో వచ్చే భూకంపాలను తట్టుకునేలా బలం చేకూర్చాలి. లేకపోతే, భౌగోళిక శక్తులు మానవ దుర్బలత్వం కలిసి ఇలాంటి అనేక విషాదాలను సృష్టిస్తూనే ఉంటాయి. ●

# భూమి 'కేంద్రం'గా పోరాటాలు ఇంకెంతకాలం?

గుర్రం రాంమోహన్ రెడ్డి

దున్నేవాడికి భూమి నినాదం ఎలా వున్నా అందరికి భూమి సమానంగా దక్కాలి. భూమి అనేది ఆత్మ గౌరవానికి ప్రతీక, రాజ్యాంగంలో పేర్కొన్నట్టుగా అందరికి భూమి సేద్యం చేసుకొని ఉపాధి పొందాలని, నిర్దేశించినప్పటికి అందుతుందా అవలోకనం చేసుకోవాలి. ఎన్ని ఉద్యమాలు జరిగిన భూమి చుట్టే ఆ పోరాటాలు సాగుతున్నాయి. భూ నినాదమే ఉద్యమాలకు ఊపునిస్తున్నాయి. పేదలను కదలిస్తున్నాయి. భారత రాజ్యాంగ నిర్మాత భారత రత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన మాటలను మనం మననం చేసుకోవాలి. భూమిని జాతీయం చేయాలని ఏళ్ల క్రితం అంబేద్కర్ చెప్పారు. ఇది నిజం అయింది. అవతు తోందా? అని.. బుద్ధి జీవులు శ్రమ జీవులు, ఆలోచనపరులు శ్రమికులు, విశ్లేషణ చేసుకోవాలి. ఎవరికి భూమిదక్కాలి ఎందుకు దక్కాలి, నా భూములు నాకు. నేనే జమిందారున్ని, నేనే భూస్వామిని, కష్టా జీవులు అలానే వుండాలి అనే మానవనైజాన్ని ఎవరు మార్చగలరు. భూమి అందరికి వుండాలి. వ్యవసాయం పంటలకు గిట్టుబాటు ధర ప్రభుత్వాలు చెల్లించాలి. రైతులు పండించిన పంటపై 50శాతం అదనంగా చెల్లించాలని పద్మ విభూషణ్ డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ చేసిన సిఫార్సులు ఎంతవరకు అమలు అవుతున్నాయన్న అంశాన్ని ఆలోచించాలి. రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో ఏ పోరాటాలు జరిగిన 'భూమి' కేంద్రంగా సాగుతున్నాయి. ఎస్సీలు, ఎస్.టి.లు గిరిజనులు, ఆదివాసులు, గొండలు ఇతర వర్గాలు భూమిని నమ్ముకొని బ్రతుకు బండి లాగిస్తున్నారు. ఒక మనిషికి సగటుగా ఎంత భూమి ఉండాలి అన్నదే ప్రశ్న. ఆసియా, యూరప్, ఆఫ్రికా, అమెరికా లాటిన్ తదితర ఖండాల్లో సగటున ఒక వ్యక్తి 8.7ఎకరాల భూమి ఉండగా భారత దేశంలో సగటు వ్యక్తికి 0.58 ఎకరాల భూమి మాత్రమే ఉంది. సంపన్నులు, భూస్వాములు చేతుల్లో వందలు, వేల ఎకరాల్లో భూమి ఉంది. సామాన్యుల చేతుల్లో గుంట, రెండు గుంటలు, 5 గుంటలు, 10 గుంటలు, 20గుంటలు, 30 గుంటలు, మహా అంటే ఒక ఎకరం, 2ఎకరాలు తప్పా భూమి ఏది? అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. రష్యాలో ఒక వ్యక్తి 7.5



ఎకరాలు, బ్రెజిల్లో 7 ఎకరాలు, చైనాలో 6.5 ఎకరాలు జర్మనీలో 5.6 ఎకరాలు. జపాన్లో 5 ఎకరాలు, భూమి ఉంటే భారత దేశంలో సగటు మనిషికి 0.58 ఎకరాల భూమి మాత్రమే ఉంది. అసలు భూమి ఎందుకు అందరికి సమానంగా లేదు. దీనికి కారణం ఎవరు? రాజకీయ పక్షాలు ఎన్నికల ముందు భూమిలేని పేదలకు భూములు పంచుతాం అని వల్లిస్తారు. కాని ఆచరణలో రూపం దాల్చిన దాఖాలు లేవు. తెలంగాణ లో ఒక కోటికి పైగా పంటలు సాగు చేస్తున్నారు. పేదలు సేద్యం చేసే భూములు తక్కువే. 96శాతం వరి, 34 శాతం మొక్కజొన్న, 14 శాతం పత్తి పండిస్తుండగా సగటున పేదలు ఒక ఎకరం, అర ఎకరం కాస్త అయితే 5 ఎకరా లకు మించి లేదు. 40 నుంచి 60 లక్షల ఎకరాల అటవి, దేవదాయ, ప్రభుత్వ బంజరు భూములు తెలంగాణలో వున్నప్పటికీ ఈ భూములు సంపన్న చేతుల్లో వున్నాయి. తెలంగాణలో ఒకప్రజా ప్రతినిధికి ఏకంగా 800 ఎకరాల భూమి ఉంది. ఇలాంటి భూస్వాములు ఎంతో మంది ఉంటారు. రాష్ట్రంలో 3.6 ఎకరాలు, కర్ణాకలో 4.3 ఎకరాలు, కేరళలో 2.6 ఎకరాలు, ఒడిస్సాలో 3.5 ఎకరాలు, బెంగాల్ 4.3 ఎకరాలు, బీహార్లో 1.5 ఎకరాలు, జార్ఖండ్లో 1.3 ఎకరాలు, బి.జె.పి పాలిత రాష్ట్రాలో 1.5ఎకరాల భూమి సగటు రైతుకు ఉంది. సబ్కా వికాస్ అని నినాదం వల్లిస్తున్న పాలకులు ఎవరి వికాసం కోసం పని చేస్తున్నరన్నదే ప్రశ్న. రిలయన్స్ అధినేత చేతుల్లో వేల ఎకరాలు. దేశంలోనే అతి పెద్ద మామిడితోట ఆయన చేతుల్లోనే ఉంది. ప్రపంచ మార్కెట్ను శాసిస్తుంది. భూమి కోసం కార్మికులు, రైతులు, పీడితులు, భూమికోసం ఏకంగా పోరుసాగిస్తున్న పుటికి పాలకులు ఎన్నికల నినాదాల వరకు పరిమితం అవుతున్నారు తప్ప సగటు బడుగు జీవి ఆత్మ గౌరవ అయినప్పటికి అయిన భూమిని అందరికి పంచడం లేదు. ఏ పోరాటం చేసిన భూమి' ప్రధాన ఎజెండగా నిలిచింది. సం పన్నులు పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులనకు పాలకులు అప్పనంగా ప్రభుత్వ భూమిని అప్పగిస్తున్నారు తప్ప.. పేదవాడి గుండె చప్పుడు వినిపించ దంలేదు. సగటు మనిషికి ఆస్తులు, అంతస్తులు లేకున్నా భూమి ఉంటే ఆత్మ గౌరవాన్ని ప్రతిబింబిస్తుందన్న విషయం వాస్తవం కాదా "మా భూమి మాకు కావాలని తొలినాళలో పోరాటాలు చేసి విజయం సాధించారు. సగటు జీవికి భూమి ఇవాల్సిన బాధ్యత పాలకులపై లేదా అన్న ప్రశ్నలు వెలుగు చూస్తున్నాయి. ●

# భారత్, అమెరికా బాంధవ్యంపై నీలినీడలు..

జయసూర్య

భారత్ ఆర్థిక రంగం 4.19 లక్షల కోట్ల డాలర్ల జిడిపితో జపాన్‌ను పక్కకు నెట్టి ప్రపంచంలో నాలుగో పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించి ఒక కొత్త చరిత్ర సృష్టించింది. 11 సంవత్సరాల అధికార కాలాన్ని పూర్తి చేసుకొన్నప్రధాన మంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో భారత్, అమెరికా ఇరు దేశాల మధ్య ఇండో, పసిఫిక్ వ్యూహాత్మక భాగస్వామ్యం నుంచి వాణిజ్యం, సాంకేతికత, ఉగ్రవాద నిరోధకత, ఇంధనం ప్రధాన అంశాలుగా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 13న, అమెరికా శ్వేతసౌధంలోని ఓవల్ కార్యాలయంలో మన ప్రధానితో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమావేశం ప్రపంచవ్యాప్తంగా ఆకట్టుకుంది. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ట్రంప్ లక్ష్యం 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్(మాగా), వికసిత భారత్ అంటే మేక్ ఇండియా గ్రేట్ ఎగైన్ (మిగా) రెండూ మరింత భాగస్వామ్యంతో 'మెగా' అవతరింప చేస్తుందని ఆద్వైపాక్షిక సమావేశం దిశానిర్దేశం అందించింది. అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్, జనవరి 20న ప్రమాణస్వీకారం చేసి, 2025 సంవత్సరాన్ని సంచలన నిర్ణయాలతో ప్రభావితం చేస్తున్నాడు. 47వ దేశాధ్యక్షుడైన ట్రంప్ శాంతిదూత, నోబెల్ విజేత అనిపించుకోవాలనే తాపత్రయం స్పష్టమవుతోంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి త్వరగా ముగింపు పలకాలని, ట్రంప్ యంత్రాంగం నిర్ణయించి రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించే విధంగా ప్రపంచంలో ఒత్తిడి తేవటానికి వాణిజ్య యుద్ధానికి తెరతీసాడు. అగ్రరాజ్యాధిపత్యం, వ్యక్తిగత ప్రతిష్టా ప్రలోభంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ట్రంప్ ధోరణి, పాక్ ఇండియాల మధ్య ప్రగల్భాలను ఇండియా నిర్ద్వందంగా జూలైలో త్రోసిపుచ్చింది. 'రష్యా చట్టం సాంక్షనింగ్' సుంకాల బెదరింపు, చట్ట వ్యతిరేక ప్రవాస భారతీయుల తరలింపు ప్రతీకార చర్యలను మోడీ ప్రభుత్వం దీటుగా స్పందించింది. ఖాతరు చేయకపోగా అమెరికా డబుల్ స్టాండర్డ్స్ వైఖరిని దుయ్యబట్టింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసిఉక్రెయిన్‌తో యుద్ధానికి భారత్ అండగా ఉందనే అవాస్తవ నేరారోపణ, ఆ యుద్ధం మోడీ చేసే యుద్ధంగా 'ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవర్రో నిందించే దిగజారుడు స్థాయికి అమెరికా చేరింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనాను, ఇతర దేశాలను వదిలిపెట్టి ఇండియాను ఒంటరి చేసి వాణిజ్య యుద్ధంతో ఇంకా రెచ్చగొట్టే కంటగింపు వ్యవహారాలకు,



అమెరికా పాల్పడుతోంది. ప్రపంచంలో మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా శరవేగంగా పరివర్తన చెందే బాటలోపయనిస్తున్న భారత్, ట్రంప్ ప్రభుత్వ కుత్సిత మనస్తత్వం కారణంగా 47 బిలియన్ డాలర్ల విలువైన అంచనా ఎగుమతులపై ప్రభావం పడుతోంది. అయినా కయ్యానికి కాలుదువ్వే రెచ్చగొట్టే వ్యాఖ్యలను, మోడీ ప్రభుత్వం పట్టించుకోకుండా రాజకీయ విజ్ఞతతో వ్యవహరిస్తోంది. ఏడు నెలల విరామం తర్వాత సెప్టెంబరు 26న ఐక్యరాజ్యసమితి జనరల్‌అసెంబ్లీ సమావేశంలో ప్రసంగించేందుకు ప్రధాని మోడీ అక్కడకు వెళ్లవలసి ఉంది. ఫిబ్రవరి నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు ట్రంప్ సృష్టిస్తున్న ఆర్థిక యుద్ధ పరిణామాల నేపథ్యంలో భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఏకాభిప్రాయం ఎంతవరకు సాధించగలదో వేచి చూడవలసినదే. భారత వ్యవసాయ రంగాన్ని, పాడి పరిశ్రమ రంగాన్ని అమెరికా కంపెనీల కోసం తెరిచేందుకు భారత్‌కు సుముఖత లేదు. ఇరుదేశాల మధ్య పలు విడతలు చర్చలు కొనసాగినా, ఏకాభిప్రాయ సాఫల్యం అంతగా లేదు. పైగా అపరాధ సుంకాలు. అమెరికా విధించిన వాణిజ్య సమర నేపథ్యంలో 2025 సంవత్సరాంతంలో భారత్‌తో వివిధ దేశాల వాణిజ్య సంబంధ బాంధవ్యాలు అత్యంత కీలకంగా మార్పు చెందనున్నాయి. రెడీమేడ్ దుస్తులు, ఔళిపరిశ్రమ, రత్నాలు, ఆభరణాలు, రొయ్య పరిశ్రమ, తివాసీ, ఫర్నిచర్ వంటి రంగాలు ఈ నిర్హేతుక సుంకాల ప్రభావం వలన దెబ్బతినే దుస్థితి పొంచి ఉంది. ఆగస్టు 6న ట్రంప్14329 ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వు, ఆగస్టు 27 నుంచి అమలు అవుతోంది. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్'ల అధ్యక్షుడు ఎస్.సి.రల్హాన్ వివరణ ప్రకారం ఇండియానుంచి అమెరికా ఎగుమతి షిప్‌మెంట్స్ (47-48 బిలియన్ విలువ డాలర్లు) ఉత్పత్తులు, చైనా, వియత్నాం, కంబోడియా, ఫిలిప్పైన్స్, తదితర సౌత్ ఈస్ట్, సౌత్ ఏసియన్ దేశాలతో పోలిస్తే పోటీ కోల్పోయి తీవ్రంగా దెబ్బతింటాయి. నేడు భారత్ రూ.3 లక్షల కోట్ల విలువైన వస్త్రాలు, నేత ఉత్పత్తులు, సరుకులు ఎగుమతి చేస్తూ ప్రపంచంలో ఆరో అతి పెద్ద ఎగుమతి దారునిగా ఉంది. 2030 నాటికి రూ. 9 లక్షల కోట్లకు పెంచాలని మోడీ ప్రభుత్వం రైతులు, నేత కార్మికులు, డిజైనర్లు వ్యాపారుల వృద్ధికి కొత్త మార్గాలు వేస్తోంది. గత 11సంవత్సరాలలో స్వదేశీ మంత్ర ప్రాధాన్యత కారణంగా దేశంలో పెట్టుబడి వ్యయాలు గణనీయంగా పెరిగాయి. 2025-26లో ఈవ్యయం రూ.11.2 లక్షల కోట్లకు చేరింది. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో సమ్మిళిత వృద్ధి, జాతీయ స్వదేశీ సాధికారత, స్వావలంబన దిశలో ఆత్మనిర్భర్ భారత్ పురోగమిస్తోంది. మిస్టర్ ప్రైమ్ మినిస్టర్ యూ ఆర్ గ్రేట్' అని రాసి మన ప్రధానికి పుస్తకాన్ని బహుకరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మానసిక, వ్యక్తిత్వ ప్రవర్తన ప్రపంచ రాజకీయ నీతిజ్ఞులకు విస్మయం కలిగిస్తోంది. ●

# నియంతలతో మోడీకి సావాసమా?



**ఎంత చేసినా.. చివరికి భారత్ మాతోనే: అమెరికా**

**వాషింగ్టన్, సెప్టెంబరు 2:** షాంఘై సహకార సదస్సు (ఎస్‌ఇఒ) తర్వాత భారత్‌పై ట్రంప్ కార్యవర్గం అక్కసు మరింత పెరిగిపోయింది. తాజాగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ ఎస్‌ఇఒ సదస్సు మొత్తం నాటకీయంగా ఉందని అభివర్ణించారు. ఆయన ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడాన్ని విమర్శించారు. ఆ చర్యలు ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎగదోసేలా ఉన్నాయన్నారు. ఎస్‌ఇఒ సదస్సు సుదీర్ఘంగా జరిగినా.. నాటకీయంగా ఉందని పేర్కొన్నారు. ఏది ఏమైనా భారత్ మాత్రం అతిపెద్ద ప్రజాస్వామ్యమన్నారు. దాని విలువలు మాకు దగ్గరగా ఉంటాయి గానీ, చైనా, రష్యాలకు కాదన్నారు. చైనా, భారత్‌లు రష్యా యుద్ధానికి బలం చేకూరుస్తుండటం వల్లే తాము, మిత్ర దేశాలు రంగంలోకి దిగామని బెసెంట్ పేర్కొన్నారు. భారత్–అమెరికా బంధం బలమైన పునాదులపై ఉందన్నారు. ఇరు దేశాలు అభిప్రాయభేదాలను పరిష్కరించుకొనే సత్తా ఉన్నవేనని అన్నారు. అదే సమయంలో భారత్‌పై ఆంక్షలకు వాణిజ్య చర్చలు మందకొడిగా సాగడం కూడా ఓ కారణమని పేర్కొన్నారు. రష్యా చర్యలకు అన్ని ఆప్షన్లు తమ పరిశీలనలో ఉన్నట్లు బెసెంట్ పేర్కొన్నారు. మరోవైపు భారత ప్రధాని నరేంద్రమోడీ– రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ ముగిసిన కొన్ని గంటల సమయంలోనే ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. భారత్‌తో వాణిజ్యం పూర్తిగా ఏకపక్షంగా ఉందని పేర్కొన్నారు. అధిక సుంకాల కారణంగా భారత్‌కు అమెరికా వస్తువులను విక్రయించలేకపోతోందని ఆరోపించారు. భారత్ జీరో టారిఫ్‌లకు అంగీకరించినా అప్పటికే సమయం చేదాటి పోయిందన్నారు.

ట్రంప్ కార్యవర్గం మొత్తం భారత్‌పై ఆంక్షలకు రష్యా చమురు, వాణిజ్య చర్చలను కారణంగా చెబుతుంటే ప్రత్యర్థులు మాత్రం ట్రంప్ స్వార్థంతో న్యూఢిల్లీని దూరం చేసుకొన్నట్లు చెబుతున్నారు. ఆయన నోబెల్ బహుమతి పొందేందుకు భారత్ సహకరించలేదన్న అక్కసే కారణమని కొందరు అంటున్నారు. తాజాగా అమెరికా మాజీ ఎన్ఎస్ఎ జాన్ సులేవాన్ మాట్లాడుతూ పాకిస్థాన్‌తో కుటుంబ వ్యాపార ఒప్పందాల కోసం భారత్ స్నేహాన్ని అమెరికా అధ్యక్షుడు వదులుకొన్నారని చెప్పారు.

**అది సిగ్గుచేటు:** ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మరోసారి భారత్‌పై తన నోటికి పనిచెప్పారు. అతిపెద్ద నియంతలతో కలిసి ప్రధాని మోడీ వేదిక పంచుకోవడం సిగ్గుచేట న్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భారత్ ఐరోపా, ఉక్రెయిన్‌తో కలిసి పనిచేయాలని రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయాలన్నారు. శాంతికి మార్గం అన్నివైపుల నుంచి వెళుతుందని దానిలో న్యూఢిల్లీ నుంచి కూడా అని పేర్కొన్నారు.

## జిన్‌పింగ్ రైట్‌హ్యాండ్‌తో మోడీ భేటీ..ఆంతర్యమేమిటి?



**బీజింగ్, సెప్టెంబరు 2:** చైనా కమ్యూనిస్టు పార్టీలో కైక్వీ చాలా కఠినమైన వ్యక్తి. ఆయను అసలు నవ్వడు అనే పేరుంది. అతడు అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు కుడిభుజం అని పార్టీ వర్గాలు చెబుతుంటాయి. పార్టీలో పలు కీలక పదవులను ఆయన నిర్వహిస్తున్నారు. బీజింగ్‌లోని విదేశీ దౌత్యవేత్తలు ఆయనతో భేటీ కావడానికి ఆసక్తి చూపినా చాలావరకు ఆయన వాటికి దూరంగా ఉంటారు. కానీ, ఇటీవల ప్రధాని మోడీ చైనా పర్యటన సందర్భంగా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్వయంగా కైక్వీని రంగంలోకి దింపారు. భారత ప్రధానితో ఇరుదేశాల సంబంధాలపై చర్చించాలని సూచించారు. ప్రధాని మోడీ–కైక్వీ మధ్య దాదాపు 45నిమిషాలపాటు సమావేశం జరగడం తింజాయన్ దౌత్యవర్గాల్లో ప్రకంపనలు సృష్టించాయి. ఈ సందర్భంగా ప్రధాని తన ఆలోచనలను ఆయనతో పంచుకున్నారు. ఎస్‌సిఒలో పాల్గొన్న ఏ దేశ నాయకుడినీ ఆయన బహిరంగంగా కలవలేదు. కానీ, మోడీ జిన్‌పింగ్ ద్వైపాక్షిక భేటీకి మాత్రం హాజరయ్యారు. ఇరు దేశాల సంబంధాలు వేగంగా సాధారణ స్థితికి చేరడానికి ఈ భేటీ దోహదపడుతుందని నమ్ముతున్నారు. చైనాలోని భారత వ్యతిరేక వర్గాలకు ఈ భేటీ బలమైన సంకేతాలు పంపినట్లు భావిస్తున్నారు.

**ఎవరీ కైక్వీ..?** కైక్వీ ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీ సెక్రటేరియట్‌లో ఫస్ట్‌ర్యాంకింగ్ హోదా, పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. అన్నింటికి మించి జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడు. ఆయనకు చీఫ్ ఆఫ్ స్టాఫ్. మావో యుగం తర్వాత ఈ రెండు పదవులు ఏకకాలంలో చేపట్టిన వ్యక్తి ఆయనే. చైనాలోని అధికార క్రమంలో ఐదో స్థానంలో ఉన్నారు. ఫుజియాన్ ప్రావిన్స్‌కు చెందిన కై, షీ జిన్‌పింగ్‌ను 1980లో తొలిసారి కలిశారు. ప్రస్తుతం ర్యాంకులు ఎలా ఉన్నా చైనా ప్రీమియర్ లి క్వియాంగ్‌తో సమానంగా ఆయన మాట చెల్లుబాటుఅవుతుంది.

## మేడిన్ ఇండియా విక్రమ్ 32 చిప్ ప్రధాని మోడీకి అందజేత

### సెమికాన్ సదస్సులో అందచేసిన కేంద్ర మంత్రి అశ్వినివైష్ణవ్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 2:** కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ మంగళవారం భారతదేశంలో తయారు చేసిన తొలి చిప్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అందజేశారు. 'విక్రమ్ 32' బిట్ ప్రాసెసర్, నాలుగు ఆమోదించిన ప్రాజెక్టుల టెస్ట్ చిప్‌లను కూడా ప్రధాని మోదీకి అందించారు. నేటి సాంకేతికతకు సెమీకండక్టర్లు చాలా ముఖ్యమైనవి. ఆరోగ్య సంరక్షణ, రవాణా, కమ్యూనికేషన్, రక్షణ, అంతరిక్షం వంటి ముఖ్యమైన వ్యవస్థలలో ఇది ఉపయోగించడం జరుగుతుంది. చైనాఅమెరికా మధ్య నిజమైన యుద్ధం చిప్ పర్యావరణ వ్యవస్థకు సంబంధించినదే. ప్రపంచం మొత్తం డిజిటల్, ఆటోమేషన్ వైపు కదులుతున్నందున, ఆర్థిక భద్రత, వ్యూహాత్మక స్వాతంత్రం కోసం సెమీకండక్టర్లు అవసరం అయ్యాయి. పధానమంత్రి మోదీ మంగళవారం ఢిల్లీలో సెమికాన్ ఇండియా 2025ను ప్రారంభించారు. 2021 నుండి దేశంలో 10 సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. దీనిపై 18 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. కొన్ని సంవత్సరాల క్రితం, ప్రధానమంత్రి దార్శనిక ఆలోచనతో కొత్త ప్రారంభం కోసం మేము మొదటిసారి కలిశామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. మేము ఇండియా సెమీ కండక్టర్ మిషన్‌ను ప్రారం భిం చాము. కేవలం 3.5 సంవత్స రాలలో, ప్రపంచం భారతదేశం వైపు నమ్మకంగా చూస్తోంది. నేడు, దేశంలో ఐదు సెమీకండక్టర్ యూనిట్ల తయారీ వేగంగా జరుగుతోంది. ఇప్పుడే మొదటి మేడ్‌ఇన్ ఇండియా" చిప్‌ను ప్రధాని మోదీకి అందించామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా వెల్లడించారు.

## నేను చనిపోయినా ఆజాద్ మైదాన్ వీడి వెళ్లేదిలేదు..

### మరాఠా రిజర్వేషన్ ఉద్యమకారుడు మనోజ్‌పాటిల్ జరాంగే



**ముంబయి, సెప్టెంబరు2:** మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ నిరాహార దీక్ష చేపట్టిన మనోజ్ జరంగే పాటిల్ తను చనిపోయినా సరే నిరాహార దీక్ష చేస్తున్న ఆజాద్ మైదానాన్ని వదిలి వెళ్లేది లేదని తేల్చిచెప్పారు. ముంబయి పోలీసులు నిరాహార దీక్ష కొనసాగించడానికి అనుమతి నిరాకరించిన నేపథ్యంలో మనోజ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై నిరసనకారులు ముం బయిలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంపై మనోజ్ మండిపడ్డారు. మరాఠా రిజర్వేషన్లకు మద్దతుగా ఎగిసిపడతున్న ప్రజా నిరసనలను మీరు తట్టుకోలేరు అంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీసు హెచ్చరించారు. మీరు ప్రజా నిరసనలను తట్టుకోలేరు. నేను చనిపోయినా సరే, ఈ స్వేచ్ఛా మైదానం నుంచి లేవను. ఒక వేళ నేను చనిపోతే, మీరు మౌనంగా ఉండండి. ఒక వేళ మీరు పోలీసులను ఉపయోగించి, నిరసనకారులను తరిమికొట్టాలనుకుంటే, దానికి మీ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించకోకతప్పదని జరాంగె పేర్కొన్నారు. మరాఠాలకు రిజర్వేషన్లు కోరుతూ మనోజ్ జరంగే పాటిల్ చేపట్టిన నిరాహార దీక్ష వల్ల ముంబయి జనజీవనం స్తంభించింది. ముఖ్యంగా ఆజాద్ మైదాన్ వెలుపలు నిరసనకారుల వాహనాలు ఉండడంతో ట్రాఫిక్ జామ్ అయిపోయి, సామాన్య ప్రజానీకానికి తీవ్రమైన ఇబ్బంది ఏర్పడింది. ఈ నేపథ్యంలో బొంబాయి హై కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మనోజ్ పాటిల్ నిర్దేశిత నిబంధనలు, షరతులు ఉల్లంఘింటారని, అందువల్ల దీక్షకు ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. లేకుంటే కోర్టు ధిక్కరణ కింద కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. దీనితో ముంబయి పోలీసులు ఆజాద్ మైదాన్ ప్రాంగణాన్ని ఖాళీ చేయాలని నిరసనకారులను కోరారు. న్యాయం జరుగుతుందని నాకు 100 శాతం నమ్మకం ఉంది. ప్రస్తుతం ముంబయిలో ఎక్కడా ట్రాఫిక్ జాంలేదు. మావాళ్లు తమ వాహనాలను రోడ్డుపై నుంచి తొలగించి, షెడ్లలో పార్క్ చేశారు. ఆజాద్ మైదాన్ నుంచి మమ్మల్ని తరిమికొట్టాలనుకుంటే, అది ప్రభుత్వానికే నష్టం. గత రెండేళ్లుగా మేము శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నాం. మేము ప్రజాస్వామ్య పద్ధతిలో, చట్టం పరిధిలోనే నిరసనలు కొనసాగిస్తున్నాం. కోర్టు కూడా మాకు న్యాయం చేస్తుందని మేము ఆశిస్తున్నామని, మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలనే తమ డిమాండ్ నెరవేరే వరకు నిరసనకారులు ముంబయి విడిచి వెళ్లరని మనోజ్ పాటిల్ స్పష్టం చేశారు.

## 100 బిలియన్ డాలర్లకు ద్వైపాక్షిక వాణిజ్యం

### ఢిల్లీలో అరబ్‌ఎమిరేట్స్ మంత్రితో కేంద్ర మంత్రి సమీక్ష



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 2:** భారత్, యూఏఈ ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా 2030 నాటికి చమురేతర ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు చేర్చాలని సమున్నత లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. ఇరు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని (సెపా) సమీక్షించిన అనంతరం, మారుతున్న ప్రపంచ వాణిజ్య పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, యూఏఈ విదేశీ వాణిజ్య మంత్రి థానీ బిన్ అహ్మద్ అల్ జెయౌదీ మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీ వివరాలను కేంద్ర ప్రభుత్వం విడుదలచేసింది. సెపా ఒప్పందం కింద సాధించిన ప్రగతిని మంత్రులిద్దరూ సమీక్షించారు. భవిష్యత్తులో పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో కలిసి పనిచేయాలని అంగీకారానికి వచ్చారు. వాణిజ్యాన్ని మరింత సులభతరం చేసేందుకు స్థానిక కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్ (రూపాయి దిర్హామ్), యూఏఈలో 'భారత్ మార్ట్' ఏర్పాటు వంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఇరు దేశాల మంత్రులు అభిప్రాయపడ్డారు. వాణిజ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవడం ద్వారా సెపా పర్యవేక్షణను మెరుగుపరచాలని నిర్ణయించారు. భారత ఫార్మా కంపెనీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు యూఏఈలో కొత్తగా ఏర్పాటైన ఎమిరేట్స్ డ్రగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ కీలక పాత్ర పోషిస్తుందని భారత ప్రతినిధి బృందం ఆశాభావం వ్యక్తం చేసింది. ఈసమావేశంలో భాగంగా ఫార్మా, ఆహార రంగాల ప్రతినిధులతో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. దీంతో పాటు 2026లో దుబాయ్‌లో జరిగే 'గల్ఫ్ ఫుడ్' ప్రదర్శనలో భారత్‌ను భాగస్వామ్య దేశంగా గుర్తించేందుకు ఒప్పందం కుదిరింది.

## ప్రత్యేకరైలులో చైనా చేరుకున్న కొరియా అధినేత కిమ్‌జాంగ్ ఉన్



**ప్యాంగ్యాంగ్(ఉత్తరకొరియా), సెప్టెంబరు 2:** అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా నేతృత్వంలోని ప్రపంచ కూటమికి బలమైన సంకేతాలు పంపుతూ ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ మంగళవారం చైనాలో అడుగుపెట్టారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజింగ్‌లో జరగనున్న సైనిక కవాతులో ఆయన పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా హాజరుకానుండటం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ప్యాంగ్యాంగ్ నుంచి తన ప్రత్యేక బుల్లెట్‌ప్రూఫ్ రైలులో విదేశాంగ మంత్రి చో సోన్‌హుయ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి బయల్దేరిన కిమ్ బీజింగ్‌కు చేరుకున్నారని ఉత్తర కొరియా అధికారిక మీడియా వెల్లడించింది. 2023లో రష్యా పర్యటన తర్వాత కిమ్ విదేశాలకు వెళ్లడం ఇదే తొలిసారి. అలాగే, 2019 జనవరి తర్వాత ఆయన చైనాలో పర్యటించడం కూడా ఇదే ప్రథమం.



## ఇళ్లల్లోకి యమున వరద నీరు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 2:** గత కొన్నిరోజులుగా ఉత్తరాదిలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. హర్యానాలోని మయునానగర్‌లోని హత్నికుండ్ బ్యారేజీ వద్ద నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతుండడంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ఢిల్లీలోని యమునా నది డేంజర్ మార్క్ దాటి ప్రవహిస్తోంది. ఇళ్లల్లోకి వరద నీరు చేరుతుండడంతో యమునా తీర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు వరద హెచ్చరికను జారీ చేశారు. మంగళవారం తెల్లవారుఝామున యమునా నది 205.33 మీటర్ల డేంజర్ మార్క్ దాటడంతో దేశ రాజధానిలో భారీ వరదలు పోటెత్తే అవకాశం ఉందని ఢిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే ఖాళీ చేసి, ప్రభుత్వం ఏర్పాటుచేసిన సహాయక శిబిరాలకు చేరుకోవాలని సూచించింది. మరోవైపు మంగళవారం సాయంత్రంలోగా యమునా నది 206 మీటర్ల ఎత్తుకు చేరుకోవచ్చని వాతావరణశాఖ అంచనావేస్తోంది. దీంతో పలు కార్యాలయాలు తమ ఉద్యోగులను ఇంటి నుంచే పని చేయాలని సూచించాయి. పలు పాఠశాలలు ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నాయి. భారీ వర్షాలకు వరద నీరు పోటెత్తడంతో ఢిల్లీ రోడ్లు జలమయమయ్యాయి. ఢిల్లీ, జైపూర్ హైవేపై 7,8 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. దాదాపు 3 గంటలకు పైగా ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రతిపక్షాలు ఢిల్లీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.



## పంజాబ్ ఆప్‌లో భగ్గుమన్న విభేదాలు

**సనౌర్ (పంజాబ్), సెప్టెంబరు 2:** పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. పార్టీ ఢిల్లీ నాయకత్వాన్ని, ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌ను బహిరంగంగా విమర్శించిన కొన్ని గంటల్లోనే సనౌర్ ఎమ్మెల్యే హార్మీత్ సింగ్ పఠాన్‌మజ్రా అత్యాచారం ఆరోపణలపై అరెస్ట్ కావడం రాజకీయంగా కలకలం రేపుతోంది. గత రాత్రి 10:17 గంటలకు పటియాలా సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌లో హార్మీత్ సింగ్ మాజీ భార్య ఫిర్యాదు చేశారు. 2014 ఫిబ్రవరి నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఎమ్మెల్యే తనపై అత్యాచారానికి పాల్పడ్డారని, మోసం చేశారని, బెదిరించారని ఆమె ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదైన కొన్ని గంటల్లోనే, మంగళవారం ఉదయం హర్యానాలోని కర్నాల్‌లో ఉన్న బంధువుల గ్రామంలో హార్మీత్ సింగ్‌ను పంజాబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## శబరిమలై ఆచారాలను పరిరక్షిస్తాం..

### టిడిబి చైర్మన్‌ప్రశాంత్

**తిరువనంతపురం, సెప్టెంబరు 2:** కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో మహిళలను అనుమతించాలనే తన వైఖరి నుంచి ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు వెనక్కి తగ్గుతోంది. శబరిమల ఆచారాలను పరిరక్షిస్తామని, సుప్రీంకోర్టును ఒప్పించడానికి ప్రయత్నిస్తామని టీడీబీ అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ వెల్లడించారు. మహిళల ప్రవేశానికి సంబంధించిన పిటిషన్‌లో న్యాయ నిపుణులతో సంప్రదించిన తర్వాత కొత్త అఫిడవిట్‌ను అత్యున్నత న్యాయస్థానంలో సమర్పించాలని బోర్డు యోచిస్తోంది. సెప్టెంబరు 20న పంబా నది ఒడ్డున గ్లోబల్ అయ్యప్ప సమావేశం భారీ ఎత్తున నిర్వహిస్తామని దేవాదాయ శాఖ మంత్రి వి.ఎన్.వాసవన్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ మీడియాతో మాట్లాడారు. మహిళల ప్రవేశ పిటిషన్‌లో న్యాయనిపుణులతో సంప్రదించి కొత్త అఫిడవిట్ సమర్పించాలని బోర్డు పరిశీలిస్తోంది. ఈ విషయం ఇప్పుడు సుప్రీం కోర్టు ముందు ఉంది.



## 1400కు పెరిగిన అఫ్ఘాన్ భూకంప మృతులు

### 3వేలమందికిపైగా గాయాలు, భారత్‌నుంచి ఆహారం, టెంట్లు సరఫరా

**కాబూల్, సెప్టెంబరు 2:** అఫ్గానిస్థాన్‌లో సంభవించిన భారీ భూకంపం కారణంగా మరణించిన వారి సంఖ్య 1400 దాటింది. మరో 3,000 మందికిపైగా గాయపడ్డారు. 6.0 తీవ్రతతో సంభవించిన భూకంప తాకిడికి గ్రామాలకు గ్రామాలే ధ్వంసమయ్యాయి. తాలిబన్ ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వేల సంఖ్యలో ప్రజలు ఇంకా శిథిలాల కిందే చిక్కుకొని ఉంటారని అనుమానిస్తున్నారు. మరోవైపు భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ, అన్ని రకాలుగా సాయం చేస్తామని హామి ఇచ్చారు. బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను భారత్ కంటైనర్లలో పంపించింది. పర్వత ప్రాంతమైన తూర్పు అఫ్గానిస్థాన్‌లో భూకంపం తాకాయి. శిథిలాల కింద అనేకమంది ఇంకా సజీవంగా ఉన్నారని అనుమానిస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న ఆప్తులను రక్షించుకొనేందుకు చేతులతోనే చాలా మంది మట్టిని తవ్వితీస్తున్న దృశ్యాలు కంటతడి పెట్టిస్తున్నాయి. సాయం అందడంలో జరుగుతున్న జాప్యం కారణంగా వీరంతా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రంతా పలు మార్లు భూమి కంపిస్తూనే ఉందని తెలిపారు. పాకిస్థాన్‌లోనూ పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. ఇప్పటికే మానవతా సాయాన్ని భూకంప ప్రభావిత ప్రాంతాలకు పంపించడం ప్రారంభించామని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. వాటిలో బియ్యం, ఇతర ఆహార పదార్థాలు ఉన్నాయి. అంతకు ముందు భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్, అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రి మోలావి అమీర్ ఖాన్ ముత్తాకోతో మాట్లాడారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాబుల్‌కు భారత్ 1000 కుటుంబాలకు సరిపడ టెంట్లను పంపించిందని పేర్కొన్నారు. 15 టన్నుల ఆహార సామగ్రిని పంపించందని తెలిపారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ కష్ట సమయంలో అఫ్గానిస్థాన్‌కు భారత్ అండగా ఉంటుందని అన్నారు.

## బాలివుడ్ డైరెక్టర్ సంజయ్‌లీలా భన్సాలీపై ఎఫ్‌ఐఆర్

**జైపూర్, సెప్టెంబరు 2:** ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ వివాదంలో చిక్కుకున్నారు. తన ప్రతిష్ఠాత్మక చిత్రం 'లవ్ అండ్ వార్' కోసం లైన్ ప్రొడ్యూసర్‌గా నియమించుకుని, డబ్బులు చెల్లించకుండా మోసం చేయడమే కాకుండా, తనపై దాడి చేసి బెదిరించారని ఆరోపిస్తూ ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఆయనపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ఈ ఘటన రాజస్థాన్‌లో చోటుచేసుకుంది. రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లా, బిచ్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఈ ఎఫ్‌ఐఆర్ నమోదైనట్లు పోలీసులు తెలిపారు. జోధ్‌పూర్‌కు చెందిన రాధా ఫిల్మ్స్ అండ్ హాస్పిటాలిటీ సీఈఓ ప్రతీక్ రాజ్ మాథుర్ ఈ ఫిర్యాదు చేశారు. 'లవ్ అండ్ వార్' చిత్రానికి తనను లైన్ ప్రొడ్యూసర్‌గా నియమించుకున్నారని, ఈ మేరకు అధికారిక ఒప్పందం లేకపోయినా ఈమెయిల్ ద్వారా ధ్రువీకరించారని ఆయన తెలిపారు. ప్రభుత్వ అనుమతులు, భద్రతా ఏర్పాట్లు వంటి కీలక పనులన్నీ తానే చూసుకున్నానని, అయితే తర్వాత తనను తొలగించి, ఇవ్వాల్సిన పారితోషికం చెల్లించలేదని మాథుర్ ఆరోపించారు. కేవలం డబ్బులు ఎగ్గొట్టడమే కాకుండా, తనతో దురుసుగా ప్రవర్తించారని కూడా మాథుర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆగస్టు 17న బికనీర్‌లోని హోటల్ నరేంద్ర భవన్‌లో భన్సాలీ, ఆయన ప్రొడక్షన్ మేనేజర్లు ఉత్కర్ష్ బాలి, అర్వింద్ గిల్ తనను తోసివేసి, తీవ్ర పదజాలంతో దూషించారని ఆరోపించారు. భవిష్యత్తులో తన కంపెనీకి అవకాశాలు రాకుండా అడ్డుకుంటామని బెదిరించారని కూడా ఆయనతెలిపారు. నమ్మకద్రోహం, చీటింగ్ కింద ఈ కేసునమోదు చేశారు. మొదట పోలీసులు కేసునమోదు చేయడానికి నిరాకరిం చడంతో మాథుర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

## సంక్షిప్తంగా..

### మహారాష్ట్ర మసీదులో గణేశుడు



**ముంబయి, సెప్టెంబరు 2:** మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా గొట్ఖిండీ గ్రామం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇక్కడ స్థానికులు ఏటా గణేశుడి విగ్రహాన్ని మసీదులో ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. 1980లో ఈ సంప్రదాయం ప్రారంభమైంది. ఆ యేడాది భారీ వర్షం కారణంగా ఓ గణపతి విగ్రహాన్ని మసీదులోకి మార్చారు. అప్పటి నుంచి ఏటా మసీదులోనే వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నారు. హిందూ ముస్లింలు, ఉమ్మడిగా ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. ఒకసారి బక్రీద్, వినాయక చవితి ఒకేసారి రాగా, ముస్లింలు నమాజ్ మాత్రమే చేసి, కుర్బానీకి దూరంగా ఉన్నారు.

### ఐసియులో శిశువులను కరిచిన ఎలుకలు




**భోపాల్, సెప్టెంబరు 2:** ప్రభుత్వ ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్న ఇద్దరు శిశువులను ఎలుకలు కరిచిన ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో చోటుచేసుకుంది. వారం కిందట జన్మించిన ఇద్దరు శిశువులను, రాష్ట్రంలోని అతిపెద్ద ఆసుపత్రుల్లో ఒకటైన మహారాజ యశ్వంతరావు చికిత్సాలయలోని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్చారు. ఐసియూలో చికిత్స తీసుకుంటున్న ఆ శిశువుల శరీరాలపై గాయాలను గుర్తించిన నర్సుల బృందం డాక్టర్లకు సమాచారం అందించారు. దీంతో ఐసియులో ఉన్న సిసిటివిని పరిశీలిస్తే ఆ పసిపిల్లల వద్దకు ఎలుకలు వచ్చిన దృశ్యాలు కనిపించాయి. దీంతో అవే శిశువులను గాయ పరిచినట్లు అనుమానిస్తున్నారు. మొదటగా ఈ ఘటన ఆదివారం జరుగగా, మరుసటి రోజే మరో ఘటన జరగడం గమనార్హం. దీంతో అక్కడి వైద్య నిర్వాహకుల నిర్లక్ష్యానికి నిదర్శ నగా కనిపిస్తోందని శిశువుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

### సూడాన్‌లో కొండచరియలు విరిగిపడి 1000 మంది మృతి



**ఖర్టూమ్, సెప్టెంబరు 2:** సూడాన్‌లో ఓ పెను విషాదం చోటుచేసుకుంది. పశ్చిమ సూడాన్‌లోని మర్రా పర్వత ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో ఏకంగా వెయ్యి మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర దుర్ఘటనలో ఓ గ్రామం పూర్తిగా నేలమట్టం కాగా, ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. సూడాన్ లిబరేషన్ మూవ్‌మెంట్/ఆర్మీ (ఎస్ఎల్ఎం/ఏ) ఈ విషయాన్ని ధృవీకరించింది. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆగస్టు 31వ తేదీన ఈ దుర్ఘటన జరిగిందని అబ్దెల్వాహిద్ మహ్మద్ నూర్ నేతృత్వంలోని ఈ బృందం తెలిపింది. మృతుల్లో మహిళలు, చిన్నారులు, పురుషులు ఉన్నారని పేర్కొంది. ఉత్తర డార్ఫర్ రాష్ట్రంలో సైన్యానికి, పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్)కు మధ్య భీకర అంతర్యుద్ధం జరుగుతుండటంతో ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రజలు మర్రా పర్వత ప్రాంతాలకు శరణార్థులుగా వలస వచ్చారు. ఇప్పటికే ఆహారం, మందుల కొరతతో ఇబ్బందులు పడుతున్న వీరు, ఇప్పుడు ప్రకృతి విపత్తు రూపంలో మృత్యువాత పడటం అందరినీ కలచివేస్తోంది.

### ప్రపంచ యాత్రికుని బైక్ చోరీ



**నాటింగ్‌హామ్ (బ్రిటన్), సెప్టెంబరు 2:** బైక్ పై ప్రపంచ యాత్రకు బయ లుదేరిన ముం బై యువకుడు యోగేశ్ అలెకరికి యూకేలో చేదు అనుభవం ఎదురైంది. నాటింగ్ హామ్ లోని ఓ పార్క్‌లో పెట్టిన బైక్ ను దొంగలు ఎత్తుకెళ్లారు. స్థానికంగా ఉంటున్న ఓ స్నేహితుడిని కలిసి బ్రేక్ ఫాస్ట్ చేసి తిరిగొచ్చే సరికి బైక్ మాయమైందని యోగేశ్ వాపోయాడు. నలుగురు యువకులు తన బైక్ ను ఎత్తుకెళ్లినట్లు సీసీటీవీ కెమెరాల్లో రికార్డైందని చెప్పాడు. పాస్ పోర్ట్, వీసా వంటి కీలక డాక్యుమెంట్లతో పాటు డబ్బు కూడా అం దులోనే ఉండిపోయిందని పేర్కొన్నాడు. ప్రస్తు తం తాను కట్టుబట్టలతో మిగిలానని వాపో యాడు. 2025 మే 1న ముంబై నుంచి బైక్ పై ప్రపంచయాత్రకు బయలుదేరానని యోగేశ్ చెప్పారు. ఇప్పటి వరకు 118రోజుల్లో 17 దేశా లను చుట్టేశానని, మొత్తంగా 24వేల కిలోమీ టర్లు తిరిగానని యోగేశ్ వివరించాడు. బైక్ చోరీ కావడంతో ప్రస్తుతం యాత్ర కొనసాగించాలన్నా ఇంటికి చేరుకోవాలన్నా వీలులేకుండా పోయిం దని నిరాశ వ్యక్తం చేశాడు. దొంగలు బైక్ ఎత్తుకెళుతున్న సీసీటీవీ ఫుటేజీని షేర్ చేస్తూ తన ఈ పోస్టును షేర్ చేయాలని, అధికారులు వేగంగా స్పందించేందుకు సాయం చేయాలని ఫాలోవర్లకు విజ్ఞప్తి చేశాడు.

# కవిత సస్పెన్షన్ బిఆర్ఎస్ అంతర్గత వ్యవహారం

## మంత్రులు, కాంగ్రెస్ నేతల స్పందన

### కెసిఆర్ ఫ్యామిలీ కొత్త డ్రామా

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌పై మంత్రులు, కాంగ్రెస్ నేతలు స్పందించారు. కవిత సస్పెన్షన్ బిఆర్ఎస్ పార్టీకి చెందిన అంశమన్నారు. ఆ పార్టీ అంతర్గత వ్యవహారమన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తీవ్రవిమర్శలు చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరంపై కెసిఆర్ ఫ్యామిలీ కొత్త డ్రామాకు తెర తీసిందని అన్నారు. అవినీతి జరిగిందని కవిత వ్యాఖ్యలతో స్పష్టమైందని, హరీశ్‌రావు మాత్రమే అవినీతి చేశారని కవిత అంటున్నారు. అప్పుడే హరీశ్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ అనుమతి లేకుండా ఏమీ జరగదు. కాళేశ్వరంలో కర్త, కర్మ, క్రియ అన్నీ కేసీఆరే అని అన్నారు. అవినీతికి బాధ్యత కూడా కెసిఆర్‌దే అని అన్నారు. తన బాణాలను హరీశ్, సంతోష్‌వైపు ఎందుకు మళ్లించారని అడిగారు. మరోవైపు కవితపై బిఆర్ఎస్ సస్పెన్షన్ వేటు వేసింది. కేసీఆర్ ఆదేశాలతో కవిత సస్పెన్షన్‌కు గురైంది. కవిత వ్యాఖ్యలతో పార్టీకి నష్టం కలుగుతుందని సస్పెండ్ చేస్తూ విడుదల చేసిన లేఖ బిఆర్ఎస్ అధిష్ఠానం పేర్కొంది.

**కుటుంబ తగాదాల్లో మమ్మల్ని లాగడం సరికాదు : మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పందించారు. అవి కుటుంబ తగాదాలని, ఎమ్మెల్సీ కవితనే చూసుకోవాలని, తమను లాగడం సరికాదని ఆయన చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఎమ్మె ల్సీ కవిత పరోక్షంగా అంగీకరించారని తెలిపారు. కక్షసాధింపు చర్యలు చేయడం లేదన్నారు. హరీశ్‌రావు సంతోష్‌రావు వెనుక ఉండాల్సిన అవసరం తమకు లేదన్నారు.

**కవిత సస్పెన్షన్ వాళ్ల అంతర్గత వ్యవహారం : మంత్రి శ్రీధర్‌బాబు**

భారతరాష్ట్ర సమితి నుంచి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సస్పెన్షన్ అంశం..వారి అంతర్గత కుటుంబ వ్యవహారమని ఐటీ,పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధరాబాబు అన్నారు. శాసనసభ ఎన్నికల సమయంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి, అవకతవకలపై జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చామని అన్నారు.

కాళేశ్వరం కమిషన్ నివేదిక మీద ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హరీష్ రావు, సంతోష్ రావు వెనుక సిఎం ఉన్నాడనేది రాజకీయ ఆరోపణ మాత్రమే అని, కాళేశ్వరంపై లోతైన విచారణ జరగాలని అభిప్రాయపడ్డారు. కాంట్రాక్టర్ల వ్యవహారంపై విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

సిబిఐ విచారణ జరగకుండానే కాళేశ్వరంలో అవినీతి జరిగిందని కవిత తేల్చి చెప్పిందని భువనగిరి ఎంఎల్‌ఏ కంభం అనిల్‌కుమార్ అన్నారు. మీడియాతో మాట్లాడుతూ..హరీష్‌రావు, సంతోష్‌రావు అవినీతి చేశారని కవిత మొదట సాక్ష్యం చెప్పిందన్నారు. కెసిఆర్ డైరక్షన్‌లోనే హరీష్‌రావు పనిచేశారన్నారు.

**అష్టదిగ్బంధంలో కెసిఆర్ కుటుంబం : వేముల వీరేశం**

కెసిఆర్ కుటుంబం అష్టదిగ్బంధంలో ఉందని, భయంతో కోర్టులకు పరుగెడుతోందని ఎంఎల్‌ఏ వేముల వీరేశం అన్నారు. అపర మేధావి అయిన కెసిఆర్ ఎందుకు విచారణకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఆయన మెహం చాటేయేడంతోనే అవినీతికి పాల్పడినట్లు అర్థం అవుతోందన్నారు. ప్రాణహిత చేవెళ్ళ ప్రాజెక్టు కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత రద్దు చేసి కాళేశ్వరం తీసుకువచ్చాడని విమర్శించారు. పిసిఘోష్ కమిషన్ నివేదికను చెత్తబుట్టలో వేయాలని ,సిబిఐ విచారణను ఆపాలని కెసిఆర్ ప్రయత్నిస్తున్నాడని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్‌కు వెయ్యి కోట్ల డిపాజిట్లు, వేల కోట్ల అవినీతి డబ్బు ఉందని ఆ పంపకాల్లోనే పంచాయితీ వచ్చిందన్నారు.

# మూడు ముక్కలైన బిఆర్ఎస్

## కవితను బిజెపిలో చేర్చుకునే ప్రసక్తే లేదు: ఎంపి డా.లక్ష్మణ్

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్ వ్యవహారంపై బిజెపి ఎంపి లక్ష్మణ్‌కీలక వ్యాఖ్యలు చేశారు. మొన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ కుప్పకూలింది.. నిన్న బిఆర్ఎస్ పార్టీ కూలిందని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీలో మూడు పిల్లర్లు కూలినట్టే, బిఆర్ఎస్ పార్టీ మూడు ముక్కలైందని అన్నారు. కవితను బిజెపిలో చేర్చుకోమని, మా పార్టీలో అవినీతిపరులకు చోటు లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై విచారణను తెలంగాణ ప్రభుత్వం సిబిఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నా మన్నారు. 22 నెలలుగా సిఎం రేవంత్ రెడ్డి ఎందుకు కాలాయాపన చేశారని ప్రశ్నించారు.

గతంలో కాళేశ్వరం అవినీతికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, ఆ ఎవిడెన్స్ సిబిఐకి ఇచ్చి దర్యాప్తుకు సహకరించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట అవినీతి జరిగిందని కవితే చెప్పారన్నారు. హరీశ్‌రావు, సంతోష్‌రావు అవినీతి అనకొండలు అని స్వయంగా కవిత చెప్పారని అన్నారు. తెలంగాణ ఆస్తులను కెసిఆర్ కుటుంబం కొల్లగొట్టిందని ఆరోపించారు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్‌ను బలిపశువును చేశారని కవిత అంటున్నారు. కానీ హరీశ్‌రావు, సంతోష్‌రావు అవినీతిలో కెసిఆర్ పాత్ర ఉందన్నారు.



విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు. ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ తదితరులు

# ఆదర్శ పాఠశాల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తక్షణమే వేతన బకాయిలను చెల్లించాలి

## సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్ (సైపాబాద్), సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తక్షణమే గత ఆరు నెలల నుంచి చెల్లించవలసిన వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది ఉద్యోగులు మంగళవారం పాఠశాల విద్య కమీషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. తెలంగాణ మోడల్ స్కూల్ ఔట్‌సోర్సింగ్ ఎంపాయిస్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని నినదించారు. ఈ ముట్టడి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ మోడల్ స్కూల్స్‌లో ఫిజికల్ డైరెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్, వాచెమెన్‌లుగా పనిచేస్తున్న 800 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో అర్థాకలితో అలమటిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు పలు మార్లు ఉద్యోగులు మొర పెట్టుకున్నప్పటికి ఎవరూ కనికరించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, నిరుద్యోగ జెఎసి ఛైర్మన్ నీల వెంకటేష్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, బిసి నేతలు నందగోపాల్, చిక్కుడు బాలయ్యముదిరాజ్, రవి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పథకాల రూపకర్త వైఎస్ఆర్

## నివాళులర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి (సెప్టెంబర్ 2) సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చేసిన సేవలను మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తూ రాష్ట్రాన్ని దేశంలోనే ముందంజలో ఉంచారని కొనియాడారు. పేదల ఆరోగ్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్స్, రైతులకు రుణమాఫీ వంటి ఎన్నో పథకాలను తీసుకొచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు పెద్దన్నగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వైఎస్ఆర్‌లేని లోటు కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు.

# హెచ్ఎండిఏ ప్లాట్ల ప్రీబిడ్ సమావేశానికి విశేష స్పందన

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) తుర్కయంజాల్‌లోని 12 ప్లాట్ల ఈ-ఆక్షన్‌కి సంబంధించి సెప్టెంబరు 17న నిర్వహించబోయే ఈ వేలం ప్రీబిడ్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఉదయం 11 నుండి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించిన ఈ సమావేశానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సమావేశంలో హెచ్ఎండిఏ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌కు చెందిన డెప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ రెడ్డి వేలం ప్రక్రియను వివరించారు. ఎంఎస్‌టిఎసి ప్రతినిధులు ఈ-ఆక్షన్ విధానం గురించి ప్రజెంటేషన్ ఇవ్వగా, కెపిఎంపిజి సంస్థ ప్రతినిధులు ఈ ప్రదేశం వ్యూహాత్మక ప్రాముఖ్యత, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలను వివరించారు.


సిఎం ప్రజావాణి కోసం పూజలు చేసి బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించిన డా.చిన్నారెడ్డి, దివ్యదేవరాజన్.

# సిఎం ప్రజావాణికి బ్యాటరీ వాహనం

## వృద్ధులు, దివ్యాంగుల ఉచిత రవాణాకు వినియోగం

### పూజలు చేసి బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించిన చిన్నారెడ్డి, దివ్యదేవరాజన్

**హైదరాబాద్ (బేగంపేట), సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి విజయవంతంగా నిర్వహిస్తూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ప్రజావాణికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా బ్యాటరీ వాహనాన్ని మంజూరు చేసింది. ఈ వాహనానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌లు మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో పూజలు నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు. సిఎం ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై దరఖాస్తులు అందజేసేందుకు వచ్చే వృద్ధులు, వికలాంగులకు ప్రధాన రహదారి మెయిన్ గేటు నుంచి పిటీషన్లు అందజేసే భవనం వరకు ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించేందుకు రూ.ఏడు లక్షల విలువైన వాహనాన్ని కొనుగోలు చేశారు.

# 5న సిఎం చేతుల మీదుగా జిపిఒలకు నియామకపత్రాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా జిపివోలుగా నియమితులైన 5 వేల మంది విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లకు 5న సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందచేయనున్నట్లురాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు. జీపీవోలకు నియామక పత్రాలను మాదాపూర్లోని హైటెక్స్‌లో సాయంత్రం 4 గంటలకు అందజస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రులు హాజరవు తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం సంబంధిత కార్య దర్శులు ఉన్నతాధికారులతో సీఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి ఎంపికైన వీఆర్వోలు మధ్యాహ్నం 2 గంటలలోపు హైటెక్స్ చేరుకునేలా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. కార్య క్రమానికి హాజరయ్యే వారికి దాదాపు 120కి పైగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఎండీని ఆదేశించారు. ఈ బస్సుల పార్కింగ్, ట్రాఫిక్ నిర్వ హణను చేపట్టాలని సైబరాబాద్ కమిషనర్‌నుఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో రోడ్డు భవనాలు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, ఫైర్ సర్వీస్ డీజీ నాగిరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, సంస్కృతి శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

# ప్రజాపోరాట యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి

## సురవరం సంస్మరణ సభలో పలువురు వ్యక్తలు


సురవరం చిత్రపటానికి నివాళులు అర్పించి మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, చిత్రంలో అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జస్టిస్ చంద్ర కుమార్, సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి బి.వి.విజయలక్ష్మి తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** నిత్య అధ్యాయన శీలుడు, మార్క్సిస్ట్ ఉపాధ్యాయులు, ప్రజాపోరాట యోధుడు సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అని పలువురు వ్యక్తలు కొనియాడారు. సుధాకర్‌రెడ్డి మరణం దేశ కమ్యూనిస్టు ఉద్యమానికే తీరని లోటాని నివాళ్ల అర్పించారు. దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కమ్యూనిస్టు లంతా ఐక్యం కావాలని కోరుకుంటున్న తరుణంలో దానిని ముందుండి నడిపించాల్సిన నాయకుడైన సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికంగా దూరం కావడం దుర దృష్టకరమని వారు పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్, రావి నారాయణరెడ్డి ఆడిటోరి యంలో మంగళవారం సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు, సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి బి.వి.విజయలక్ష్మి, తెలుగు విశ్వ విద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ఎస్.వి.సత్య నారాయణ, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, సీనియర్ జర్నలిస్టు మల్లెపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభా అధ్యక్షులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలు నిర్మించడంలో సురవరం సుధాకర్‌రెడ్డి అగ్రగణ్యుడని అన్నారు. ప్రజా సమస్యల పట్ల ప్రజలతో మమేకమై అవిశ్రాంత ఉద్యమాలను నిర్మించారని తెలిపారు. విజయలక్ష్మి మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి పట్ల పార్టీ, ప్రభుత్వం చూపిన ప్రేమ ఎప్పటికీ మర్చిపోలేనిదన్నారు.

# జూబ్లీహిల్స్ ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల

## 3,92,669 మంది ఓటర్లు నమోదు

### సిఇఓ సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ 61వ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితా ముసాయిదాను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మంగళవారం విడుదల చేశారు. ఈ జాబితాలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు నమోదు కాగా, పౌరులు తమ అభ్యంతరాలు మరియు దరఖాస్తులను సెప్టెంబర్ 17 వరకు సమర్పిం చేందుకు అవకాశం కల్పించారు. ముసాయిదా జాబితాలో 2,04,288 మంది పురుష ఓటర్లు, 1,88,356 మంది మహిళా ఓటర్లు, మరియు 25 మంది ఇతర విభాగంలో నమోదయ్యారు. సిఈఓ కార్యాలయం ప్రకారం, ఓటింగ్ కోసం 139 భవనాల్లో 407 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఓటర్లు తమ పేర్లు, వివరాలను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో, నియమిత పోలింగ్ స్టేషన్లలో గానీ సిఈఓ తెలంగాణ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో తనిఖీ చేసుకోవచ్చునని తెలిపారు. చేర్పులు, తొలగింపులు, సవరణలు గానీ బదిలీల కోసం ఫారమ్ 6, 7, 8 ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చు. అభ్యంతరాలను సెప్టెంబర్ 25 నాటికి పరిష్కరించనున్నారు. చివరి ఓటర్ల జాబితా 2025 సెప్టెంబర్ 30న ప్రచురితం కానుంది. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నిర్ణయాలపై అప్పీళ్లను ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950 యొక్క సెక్షన్ 24 కింద దాఖలు చేయవచ్చు, మరియు రెండవ అప్పీల్‌ను ముఖ్య ఎన్నికల అధికారికి సమర్పించవచ్చుని తెలిపారు.

# తెలుగు భాషానిలయానికి 10 లక్షల గ్రాంటు

## గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న గ్రేడ్ 1, 2, 3 పోస్టుల భర్తీ

### రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షుడు డా. రియాజ్

### గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు: డా. కె.వి.రమణాచారి

### వైభవంగా 125 సంవత్సరాల శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం స్థాపన దినోత్సవాలు


స్మారక పురస్కారంతో గీతా రామస్వామిని సత్కరిస్తున్న రమణాచారి, రియాజ్, ఉడయవర్లు, శారద తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** తెలుగుభాషా వికాసానికి గత 125 సంవత్సరాలుగా విశేష కృషిచేస్తున్న శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం తాజాగా 10లక్షల రూపాయల గ్రాంటును మంజూరు చేసినట్లు తెలంగాణ గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షుడు డా. రియాజ్ తెలిపారు. కేవలం ఉత్తర్వులే కాకుండా ఆ మొత్తం భాషానిలయానికి అందే వరకు స్వయంగా కృషిచేస్తానని హామీనిచ్చారు. గత పదేళ్లగా రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న గ్రేడ్ 1, 2, 3 గ్రంథపాలకుల పోస్టుల భర్తీకి తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన వివరించారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం ఆధ్వర్యంలో సంస్థలో రావిచెట్టు రంగారావు కళావేదికలో భాషానిలయం అధ్యక్షుడు, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగిన తెలుగు భాషానిలయం 125 సంవత్సరాల స్థాపన దినోత్సవాలకు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షుడు డా. రియాజ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రొఫెసర్ ఎస్.సుదర్శనరావు, టి.ఉడయవర్లు తదితరులతో కలిసి జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యాసంలో గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలన్నారు. ప్రభుత్వాలు వాటిని ఏమాత్రం విస్మరించరాదని స్పష్టం చేశారు. గ్రంథాలయాల్లో ఖాళీ పోస్టు లను భర్తీచేయడానికి కృషి, భాషానిలయానికి 10లక్షల గ్రాంట్‌కు కృషిచేసిన రియాజ్‌ను, ప్రభుత్వాన్ని అభినందించారు. అనంతరం పౌరగ్రంథాలయాలు - నాడు నేడు అన్న అంశంపై 3 సాంకేతిక సమావేశాలు గ్రంథాలయ సదస్సులో అర్థవంతంగా జరిగాయి. ముగింపు సభలో డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు రావిచెట్టు రమాదేవి, టి.ఉడయవర్లు, డా. వి.కిషన్‌రావు, రావి శారత తదితరులతో కలిసి హైదరాబాద్ బుక్ ట్రస్ట్ అధినేత్రి గీతా రామస్వామిని ఘనంగా సత్కరించి భాషానిలయం ప్రథమ దాత రావిచెట్టు లక్ష్మీనర్సమ్మ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం భాషానిలయం పురోభివృద్ధికి విశేష కృషిచేసిన ప్రముఖులు, స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రదర్శిం చిన భాగ్యనగర భాషా నిలయం (శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం వైభవం) సాహిత్య రూపకంలో పాల్గొన్న కవులు, కళాకారులను సన్మానించి ఎంతగానో అభినందించారు.

# మనుషులను చంపితే నక్సలిజం పోదు

## ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** మనుషులను చంపితే నక్సలిజం పోదని కాంగ్రెస్ పార్టీ ఎంపి మల్లు రవి అన్నారు. బిజెపి అంటేనే బిజినెస్ పార్టీ అని ఆయన విమర్శించారు. నక్సల్స్‌కు ఒక ఫిలాసఫీ, సిద్ధాంతం ఉందని సిఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో తప్పేమిలేదని ఎంపి మల్లు రవి మంగళవారం పార్టీ నాయకులు రాములు నాయక్, శ్యాంమోహన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. పేదప్రజలు సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం కావాలన్నది ముఖ్యమంత్రి అభిమతమని మల్లు రవి అన్నారు. నక్సల్స్ కూడా సామాజిక ఆర్థిక అసమానతలు దూరం కావాలని కోరు కుంటారని ఆయన తెలిపారు. సల్వాజుడుం విషయంలో వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టిందని బిజెపి నాయకుడు, కేంద్రమంత్రి బండి సంజయ్ అనడంలో అర్థం లేదన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం వాళ్లు, వాళ్లనువాళ్లే చంపుకునే వ్యవస్థను జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వ్యతిరేకించారని ఆయన వివరించారు. ప్రతిపౌరుడికి అభివృద్ధి ఫలాలు అందాలని కోరుకునే నక్సల్స్ ఫిలాసఫీని ముందుపెట్టుకోవడంలో తప్పేమి లేదన్నారు. అంతమాత్రాన తీవ్ర వాదాన్ని ప్రోత్సహించినట్లు కాదన్నారు. టెర్రరి జానికి, నక్సలిజానికి తేడా ఉందని మల్లు రవి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ విమర్శలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

# ప్రధాని వద్దకు అఖిలపక్ష బృందాన్ని తీసుకెళ్లాలి

## టిపిఆర్‌పి వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్


రవికుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** బిసిలకు విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల లో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42 శాతం రిజర్వేషన్లను రాష్ట్రపతి, గవర్నర్‌లు వెంటనే ఆమోదించాలి, అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధాని మోడీని కలవాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ (టిపిఆర్‌పి) వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ డిమాండ్ చేశారు. చట్టం చేసిన తర్వాతనే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజారాజ్యం పార్టీ కార్యాలయంలో ఆయన మీడి యాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే అఖిలపక్ష బృందాన్ని బీసీ మేధావులు, బీసీ సంఘాల నేతలను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధాని మోదీని కలిసి తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని, దీనికి కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్లు చట్టపరంగా అమలుకు వెంటనే జీవో జారీ చేయాలని ఈ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఎవ్వరు కూడా కోర్టులకు వెళ్ళవద్దని ఆయన కోరారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు ప్రజా రాజ్యం పార్టీ కేటా యిస్తుందని, యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట నిర్మాణంలో జరిగిన అక్రమాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిబిఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామని జిలుకర రవికుమార్ తెలిపారు.


తుక్కుగూడా, మంఖాల్‌ల్లో డబుల్‌బెడ్ ఇళ్లను కేటాయించాలంటూ సిఎం ప్రజావాణికి వచ్చిన వారితో మాట్లాడుతున్న స్టేట్ నోడల్అధికారి దివ్య.

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 243

**హైదరాబాద్ (బేగంపేట), సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 243 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు 57 దరఖాస్తులు రెవెన్యూ శాఖకు 33దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్లకోసం 87 దరఖాస్తులు ప్రవాసీ ప్రజావాణికి 3 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ లు దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు. తుక్కుగూడా మంఖాల్ గ్రామాలలో డబుల్ బెడ్ రూం ఇండ్లను రాష్ట్ర ప్రభుత్వం సుమారు ఒక వేయి మంది లబ్దిదారులకు మంజూరు చేసినప్పటికీ హైకోర్టు ఆదేశాలతో ఆ మంజూరు ఉత్తర్వులు రద్దు కావడంతో పెద్ద ఎత్తున లబ్దిదారులు మంగళవారం ప్రజాభవన్‌కు వచ్చారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే డబుల్‌బెడ్ ఇళ్లను కేటాయిస్తామని చిన్నారెడ్డి, దివ్యలు లబ్దిదారులకు భరోసా ఇచ్చారు.

## గోల్డ్ స్మగ్లింగ్ కేసులో నటి రన్యారావుకు

# రూ.102.55 కోట్ల జరిమానా

**బెంగళూరు, సెప్టెంబరు 2:** గోల్డ్ స్మగ్లింగ్ కేసులో సంచలనం సృష్టించిన కన్నడ నటి రన్యారావుకు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) బిగ్‌షాక్ ఇచ్చింది. ఆమెకు ఏకంగా రూ.102.55 కోట్ల జరిమానా విధించింది. ఈ హై ప్రొఫైల్ బంగారు అక్రమ రవాణా కేసులో నటి రన్యా రావుతోపాటు మరో ముగ్గురికి డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మొత్తం నలుగురు నిందితులకు ఏకంగా రూ.270 కోట్ల జరిమానా విధించింది. 127.3 కిలోల అక్రమ రవాణా బంగారాన్ని స్వాధీనం చేసుకున్న కన్నడ పోలీసులు మార్చి 3న నటి రన్యను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కేసు విచారణలో




ఉండగా ఈ రోజు డిఆర్ఐ తీర్పు వెలువరించింది. ఇందులో భాగంగా రన్యాకు ఏకంగా రూ.102.55 కోట్ల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం జైలు లోపల ఆమెకు నోటీసులు అందజేశారు. బకాయిలు చెల్లించకపోతే నిందితుల ఆస్తులను జప్తు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఈ కేసులో 72.6 కిలోల బంగారాన్ని అక్రమంగా రవాణా చేసినందుకు తరుణ్ కొండూరు రాజును దోషిగా తేల్చడంతో రూ.62 కోట్ల జరిమానాను విధించింది. ఇక 63.61 కిలోల గోల్డ్ అక్రమ రవాణాకు బాధ్యులుగా తేలిన సాహిల్ జైన్, భరత్ జైన్ ఇద్దరికీ రూ.53 కోట్లు చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశించింది. డిఆర్ఐ తన షోకాజ్ నోటీసులతోపాటు 2500 పేజీలకు పైగా పత్రాలను అందించింది. ఈ మేరకు కస్టమ్స్ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద చర్యలు చేపట్టింది. దీనిపై త్వరలోనే ప్రాసిక్యూషన్ చేపడతామని అధికారులు సూచించారు. మరోవైపు ఈ కేసుకు సంబంధించిన విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నిరోధక చట్టం పిటిషన్‌ను హైకోర్టు విచారించి తదుపరి విచారణను ఈనెల 11కి వాయిదా వేసింది.

# క్రిమినల్ రికార్డు ఉన్న విదేశీయులకు అనుమతిలేదు!

## రాష్ట్రాలు, యుటిలకు హోంమంత్రిత్వశాఖ తాజా ఆదేశాలు జారీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 2:** దేశ భద్రతకు సంబంధించి క్రిమినల్ రికార్డులు ఉండే విదేశీయులను దేశంలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం ఆదేశాలు జారీచేసింది. కేంద్ర హోం శాఖ మంగళవారం మార్గ దర్శకాలను జారీచేసింది. గతంలో వచ్చి నేరాలకు పాల్పడినా, దేశ వ్యతిరేక చర్యలకు దిగిన విదేశీయులను మళ్లీ రాకుండా నిరోధించాలని స్పష్టమైన ఆదేశాలు వెలువరించింది. భారత్ వచ్చి గూఢచర్యం, తీవ్రవాద కార్యకలాపాలు, హత్యలు, అత్యాచారాలు, డ్రగ్స్ స్మగ్లింగ్ వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడి దోషులుగా నిర్ధారణ అయిన విదేశీయులను గుర్తించి, మళ్లీ వారిని దేశంలోకి ప్రవేశించకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్రాలదేనని హోంశాఖ తేల్చిచెప్పింది. ఒకవేళ అలాంటి వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే తక్షణమే అదుపులోకి తీసుకోవాలని పేర్కొంది. ఇందుకోసం ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ సవరణ చట్టం (2025) ప్రకారం ప్రత్యేక హోల్డింగ్ సెంటర్లు లేదా డిటెన్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో సూచించింది. సరిహద్దుల్లోనూ భద్రతను కట్టుదిట్టం చేయాలని హోంశాఖ ఆదేశాలు వెలువరించింది. అక్రమ వలసదారులు, చొరబాటుదారులను నిరోధించేందుకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, తీరంలో కోస్ట్ గార్డ్ దళాలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించింది. ఇదే సమయంలో ఆఫ్గనిస్థాన్, చైనా, పాకిస్థాన్ పౌరులు దేశంలోని కొన్ని సున్నితమైన సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించడం నిషేధించింది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, జమ్మూ కశ్మీర్‌లోని కొన్ని ప్రదేశాలకు వారు వెళ్లకుండా చూడాలని , భారత్‌లో ఉద్యోగం చేయడానికి వీసా, సరైన పత్రాలు ఉన్న విదేశీయులు కూడా స్థానిక అధికారుల అనుమతి లేకుండా విద్యుత్, జల, పెట్రోలియం వంటి ముఖ్యమైన



రంగాల్లోని ప్రయివేట్ సంస్థల్లో చేరకూడదని కొత్త షరతు విధించింది.

## కొనసాగుతున్న అవే ఇబ్బందులు

### తప్పని పడిగాపులు, తోపులాటలు, ధర్నాలు

# వీడని యూరియా కష్టాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కోసం రైతులకు పాట్లు తప్పడం లేదు. పంపిణీ కేంద్రాలు, దుకాణాల ముందు రైతులు బారులు తీరి పడిగాపులు పడుతున్నారు. ఎరువుల కోసం అర్ధరాత్రి వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. సొసైటీల్లో రైతులకు సరిపడా బస్తాలు ఇవ్వకపోవడంతో పొద్దంతా పనులు వదులుకొని గోదాముల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తున్నది. గంటల తరబడి క్యూలో నిల్చున్నా యూరియా దొరుకుతుందన్న గ్యారెంటీ లేదు. దీంతో నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది. ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.266 లకు లభించాల్సిన యూరియా బస్తాను బయట ఫెర్టిలైజర్ షాపుల్లో రూ.350 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. రామారెడ్డి సొసైటీ దగ్గర యూరియా కోసం భారీగా క్యూ కట్టారు. సరిపడా యూరియా లేక తోపులాట జరగడంతో పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేశారు. యూరియా కోసం పోటెత్తిన రామారెడ్డి మండలంలోని 18 గ్రామాల రైతులు పోటెత్తగా 450 బస్తాలే స్టాక్ ఉందని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలకు అవసరమైనప్పుడే యూరియా వేయాలని, టైం దాటి పోయాక ఎరువులు వేసినా ప్రయోజనం ఉండదంటున్నారు రైతులు. ప్రభుత్వం వెంటనే యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో ఒక దశలో తోపులాట జరిగింది. దాంతో పోలీసు బందోబస్తు నడుమ పంపిణీ చేశారు. వికారాబాద్ జిల్లా దోమలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం నిర్వాహకులు టోకెన్లు ఇచ్చి అందరికీ యూరియా ఇవ్వకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేందుకు నిర్వాహకులు యత్నిస్తున్నారని ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ సహకార సంఘంకు వచ్చిన రైతుల పట్టా, ఆధార్ జిరాక్స్ ప్రతులను విసిరేశారు. గత వారం రోజులుగా ఎదురుచూస్తున్న నర్సింహులపేట రైతులకు ఎట్టకేలకు వ్యవసాయ అధికారులు పోలీసుల సమక్షంలో కూపన్లు పంపిణీ చేశారు. సుమారు వెయ్యి మంది రైతు వేదిక వద్దకు రాగా 770 మందికి మాత్రమే కూపన్లు ఇవ్వడంతో మిగిలిన రైతులు నిరాశతో వెనుతిరిగారు. జనగామ జిల్లా పాలకుర్తిలో రైతు సేవా సహకార పరపతి సంఘం వద్దకు తెల్లవారుజాము నుంచే రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 500 మందికి పైగా రైతు లు క్యూలైన్‌లోనే గంటల తరబడి నిలబడ్డారు. హైదరాబాద్ నుంచి 444 యూరియా బస్తాలు రాగా, వాటిని పోలీసుల సమక్షంలో ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. యూరియా అందని రైతులు నిరాశతో వెళ్లిపోయారు. సరిపడా యూరియా ఇవ్వాలంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో రైతులు రహదారిపై బైఠాయించారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సుదర్శన్‌రెడ్డికి మద్దతు తెలపాలి

### దేశవ్యాప్తంగా విద్యావంతులు, మేధావులు, జర్నలిస్టుల సంతకాల సేకరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతుగా దేశవ్యాప్తంగా విద్యావంతులు, మేధావులు, జర్నలిస్టులు, ప్రముఖ సామాజిక కార్యకర్తల నుంచి సేకరించిన సంతకాల పత్రాన్ని ప్రముఖ జర్నలిస్టులు రామచంద్రమూర్తి, మల్లెపల్లి లక్ష్మయ్య, ప్రొఫెసర్ కోదండరాం విడుదల చేశారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ఇది కేవలం ఒక ఎన్నిక మాత్రమే కాదు... భారతదేశ భావప్రకటన స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య సంస్థల నిలకడపై జరుగుతున్న ఎన్నిక. దేశంలో పౌరుల హక్కులు బలహీనమవుతున్న ఈ సమయంలో, ఈ ఎన్నిక దేశ ముఖచిత్రానికి దిక్సూచిగా నిలవాలి" అన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడే శక్తులు ఒకవైపు, రాజ్యాంగ వ్యతిరేక శక్తులు ఒకవైపు ఉన్నాయి. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మీ మీ పరిధులను దాటి ముందుకు రావాలి. ఈ ఎన్నికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు విద్యావంతులు, మేధావులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు తదితరులు 155 మంది సంతకాలు చేసినట్లు తెలిపారు. ఈ సంఖ్య త్వరలో మరింత పెరుగుతుందని అన్నారు. హోమ్ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ సుదర్శన్ రెడ్డి గారిని అర్బన్ నక్సలైట్ అని పిలవడం తగదు. ఆ పదానికి అర్థం లేదు. అర్బన్ ప్రాంతాల్లో ప్రజాస్వామ్యం కోసం పని చేసే వారిని నక్సలైట్లు అనడం దురదృష్టకరం.

ప్రజాస్వామ్యాన్ని కోరుకోవడం తప్పయితే అంతకన్నా ప్రమాదకరమైనది ఇంకేమీ ఉండదు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులు తెలియని వారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారు" అని తీవ్రంగా విమర్శించారు. మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ "సుదర్శన్ రెడ్డి గారికి ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేసే అర్హతలు అన్నీ ఉన్నాయి. ఆయన నిజమైన ప్రజల అభ్యర్థి. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్న ఈ సమయంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆయనను గెలిపించాలి" అన్నారు. జర్నలిస్టు రామచంద్రమూర్తి మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి ఎన్నికపై దేశం మొత్తం చర్చ జరుగుతోంది. రాజకీయాలకు అతీతంగా సుదర్శన్ రెడ్డి గారికి మద్దతు లభిస్తోంది. మమతా బెనర్జీ, కేజ్రీవాల్ తదితరులు ఇప్పటికే తమ మద్దతు ప్రకటించారు. ఈ ఎన్నికల్లో ఎంపీలు మానసాక్షి గా ఓటు వేయాలి" అని పిలుపునిచ్చారు. పాశం యాదగిరి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సుదర్శన్ రెడ్డి గారికి మద్దతు తెలుపుతున్నారు. రాజ్యాంగానికి కట్టుబడి ఉన్న వ్యక్తి ఆయన. రాజ్యాంగం పట్ల శ్రద్ధ ఉన్న ప్రతివారు ఆయనకు మద్దతు ఇవ్వాలి' అన్నారు.

# యువతకు తెలుగు భాషా సాహిత్యాలపై మమకారం పెంచాలి

### రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

### వైభవంగా తెలుగు విశ్వవిద్యాలయం 2023 కీర్తి పురస్కారాల ప్రదానోత్సవం

**హైదరాబాద్ (నాంపల్లి), సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** సమాజంలో నేటి పిల్లల దగ్గర నుండి యువత వరకు తెలుగు భాషా, సాహిత్యాలపై మమకారం పెంచేవిధంగా సాహిత్యకారులు సామాజిక మాధ్యమాల ద్వారా కృషిచేయాలని తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం వారికి ఆదిశగా సహకారాన్ని అందించాలని సూచించారు. తెలుగు విశ్వవిద్యాలయం ప్రతీయేటా అందిస్తున్న ప్రతిష్టాత్మక కీర్తిపురస్కారాల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన సాహిత్య రంగంలోని ప్రముఖులకు ఇచ్చే పురస్కారాల పారితోషికం పెంచేందుకు తెలుగు విశ్వవిద్యాలయం ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి పంపాలని సూచిస్తూ అందుకు తాను పూర్తి సహకారం అందిస్తానని భరోసానిచ్చారు. విశ్వవిద్యాలయం ప్రతిభావంతులు, మేధావులకు పురస్కారాలు ఇవ్వడమేకాక సాహితీ సాంస్కృతిక రంగాలలో అభిరుచి, అనురక్తి, ఆసక్తిగల ఎందరినో గుర్తించి వారిలో సృజనాత్మకతను పెంచే కీలక బాధ్యతను నిర్వర్తిస్తోందని తెలిపారు. పురస్కార గ్రహీతలను సభకు పరిచయం చేస్తూ వారి అసాధారణ ప్రతిభా విశేషాలను వివరించారు. విశిష్ట అతిథి తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ తెలుగుభాషా అస్తిత్వానికై ఏర్పడిన తెలుగు విశ్వవిద్యాలయం వివిధరంగాల్లోని సృజనశీలులకు, నిష్కామ కర్మయోగులకు ప్రతీయేటా వివిధ పురస్కారాలు అందిస్తూ వారిలో నూతనోత్సాహాన్ని, ఉద్వేగాన్ని పురిగొల్పుతూ తెలుగుభాషా సాహితీ లలిత కళారంగాలకు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి యేడాది వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసిన 48 మంది ప్రముఖులను కీర్తి పురస్కారాలతో సత్కరిస్తుండగా ఇందులో భాగంగా 2023 సంవత్సరానికి ఎంపిక చేసిన 24 మందికి మంగళవారం నందమూరి తారక రామారావు కళావేదికలో కీర్తి పురస్కారాలు అందజేస్తున్నట్లు విస్తరణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామమూర్తి వివరించారు.

శ్రీదేవసేన, మామిడి హరికృష్ణ, నిత్యానందరావు, హనుమంతరావు కీర్తి పురస్కారాలను ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. వీరికి కీర్తి పురస్కారంతోపాటు ఒక్కొక్కరికి 5,116 రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. చివరిగా పురస్కార స్వీకర్తలు తమ స్పందన తెలిపారు.

పురస్కారాలు అందుకున్న వారిలో మునిషడుగుల రాజారావు (ఆధ్యాత్మిక సాహిత్యం), వారణాసి వెంకటేశ్వర్లు (ప్రాచీన సాహిత్యం), కొరుప్రోలు హరినాథ్ (సృజనాత్మక సాహిత్యం), సి.ఎస్. రాంబాబు (కాల్పనిక సాహిత్యం), ప్రభాకర్ మందార (అనువాద సాహిత్యం), డా. టి.లక్ష్మీ నారాయణ (అనువాదం), గంగిశెట్టి శివకుమార్ (బాలసాహిత్యం), సయ్యద్ హనీఫ్ (వచన కవిత), నందకిషోర్ (వచన కవిత), ఇరువింటి వెంకటేశ్వం శర్మ (గజల్), డా. రాయల హరిశ్చంద్ర (నాటక రంగం), ముంజనంపల్లి వీరబ్రహ్మేంద్రాచారి (పద్య రచన), పిన్నంశెట్టి కిషన్ (కథ), ప్రభాకర్ జైని (నవల), మంగిపూడి రాధిక (హాస్య రచన), పగిడి పాల ఆంజనేయులు (జీవితచరిత్ర), ఎ.జ్యోతిరాణి (వివిధ ప్రకియలు), డా.దేశిరాజు లక్ష్మీనరసింహా రావు (ఉత్తమ నాటకరచయిత), డా.చిత్తర్వు మధు (జనరంజక విజ్ఞానం), డా.వి.త్రివేణి (పరిశోధన), ఆచార్య డి.విజయలక్ష్మి (భాషా ఛందస్సు), ఆచార్య సి.హెచ్.సుశీలమ్మ (సాహిత్య విమర్శ), బులుసు అపర్ణ (అవధానం), విల్సన్‌రావు కొమ్మవరపు (వచనకవి)లు ఉన్నారు.





కీర్తి పురస్కార గ్రహీతలతో శ్రీదేవసేన, నిత్యానందరావు, మామిడి హరికృష్ణ, హనుమంత రావు, రామమూర్తి తదితరులు

## మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు అక్రమాలపై ఇడి చర్యలు

### మాజీ ఎండి కుమారుడి రూ.1.1 కోట్ల ఆస్తులు జప్తు

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** నగరంలో సహకార బ్యాంకుల్లో పేరున్న మహేష్ కో..ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు అవకతవకలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) చర్యలకు ఉపక్రమించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్లలోని కోటి పది లక్షల రూపాయల విలువైన స్థిరాస్తులను ఈడీ మంగళవారం నాడు జప్తు చేసింది. బ్యాంకు మాజీ ఎండి, సీఈఓ ఉమేష్ చంద్ అసవా కుమారుడు రోహిత్ అసవా పేరిట ఈ ఆస్తులున్నాయని ఈడీ గుర్తించింది. రుణాల మంజూరు కోసం రోహిత్ అసవా రెండు నుంచి నాలుగు శాతం కమీషన్ వసూలు చేసినట్లు అందిన ఫిర్యాదులపై విచారించిన ఈడీ దీనిపై చర్యలకు ఉపక్రమించింది. ఈ బ్యాంకు మాజీ ఛైర్మన్ రమేష్ కుమార్‌బంగ్. మాజీ ఎండి, సీఈఎ ఉమేష్ చంద్ అసవా సహా బ్యాంకులో కీలక హోదాలో వున్న పురుషోత్తం దాస్ మందానలపై ఇప్పటికే ఈడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అక్ర మాస్తుల కొనుగోలు ద్వారా మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ గుర్తించింది. ఇందులో భాగంగా తాజాగా కోటి పది లక్షల రూపాయల ఆస్తులను జప్తు చేశారు.



## సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ విజేతలకు పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సన్మానం

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** బెంగళూరులో జరిగిన 4వ సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో విజేతలైన ఆటగాళ్లు, మాస్టర్స్‌కు గాంధీభవన్‌లో తెలంగాణ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో తెలంగాణ నుంచి పాల్గొన్న క్రీడాకారులు 8 బంగారు, 6వెండి, 8 కాంస్య పతకాలు సాధించి రాష్ట్ర ప్రతిష్టను నిలబెట్టారన్నారు. ఆటగాళ్ల కృషి, మాస్టర్స్ శ్రమకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఛాంపియన్‌షిప్ విజేతలకు తెలంగాణ కరాటే అసోసియేషన్ తరపున హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి క్రీడలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నారని, ఇటీవలే కియో జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలను విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేశారు. 2027లో జరగబోయే ఆసియన్ కరాటే ఛాంపియన్‌షిప్‌ను హైదరాబాద్‌లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి పాల్గొన్నారు.





# ర్యాలీలో బైకు పోగొట్టుకున్న వ్యక్తికి కొత్త బైక్ కొనిచ్చిన రాహుల్

**పాట్నా, సెప్టెంబరు 2:** బీహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర 'ర్యాలీలో బైకు పోగొట్టుకున్న ఓ దాబా ఓనర్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కొత్త బైక్‌ను బహుమతిగా ఇచ్చారు. గతనెల 27న దర్భంగాలో రాహుల్ గాంధీ రోడ్‌షో, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ మార్గంలో పార్క్ చేసిన బైక్‌లను భద్రతా సిబ్బంది ఆ ర్యాలీకి ఉపయోగించారు. వాటిలో ఓ దాబా యజమాని శుభమ్‌కు చెందిన పల్సర్ 220 బైక్ కూడా ఉంది. శుభమ్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రతా సిబ్బంది టీ తాగడానికి తన దాబా దగ్గర ఆగారు. టీ తాగిన తర్వాత రోడ్ షో కోసం బైక్ కావాలని అడిగారు. ఈ రోడ్ షో కేవలం 1.5 కిలోమీటర్ల మాత్రమే ఉంటుందని, తర్వాత తిరిగిస్తామని హామీ ఇచ్చారు. శుభమ్ అంగీకరించడంతో అతడిని కూడా తమతో తీసుకెళ్లారు. కానీ కొంతదూరం వెళ్లిన తర్వాత శుభమ్‌ను ఒక కారులో ఎక్కించారు. ర్యాలీ ముగిసిన తర్వాత శుభమ్‌కు తన బైకు కనిపించలేదు. ఎంత వెతికినా తన బైకుగానీ, తన దగ్గర బైకు అడిగి తీసుకున్న భద్రతా సిబ్బందిగానీ కనపడలేదు. తర్వాత భద్రతా సిబ్బందికి ర్యాలీ ప్రాంతంలో ఆరు బైక్‌లు లభ్యమయ్యాయి. అయితే అందులో శుభమ్ బైకు లేదు. ఈ విషయం స్థానిక కాంగ్రెస్ నాయకుడు శుభమ్ యాదవ్‌కు తెలిసింది. దాంతో ఆయన శుభమ్‌ను పట్నాకు రావాలని ఆహ్వానించాడు. దాంతో పట్నాలో జరిగిన ఓటర్ అధికార్ యాత్ర ముగింపు కార్యక్రమ వేదిక వద్దకు శుభమ్ వెళ్లాడు. ఆ వేదికపై రాహుల్ గాంధీ స్వయంగా తనకు కొత్త బైకు తాళాలు అందించారు. ర్యాలీలో తాను కోల్పోయిన మోడల్ బైకు రాహుల్‌గాంధీ తనకు బహుమతిగా ఇచ్చారని శుభమ్ తెలిపారు

## ఇంటి పేరు మార్చిన బిఆర్ఎస్ సోషల్ మీడియా

# కల్వకుంట్ల కాదు.. దేవనపల్లి కవిత!

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన వెంటనే బీఆర్ఎస్ శ్రేణులు తమ స్వరం మార్చారు. ఇన్నాళ్లు కేసీఆర్ తనయగా గౌరవ మర్యాదలు అందుకున్న ఆమెను ట్రోల్ చేయడం ప్రారంభించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆఫీసుల్లో ఆమె పోస్టర్లు, బ్యానర్లు తీసివేయడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఆమె దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కవితకు చెందిన ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా ఖాతాలను బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు అన్‌ఫాలో చేస్తున్నారు. ఈ క్రమంలోనే కవిత.. కల్వకుంట్ల అనే ఇంటి పేరును పెట్టుకోవడంపై పార్టీ శ్రేణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. సస్పెండ్ కాకముందు కల్వకుంట్ల కవిత అని.. సస్పెన్షన్ అనంతరం దేవనపల్లి కవిత అని అంటున్నారు. కొత్తగా బీఆర్ఎస్‌కు దేవనపల్లి కవిత వర్గం నుంచి ఫేక్ సమస్య మొదలైంది అంటూ ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ న్యూస్ ట్వీట్ చేసింది. ఇన్ని రోజులు బీఆర్ఎస్ పార్టీకి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ఫేక్ న్యూస్ బెడద ఉండేది కానీ, ఇప్పుడు కొత్తగా దేవనపల్లి కవిత వర్గం నుంచి ఫేక్ సమస్య మొదలైంది. ఐదేళ్ల క్రితం తెలంగాణ భవన్‌లో జరిగిన ఫైర్ యాక్సిడెంట్ వీడియోను మంగళవారం 'ఆడబిడ్డ శాపం తగిలి.. పార్టీ ఆఫీస్ దహనం అయ్యిందంటూ జాగృతి అల్లరి మూకలు ప్రచారం చేస్తున్నాయనీ బీఆర్ఎస్ న్యూస్ పోస్ట్ చేసింది.

# జిఎస్టీ హేతుబద్ధీకరణ వల్ల రాష్ట్రాలకే మేలు

### రూ.14 లక్షల కోట్ల వరకూ లబ్ధి పొందుతాయన్న ఎస్బీఐ రీసెర్చి నివేదిక

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 2:** జిఎస్టీలో తెస్తున్న సంస్కరణల వల్ల రాష్ట్రాల ఆదాయానికి గండిపడుతున్నదన్న వాదనను ఎస్‌బిఐ రీసెర్చినివేదిక పటాపంచలుచేసింది. జిఎస్టీ మండలి సమావేశం బుధవారం జరగనున్న నేపథ్యంలో ఈ నివేదికను ఎస్‌బిఐ విడుదలచేసింది. వాస్తవానికి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలు లబ్ధిపొందుతాయని సుమారు 14 లక్షలకోట్ల ఆదాయం వస్తుందని ఎస్‌బిఐ రీసెర్చి నివేదికలో వెల్లడించింది. ఎస్జీఎస్టీరపంలోనే 10 లక్షలకోట్లు, రాష్ట్ర వాటాలకింద మరో రూ.4.1 లక్షలకోట్లు అందుతాయని స్పష్టంచేసింది. గతవారంలో ఎనిమిది విపక్ష పాలిత రాష్ట్రాలయిన హిమాచల్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు రెండే రెండు శ్లాబులకుకుదించడంవల్ల రాష్ట్రాల ఆదాయానికి గండిపడుతుందని వాదించాయి. ఈ నష్టాన్ని కేంద్రమే భరించాలని డిమాండ్‌చేసాయి. వివిధ





ఆర్థిక రీసెర్చి సంస్థలు కూడా జిఎస్టీ రెండు శ్లాబులకు రావడంవల్ల రూ.85 వేలకోట్లు రాష్ట్రాలకు నష్టం వస్తుందని, సాలీనా రెండు లక్షలకోట్లు చొప్పున భారీ నష్టం వాటిల్లుతుందని ఈ రాష్ట్రాలు కేంద్రానికి నివేదించాయి. అయితే ఎస్‌బిఐ ఆర్థికవేత్తల బృందం 16వ ఆరథిక సంఘం ప్రధాన ఆర్థిక సలహాదారు సౌమ్యకాంతి ఘోష్‌లు వారి అంచనాలు వేరుగా చూపించారు. 2026 ఆర్థికసంవత్సరానికి రాష్ట్రాలు నికరలాభాలు ఆర్జిస్తాయని, జిఎస్టీ రేట్‌హేతుబద్ధీకరణ జరిగినా కూడా రాష్ట్రాలకు మేలు జరుగుతుందని వెల్లడించారు. ఎస్జీఎస్టీ పేరిట రూ.10 లక్షలకోట్లు, మరో 4.1 లక్షలకోట్లు వాటాల పంపిణీద్వారా అందుతుందని తేల్చి చెప్పారు. అన్ని రాష్ట్రాలకు జిఎస్టీ రాబడులు 9,96,500 కోట్లునుంచి 14,10,610 కోట వరకూ ఉంటుందని హేతుబద్ధీకరణ తర్వాతనే ఈమొత్తం ఉంటుందని వివరించారు. ఈ రాష్ట్రాల్లో భారీ లబ్దిదారులు ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాలున్నాయి. అలాగే స్థూల రాబడి నష్టం కూడా 85 వేల కోట్లవరకూ జిఎస్టీ 2.0హయాంలో ఉంటుందని అయితే వినియోగం కూడా రూ.1.98 లక్షలకోట్లు పెరుగుతుందని అంచనావేసింది. పన్నుకోత తర్వాతచూస్తే మొత్తం అదనంగా 5.31 లక్షలకోట్ల వినియోగ వ్యయం ఆర్థికవ్యవస్థలో ఉంటుందని తేల్చింది. ఈమొత్తం జిడిపిలో 1.6శాతంగా ఉంటుంది.

# అత్తింటి వేధింపులకు నవవధువు బలి

### మెదక్ జిల్లాలో విషాద ఘటన

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:** అత్తింటి వేధింపులు భరించలేక ఓ నవ వధువు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న మెదక్ జిల్లా చిన్నశంకరంపేట పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... చిన్నశంకరంపేటకు చెందిన వానరాసి రాధిక(19)కు ఇదే పట్టణానికి చెందిన కుమార్‌తో నెల రోజుల క్రితం వివాహం జరిగింది. వివాహం అయినప్పటి నుండి కుమార్, రాధికను మానసికంగా, శారీరకంగా వేధించేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ విషయంపై కులస్తులు, పెద్దల సమక్షంలో సర్ధిచెప్పినప్పటికి కుమార్‌లో ఎలాంటి మార్పులు రాకపోగా వేధింపులు ఎక్కువయ్యాయి. భర్త కుమార్ పెట్టె వేధింపులు తట్టుకోలేక రాధిక మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి అమ్మమ్మ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు. అయితే మృతురాలి తండ్రి యాదయ్య 8 సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోగా, తల్లి సంవత్సరం క్రితం, అన్న శ్రీను ఆరు నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు, కోడలు, మనవడు, మనవరాలు మృతితో అమ్మమ్మ లక్ష్మి పడుతున్న బాధ వర్ణణాతీతం.



రాధిక (ఫైల్)

# మూవీ చూస్తుంటే మీ కాలేజీ రోజులు గుర్తుకొస్తాయి..

"90ఎస్ మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ మౌళి తనుజ్, "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్ లో నటిస్తున్న మూవీ "లిటిల్ హార్ట్స్". ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. "90ఎస్ మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ "లిటిల్ హార్ట్స్ "మూవీకి నిర్మాతగా వ్యవహరించారు.




ఈ సినిమాను నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి థియేట్రికల్ గా రిలీజ్ చేస్తున్నారు. "లిటిల్ హార్ట్స్" సినిమా ఈ నెల 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ షేర్ చేసుకున్నారు హీరోయిన్ శివానీ నాగరం. మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి నా చిన్నప్పటి స్నేహితుడు. ఆయన ద్వారా "లిటిల్ హార్ట్స్" ప్రాజెక్ట్ నా దగ్గరకు వచ్చింది. మంచి స్టోరీ ఉంది, విను అని సింజిత్ చెప్పాడు. డైరెక్టర్ సాయి మార్తాండ్ కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. ప్రతి క్యారెక్టర్ ను డిజైన్ చేసిన తీరు బాగా నచ్చింది.అంబాజీపేట మ్యారేజి బ్యాండు మూవీ తర్వాత కొన్ని ఆఫర్స్ వచ్చాయి. కానీ సెలెక్టివ్ గా వెళ్లాలని వెయిట్ చేశాను. అంబాజీపేట మ్యారేజి బ్యాండు సినిమాలో లవ్ స్టోరీతో పాటు ఎమోషనల్ కంటెంట్ ఉంటుంది. "లిటిల్ హార్ట్స్"లో అలా కాదు. ఇది కంప్లీట్ లైట్ హార్టెడ్ మూవీ. కాలేజ్ డేస్ లో ఉండే ఫన్‌తో సాగుతుంది. లవ్ స్టోరీ ఉన్నా, అందులో ఎమోషనల్ ఎలిమెంట్స్ ఉండవు.'లిటిల్ హార్ట్స్' లో కాత్యాయని అనే క్యారెక్టర్ లో నటించాను. . కాత్యాయని క్యారెక్టర్ ప్రేక్షకులు తమతో తాము పోల్చుకునేలా ఉంటుంది. అఖిల్, కాత్యాయని స్నేహం, ప్రేమ చూస్తుంటే మీకు మీ కాలేజ్ డేస్ గుర్తొస్తాయి. మేమూ ఇలాగే ఉండేవాళ్లం అనిపిస్తుంది. కాత్యాయని క్యారెక్టర్ నా లైఫ్ లో కూడా రిలేటబుల్ గా ఉంది. నేనూ కాలేజ్ లో యావరేజ్ స్టూడెంట్ నే. స్టూడెంట్ లైఫ్ లో మనం చేసిన పనులన్నీ "లిటిల్ హార్ట్స్"చూస్తుంటే గుర్తొస్తాయి. ఫస్ట్ నుంచి ఈ మూవీ థియేటర్ కోసం చేసిందే. వంశీ నందిపాటి, బన్నీవాస్ ఎంటర్ అయ్యాక, బిగ్గర్ స్కేల్ రిలీజ్ కు తీసుకెళ్తున్నారు. ఓవర్సీస్ లో కూడా మా మూవీ బాగా రిలీజ్ అవుతోంది.మౌళి కంటెంట్ క్రియేటర్ నుంచి యాక్టర్ అయ్యాడు కాబట్టి సోషల్ మీడియాలో రీల్స్ బాగా చేస్తుంటాడు. . ఎక్కువమంది సేమ్ ఏజ్ గ్రూప్ కాబట్టి అంతా ఫ్రెండ్స్‌లా కలిసిపోయాం. రాజీవ్ కనకాల, అనిత చౌదరి, కాంచి, సత్యకృష్ణ..వీళ్లంతా మాతో బాగా కలిసిపోయి, మమ్మల్ని సెట్ లో బాగా ఎంకరేజ్ చేసేవారు. వీళ్లతో కలిసి నటించడం మాకు మంచిఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. నేను చదివింది గర్ల్స్ స్కూల్, గర్ల్స్ కాలేజ్, అప్పుడు అబ్బాయిలతో ఇలా మాట్లాడే అవకాశం లేదు. బన్నీవాస్, వంశీ నందిపాటి "లిటిల్ హార్ట్స్"చిన్న సినిమా అని చూడకుండా, మంచి కంటెంట్ ఉన్న సినిమా అని నమ్మి రిలీజ్ చేస్తున్నారు. ఈటీవి విన్ నుంచి వస్తున్న ఫస్ట్ థియేట్రికల్ మూవీ ఇది కావడం విశేషం."లిటిల్ హార్ట్స్"లో మ్యూజిక్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. రాజాగాడికి పాట నా ఫేవరేట్ సాంగ్. ఈ పాటలో నేను, మౌళి కలిసి ఒక హుక్ స్టెప్ చేశాం. 'లిటిల్ హార్ట్స్" లో మంచి ఫన్ ఉన్న నవ్వించే క్యారెక్టర్ దొరికింది. ఒక రొమాంటిక్ కామెడీ ఎంటర్ టైనర్ మూవీ చేయాలని అనుకుంటున్నా. నెక్స్ట్ సుహాస్ తో హే భగవాన్ అనే మూవీలో నటిస్తున్నా. ఇదొక కంప్లీట్ హిలేరియస్ ఎంటర్ టైనర్. ఇప్పటికే గ్లింప్స్ రిలీజ్ చేశాం. షూటింగ్ తుది దశకు చేరుకుంది. ఇవి కాకుండా మరో రెండు చిత్రాలు లైనప్ లో ఉన్నాయి

## అనుష్క కెరీర్‌లో ఐకానిక్ అవుతుంది

క్వీన్ అనుష్కశెట్టి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా ఘాటి. విక్రమ్ ప్రభు మేల్ లీడ్‌గా నటించిన ఈ చిత్రానికి విజనరీ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు.యువి క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి,సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. ఇప్పటికే అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్ తో సినిమా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి విలేకర్ల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. **ఇలాంటి స్క్రిప్ట రాయడానికి**


క్రిష్ జాగర్లమూడి

**మోటివేషన్ ఏమిటి?**
నా ప్రతి సినిమా ఒక అడ్వెంచర్ లాంటిదే. ఘాటి విషయానికొస్తే డాక్టర్ చింతకింద శ్రీనివాసరావు గొప్ప రచయిత. ఆయన రచనలు అద్భుతంగా ఉంటాయి. మా కంపెనీలో 'అరేబియన్ కడలి' వెబ్ సిరీస్‌కి కథ మాటలు రాశారు.కథల గురించి చర్చించుకున్నప్పుడు ఘాటి ఆలోచన చెప్పారు.

**ఈ కథ నాయికి ప్రధానంగానే పుట్టిందా?**
ఇందులో శీలావతి క్యారెక్టర్ అనుష్క గ్రేస్, యాటిట్యూడ్,

**సూపర్ స్టార్ డమ్‌కి పర్ఫెక్ట్ యాప్ట్.శీలావతి క్యారెక్టర్ ఫిక్షనలా?**అవును. ఘాటి కథ పూర్తిగా ఫిక్షనల్. గంజాయి అనేది ఒక సోషల్ ఇష్యూ. ప్రభుత్వాలు ఉక్కుపాదంతో అణిచివేయాలని ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే అవన్నీ దాటి గంజాయి అనేది సమాజంలోకి వస్తుంది.

**ఈ కథని యాక్షన్ జానర్‌లో చెప్పడానికి కారణం?**ఘాటి కథని యాక్షన్ తో చెబితేనే ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఎందుకంటే అక్కడ ఉన్న పరిస్థితులు అలాంటివి. చాలా తీవ్రమైన పాత్రలు, చాలా తీవ్రమైన భావోద్వేగాలతో ఉంటాయి.

**ఈస్టర్న్ ఘాట్స్‌లో షూట్ చేయడం ఎలాంటి అనుభూతిని ఇచ్చింది?**
ఈస్టర్న్ ఘాట్స్ చాలా పొందికగా అందంగా ఉంటాయి. అందులో పిక్ ప్లేస్ కి వెళ్ళాము. చాలా ఎక్స్ట్రార్డినరీ లొకేషన్స్ చూడబోతున్నారు. ఘాటిలో తనకి చాలా ఎక్సైటింగ్ క్యారెక్టర్ దొరికింది.

**కొత్త ప్రాజెక్ట్స్ గురించి?** ఘాటీ రిలీజ్ తర్వాత కొత్త ప్రాజెక్ట్స్ గురించి తెలియజేస్తాం.

# 'ప్రెట్టీ ప్రెట్టీ' సాంగ్ విడుదల



**యూత్ ఫుల్** లవ్ స్టోరీస్‌కి ఎప్పుడూ ఆదరణ లభిస్తూనే ఉంటుంది. ఇక అందమైన ప్రేమ కథకు, ఫ్యామిలీ ఎమోషన్‌ను జోడిస్తూ తీసే చిత్రాలకు తిరుగులేని విజయం దక్కుతుంటుంది. ఈ క్రమంలోజీస్టూడియోస్, మారుతీ టీం ప్రొడక్ట్స్, వానర సెల్యూలాయిడ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'బ్యూటీ'. అలాంటి 'బ్యూటీ' చిత్రం నుంచి ఇప్పటికే వదిలిన గ్లింప్స్, మోషన్ పోస్టర్, పాటలు, టీజర్ ఇలా అన్నీ హైలెట్ అయ్యాయి. ఇక తాజాగా ప్రెట్టీ ప్రెట్టీ అంటూ ఓ ప్రేమ గీతాన్ని విడుదల చేశారు. విజయ బుల్గానిన్ ఇచ్చిన సూథింగ్ బాణీకి సనారే రాసిన లిరిక్స్ ఎంతో ట్రెండీగా ఉన్నాయి. ఇక ఇటీవలె జాతీయ అవార్డుఅందుకున్న పీవీఎన్ఎస్ రోహిత్ పాడిన ఈ పాట ఇట్టే మనసుని తాకేలా ఉంది. ఈ లిరికల్ వీడియోని చూస్తుంటే హీరో హీరోయిన్ల కెమిస్ట్రీ, స్కూటీ చుట్టూ ఈ కథ తిరిగే విధానం అన్నీ కూడా ఆడియెన్స్‌ని కట్టి పడేసేలా ఉన్నాయి.అంకిత్ కొయ్య, నీలఖి జంటగా నటించిన ఈ మూవీకి విజయపాల్ రెడ్డి అడిదల, ఉమేష్ కుమార్ భన్సల్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇక ఈ సినిమాకు 'గీతా సుబ్రమణ్య, 'హలో వరల్డ్ ', 'భలే ఉన్నాడే' ఫేమ్ జె.ఎస్.ఎస్. వర్ధన్ మాటలు, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లేని ఆర్.వి. సుబ్రహ్మణ్యం అందించారు.సెప్టెంబర్ 19న చిత్రాన్ని విడుదల చేయబోతోన్నట్టుగా టీం ఆల్రెడీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మరింత పెంచింది. ఈ మేరకు 'బ్యూటీ' నుం 'ప్రెట్టీ ప్రెట్టీ' అంటూ క్యాచీగా సాగే లవ్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో అంకిత్ కొయ్య, నీలఖి, నరేష్, వాసుకి, నంద గోపాల్, సోనియా చౌదరి, నితిన్ ప్రసన్న, మురళీగౌడ్, ప్రసాద్ బెహరా వంటి వారు నటించారు.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్‌గా సాయి కుమార్ దారా, ఆర్ట్ డైరెక్టర్‌గా బేబీ సురేష్ భీమగాని, ఎడిటర్‌గా ఎస్‌బి ఉద్ధవ్ పని చేశారు. ఈ సినిమాకు బి.ఎస్.రావు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 19న ఈ మూవీని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.సాంకేతిక సిబ్బంది: స్క్రీన్ ప్లే, డైలాగ్స్, దర్శకత్వం: జె.ఎస్.ఎస్. వర్ధన్,

# ' ఓజీ' నుంచి పోస్టర్, గ్లింప్స్ విడుదల




**పవర్ స్టార్** అభిమానులను ఉర్రూతలూగిస్తున్న పోస్టర్, గ్లింప్స్
పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా, 'ఓజీ' చిత్ర బృందం అభిమానులకు డబుల్ బొనాంజా ఇచ్చింది. అద్భుతమైన కొత్త పోస్టర్‌తో పాటు, 'హెచ్‌బిడి ఓజీ – లవ్ ఓమి' పేరుతో ఓ సంచలనాత్మక గ్లింప్స్‌ను విడుదల చేసింది.వింటేజ్‌లుక్‌లో పవన్ కళ్యాణ్ చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్న పోస్టర్ అభిమానులను ఉర్రూతలూగిస్తోంది. ఈ పోస్టర్ రాకతో సామాజిక మాధ్యమాలు పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. పవన్ కళ్యాణ్‌ను ఈ తరహా లుక్ లో చూసి చాలా కాలం అయిందని అభిమానులు, ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. పవన్ కళ్యాణ్ ను ఇంత శక్తివంతమైన, ఆకర్షణీయమైన శైలిలో చూపించినందుకు అభిమానులు, సినీ ప్రేమికులు.. దర్శకుడు సుజీత్ ,డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.'ఓజీ'అనే టైటిల్ కి తగ్గట్టుగానే పోస్టర్ కూడా ఎంతో శక్తివంతంగా ఉంది. పవన్‌కళ్యాణ్ అభిమానుల ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ చిత్ర బృందం 'హెచ్‌బిడి ఓజీ – లవ్ ఓమి' అనే గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది. మొదటి నుండి 'ఓజీ'పై అంచనాలు భారీగానే ఉన్నాయి. పవన్ కళ్యాణ్‌ను గంభీరమైన అవతారంలో చూపించిన హంగ్రీ చీతా గ్లింప్స్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు 'హెచ్‌బిడి ఓజీ – లవ్ ఓమి' గ్లింప్స్ సినిమా యొక్క మరో విస్ఫోటన కోణాన్ని వెల్లడిస్తుంది. తాజా గ్లింప్స్‌లో ఇమ్రాన్ హాష్మీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పవన్ కళ్యాణ్ ని ఢీ కొట్టే బలమైన పాత్రలో ఆయన కనువిందు చేయనున్నారు.

# గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ త్వరలో 'పెద్ది' ఫస్ట్ సింగిల్

**గ్లోబల్ స్టార్** రామ్ చరణ్ పాన్ ఇండియా స్పెక్టకిల్ పెద్ది. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు భారీగా నిర్మిస్తున్న ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ప్రెజెంట్ చేస్తున్నారు. టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ లుక్, రామ్‌చరణ్ మేకోవర్ ఫ్యాన్స్‌లో, సినిమా లవర్స్‌లో అంచనాలు పీక్స్‌కి తీసుకెళ్లాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.మేకర్స్ ఇప్పుడు ఓ క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ప్రేక్షకులు ఎదురుచూస్తున్న పెద్ది ఫస్ట్ సింగిల్ త్వరలో రాబోతున్నట్లు అనౌన్స్ చేశారు. రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సాన, ఏఆర్ రహ్మాన్ స్టూడియోలో వున్న ఫోటోని షేర్ చేశారు. ప్రస్తుతం ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పెద్ది కోసం ఆస్కార్ అవార్డ్ విన్నర్ ఏఆర్ రహ్మాన్ బ్లాక్ బస్టర్ ఆల్బమ్ ని కంపోజ్ చేశారు. ఆడియన్స్, ఫ్యాన్స్‌కు ఎప్పటికీ గుర్తుండి పోయే సాంగ్స్‌ని రెడీ చేశారు. ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారు. జగపతి బాబు, దివ్యేందు శర్మ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ రత్నవేలు, నేషనల్ అవార్డ్ విన్నర్, నవీన్ నూలి, ఎడిటర్.పెద్ది మార్చి 27, 2026న పాన్ ఇండియా గా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. నటీనటులు: గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీకపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ,సాంకేతిక సిబ్బంది:రచన, దర్శకత్వం: బుచ్చిబాబు సాన, సమర్పకులు: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్,నిర్మాత: వృద్ధి సినిమాస్,నిర్మాత: వెంకట సతీష్ కిలారు,సంగీతం: ఏఆర్ రెహమాన్‌డిఓపి: ఆర్ రత్నవేలు, డిజైన్: అవినాష్ కొల్లా,ఎడిటర్: నవీన్ నూలి,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై.ప్రవీణ్‌కుమార్, మార్కెటింగ్: ఫస్ట్ షో,పిఆర్‌ఓ: వంశీశేఖర్.



# 'అంబికగా శ్రీయాచరణ్' స్పెషల్ పోస్టర్ రిలీజ్



**సూపర్** హీరో తేజ సజ్జా, మనోజ్ మంచు, కార్తీక్ ఘట్టమనేని, టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పాన్ ఇండియా ఫిల్మ్'మిరాయ్'నుంచి అంబికగా శ్రియ శరణ్ స్పెషల్ పోస్టర్ రిలీజ్
సూపర్ హీరో తేజ సజ్జా మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా సూపర్ హీరో విజువల్ వండర్ 'మిరాయ్'లో సూపర్ యోధ పాత్రలో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఇప్పటికే గ్లింప్స్, టీజర్, ట్రైలర్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈ చిత్రంలో శ్రియ శరణ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మేకర్స్ తాజాగా శ్రియను అంబికగా పరిచయం చేస్తూ ఒక ప్రత్యేక పోస్టర్‌ను రిలీజ్ చేశారు. శ్రియ శరణ్ పవర్ ఫుల్ మదర్ క్యారెక్టర్ లో నటిస్తున్నారు. ఈ ఎపిక్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ అడ్వెంచర్ ఆమె పాత్ర చాలా స్ట్రాంగ్ ఎమోషన్ తో వుండబోతుంది. ఈ పోస్టర్ సూపర్ హీరో ప్రయాణం వెనుక ఉన్న ఎమోషన్ ని హైలైట్ చేస్తుంది.ఈ చిత్రంలో తేజ సజ్జ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, జయరామ్, జగపతిబాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మిరాయ్ దర్శకత్వం వహించడమే కాకుండా, సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. అలాగే స్క్రీన్‌ప్లేను కార్తీక్ స్వయంగా రూపొందించారు. మణిబాబు కరణం రచన, సంభాషణలకు కీలకంగా పని చేశారు. గౌర హరి సంగీతం, ఆర్ట్ డైరెక్టర్‌గా శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా సుజిత్ కుమార్ కొల్లి పని చేస్తున్నారు. మిరాయ్ సెప్టెంబర్ 12న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది.
తారాగణం: సూపర్ హీరో తేజ సజ్జ, మనోజ్ మంచు, రితికా నాయక్, శ్రియ శరణ్, జయరామ్, జగపతి బాబు సాంకేతిక సిబ్బంది: దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని నిర్మాతలు: టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి సంగీతం: గౌర హరి, ఆర్ట్ డైరెక్టర్: శ్రీ నాగేంద్ర తంగాల రైటర్: మణిబాబు కరణం
పిఆర్‌ఓ: వంశీశేఖర్
మార్కెటింగ్: హాష్‌ట్యాగ్ మీడియా.

# మంచు మనోజ్ ను అభినందించిన రజనీకాంత్

**'మిరాయ్'** సినిమా ట్రైలర్ చూసి రాకింగ్ స్టార్ మంచు మనోజ్ ను అభినందించిన సూపర్ స్టార్ రజనీకాంత్ రాకింగ్ స్టార్ మంచు మనోజ్ కీలక పాత్రలో నటించిన సినిమా 'మిరాయ్'. ఈ సినిమా ట్రైలర్ ఇటీవలే రిలీజై మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. ఈ ట్రైలర్ ను సూపర్ స్టార్ రజనీకాంత్ చూసి చాలా బాగుందంటూ అప్రిషియేట్ చేశారు. గ్రాండ్ స్కేల్ లో మూవీ మేకింగ్‌తో పాటు



మనోజ్ క్యారెక్టర్ పవర్ ఫుల్ గా ఉందంటూ రజనీకాంత్ అభినందించారు.'మిరాయ్' మూవీతో సూపర్ స్టార్ రజనీకాంత్ బ్లెస్సింగ్స్ తనకు దక్కడం పట్ల రాకింగ్ స్టార్ మంచు మనోజ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.మిరాయ్' సినిమాతో మనోజ్ తన కెరీర్ లో మరో కొత్త ప్రయత్నం చేస్తున్నారు. తేజ సజ్జా హీరోగా దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రితికా నాయక్, శ్రియ శరణ్, జయరామ్, జగపతి బాబు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. భారీ పాన్ ఇండియా చిత్రంగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టి.జి.విశ్వప్రసాద్ నిర్మించిన మిరాయ్ మూవీ ఈ నెల 12న గ్రాండ్ రిలీజ్ కు రెడీ అవుతోంది .


# గ్రిప్పింగ్ యాక్షన్ థ్రిల్లర్ 'టన్నెల్ ' 12న విడుదల



**సెప్టెంబర్** 12న తెలుగులో లచ్చురామ్ ప్రొడక్షన్స్ ద్వారా ఎ.రాజు నాయక్ విడుదల చేస్తున్న అథర్వా మురళి నటించిన గ్రిప్పింగ్ యాక్షన్ థ్రిల్లర్ 'టన్నెల్' కోలీవుడ్ హీరో అథర్వా మురళీ ఖాకీ చొక్కా వేసుకున్నా.. క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకున్నా బ్లాక్ బస్టర్ పక్కా. ఈ క్రమంలో అథర్వా మరోసారి తనకు కలిసి వచ్చిన యాక్షన్‌ప్యాక్డ్ థ్రిల్లర్ జానర్‌లో 'టన్నెల్' అనే మూవీని చేశారు. రవీంద్ర మాధవ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కథానాయికగా నటించారు. అశ్విన్ కాకుమాను విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 12న థియేటర్లలోకి రానుంది. ఈ మూవీని తెలుగులోకి ఎ.రాజు నాయక్ లచ్చురామ్ ప్రొడక్షన్స్ ద్వారా విడుదల చేస్తున్నారు.ఇప్పటికే తమిళనాడులో ఈ ట్రైలర్ సెన్సేషన్‌గా మారింది. ఇందులో అథర్వా మురళీ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తున్నారు. క్రూరమైన హత్యలు, వాటి వెనుకున్న సైకోని పట్టుకునేందుకు పోలీస్ ఆఫీసర్ ఏం చేశాడు? సమాజాన్నే తన కుటుంబం అనుకునే పోలీస్ చివరకు ఆ సైకోని పట్టుకున్నారా? లేదా? అన్న అంశాలతో ఆసక్తికరంగా, గ్రిప్పింగ్, అదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్‌లతో ట్రైలర్‌ను కట్ చేశారు. జస్టిన్ ప్రభాకరన్ ఈ మూవీకి సంగీతాన్ని అందించారు. శక్తి శరవణన్ సినిమాటోగ్రఫర్‌గా పని చేశారు. కలైవానన్ ఈ సినిమాకు ఎడిటర్. తెలుగు వెర్షన్ ప్రమోషన్లు త్వరలో ప్రారంభం కానున్నాయి. అతి త్వరలోనే తెలుగు వర్షెన్ ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేసి ఇక్కడా అంచనాలు పెంచనున్నారు. ఇక అథర్వా మురళీ సైతం తెలుగు ప్రమోషన్స్‌లో సందడి చేయబోతోన్నారు .


శ్రీలీల

# వీటిని మాయిశ్చరైజర్లుగా..



చర్మం పొడిబారినప్పుడు మాయిశ్చరైజర్లు వాడడం మామూలే. అయితే దీనికోసం ఎప్పుడూ బయట ఉత్పత్తులే వాడాల్సిన అవసరం లేదంటున్నారు నిపుణులు. ఇంట్లో లభించే కొన్ని సహజసిద్ధమైన పదార్థాలను కూడా మాయిశ్చరైజర్లుగా వాడుకోవచ్చని సూచిస్తున్నారు.

✦ మజ్జిగ, పెరుగు.. వంటి పులియబెట్టిన పదార్థాల్లో ల్యాక్టికామ్లం ఉంటుంది. ఇంట్లో చర్మానికి తేమనందించే గుణాలు ఎక్కువని ఓ అధ్యయనంలో తేలింది. అందుకే వీటిని ఫేస్‌మస్కుల్లో భాగం చేసుకోవడం, లేదంటే నేరుగా చర్మానికి రాసుకోవడం.. ఇలా చేస్తే చక్కటి ఫలితాలు పొందవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

✦ రోజ్‌వాటర్ చర్మానికి తేమనందించే గుణాలు పుష్కలంగా ఉంటాయి! ఈ నీటిని స్ప్రే బాటిల్లో నింపి.. నిర్ణీత వ్యవధుల్లో చర్మం ముఖంపై స్ప్రే చేసుకుంటే రోజంతా తాజాగా ఉండచ్చు.

✦ అధిక నీటి శాతం ఉంటే కీరాదోస చర్మానికి తేమనందించడంలో సహకరిస్తుంది. దీన్ని తినడమే కాదు.. దీనితో ప్యాక్స్ తయారుచేసుకొని కూడా ఉపయోగించుకోవచ్చు.. లేదంటే కీర స్లైసుల్ని కనురెప్పలపై, ముఖమంతా పరచుకొని కాసేపు సేదదీరితే చక్కటి ఫలితం ఉంటుంది.

✦. బాగా పండిన అరటిపండ్లు పడేయడం.. వాటిని పేస్ట్‌లు చేసుకొని చర్మంపై అప్లై చేసుకుంటే చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. ఇందులో అధికంగా ఉండే విటమిన్ 'సి' పొడిబారిన చర్మానికి తిరిగి తేమనందిస్తుంది.

✦5. పొడి చర్మం ఉన్నవారు తేనెతో చర్మాన్ని మర్దన చేసుకొని పావుగంట తర్వాత గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలి. ఇలా చేయడం వల్ల సమస్య తగ్గడంతో పాటు మేను మెరిసిపోతుంది.

ఇవీన్నీ సహజసిద్ధమైన పదార్థాలే అయినప్పటికీ చర్మతత్వాలను బట్టి కొంతమందికి కొన్ని పడకపోవచ్చు. కాబట్టి వాడే ముందు ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మర్చిపోకూడదని సూచిస్తున్నారు నిపుణులు. □

# అభద్రతా భావం లేకుండా హాయిగా..



హైదరాబాద్ పాతబస్తీలోని ఏ మైదానానికి వెళ్లినా అబ్బాయిలే కనిపిస్తారు. అక్కడి చట్టా బజార్ ప్రాంతంలోని బాలెట్టి ఖేత్ మైదానం మాత్రం దీనికి భిన్నం. అక్కడ అమ్మాయిలు మెస్సీ, రొనాల్డోల జెర్సీలు వేసుకుని ఫుట్‌బాల్ ఆడతారు. ఆటలోని మజాని ఆస్వాదిస్తారు.

**ఈ మార్పు ఎలా వచ్చిందంటే...**

ఆఫీసు బాల్కనీ నుంచి ఎదురుగా ఉన్న గ్రౌండ్‌ను పరిశీలిస్తున్నారు రుబీనా నఫీస్ ఫాతిమా కాసేపటికే అక్కడ ఏదో తక్కువైనట్లుగా గుర్తించారామె. సిబ్బందిని పిలిచి 'అక్కడ ఏం జరుగుతుందో గమనించి, ఏం లోటుందో చెప్పండి' అన్నారు. 'పిల్లలు ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారు... మాకు ఎలాంటి లోటూ కనిపించడం లేదు అన్నారు వాళ్లు. 'ఆడపిల్లలు లేరు. వాళ్లు మాత్రం ఫుట్‌బాల్ ఎందుకు ఆడకూడదు' అన్నారు రుబీనా. ఆ ఆలోచన పాత బస్తీలోని ఎంతోమంది ముస్లిం ఆడపిల్లల జీవితాల్లో మార్పుతెచ్చింది. అమ్మాయిల సమయం... 17 ఏళ్లుగా పాతబస్తీలోని చట్టా బజార్ ప్రాంతంలో ఉపయోగించారు రుబీనా. 'సఫా ఇండియా' సంస్థను స్థాపించి మహిళలకు వివిధ రకాలుగా చేయూత నిస్తున్నారు. 2023 డిసెంబరు నుంచి ఆటలపైనా దృష్టి పెట్టారు. పాత బస్తీలో అమ్మాయిలపై ఆంక్షలు ఎక్కువే కానీ వాళ్లకు ఫుట్‌బాల్ నేర్పిస్తే సామాజికంగా ఎంతో మార్పు వచ్చి ముందడుగు వేశారు రుబీనా. 7-17 ఏళ్ల మధ్య బాలికలతో ఫుట్‌బాల్ ఆడాలనుకున్నారు. మొదట్లో వీళ్లు గ్రౌండ్‌కు వెళ్తే 'అమ్మాయిలు ఎలా ఆడతారు. మేం ఒప్పుకోం' అంటూ అభ్యంతరం పెట్టారు కొందరు. దీంతో బాలికల గ్రౌండ్‌లో ప్రత్యేకమైన సమయాన్ని కేటాయించాలని జీహెచ్‌సీ అధికారులతో రుబీనా చర్చించారు. అలా 'గర్ల్స్ ఆన్ గ్రౌండ్' కార్యక్రమం ఆ మైదానంలో మొదలైంది. రోజూ సాయంత్రం 4-6 గంటల మధ్య బాలికలకు ఇక్కడ ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇస్తారు. బాలికల తల్లిదండ్రులే తమ పిల్లల్ని స్వచ్ఛందంగా ఆటలకు పంపించడం మొదలు పెట్టారు. మేం చదువుకునే టప్పుడు ఆటపాటలు స్కూల్‌వరకే! ఇంటికి వచ్చాక వాటి ఊసే ఉండేది కాదు. దీని గురించి ఎంతో బాధపడేవాళ్లం. మా పిల్లలకు ఆడుకునే అవకాశం దొరకడంతో మేమే దగ్గరుండి పంపిస్తున్నాం' అని చెబుతారో తల్లి. ప్రస్తుతం దాదాపు 60 మంది బాలికలు ఈ మైదానంలో ఫుట్‌బాల్ ఆడుతున్నారు.

**ఖేలో ఇండియా పోటీలకు...** తమకు లభించిన ఈ సదవకాశాన్ని అందిపుచ్చుకున్న బాలికలు ఆటల్లో ప్రతిభను చూపుతున్నారు. ఇప్పటివరకు ఐదుగురు బాలికలు 'ఖేలో ఇండియా' పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. "ఆడపిల్లలు సాయంత్రం ఈ మైదానంలో ఆడుకోవడం ఇప్పుడిప్పుడే ఆనవాయితీగా మారిపోయింది. పలుపిల్లల సంస్థలూ, ఆస్ట్రేలియాకు చెందిన ఓ ఎన్జీఓ ఆర్థిక సాయం అందించడంతో ఈ శిక్షణను 'సఫా' అందజేస్తోంది. క్రీడా సామగ్రితోపాటు వాటిని ప్రాక్టీస్‌కు అవసరమైన షూ, స్పోర్ట్స్ డ్రెస్ లాంటివి పిల్లలకు ఇస్తారు. పోషకాహార లోపాన్ని తగ్గించడానికి ఇక్కడ పండ్లు లాంటివి ప్రాక్టీసు ముగిశాక అందిస్తారు. కొన్నిసార్లు దాతలు లేక పోవడంతో ఆహారం విషయంలో రాజీ పడాల్సి వస్తోందంటారు రుబీనా.

మైదానంలో స్వేచ్ఛగా ఆడుకోగలుగుతున్నాం. ప్రతి ఒక్కరికీ తగినంత సమయం, స్థలం ఉంటోంది. అందరూ అమ్మాయిలే కావడంతో అభద్రతా భావమూ లేకుండా హాయిగా ఆడుకుంటున్నాం. ఎన్నో జీవన నైపుణ్యాలనూ నేర్చుకుంటున్నాం. స్కూల్, కాలేజీల్లో మాకు రపత్యేక గుర్తింపు వస్తోంది. అంఆరు ఇక్కడ ఆడుకునే అమ్మాయిలు.





**అన్ని చోట్లా మార్పు రావాలి? .......** అబ్బాయిలు మాత్రమే గ్రౌండ్‌లో ఆడాలన్న నియమం లేదు. ఎవరైనా ఆడుకోవచ్చు. ఆడపిల్లలు ఆడుకునేం దుకు అవకాశం కల్పించాలంటూ జిహెచ్ఎంసి సిబ్బందికి ఫిర్యాదు చేశాం. వాళ్ల నుంచిసాను కూల స్పందన వచ్చింది. హైదరాబాద్‌లో 500వరకు చిన్నా, పెద్ద మైదానాలు ఉన్నాయి. వీటిలో బాలిక లకు ఆటల్లో శిక్షణ ఇస్తే ఎంతో మంది క్రీడాకారులు తయార వుతారు. అమ్మాయిలు బయట ప్రపంచంలోకి వస్తే అభివృద్ధికి బాటలు వేసుకుంటారు. □

# అమ్మతోనే బజ్జోవాలని..




చంటి గాడు నిద్రపోవాలంటే పక్కన అమ్మ ఉండాలి. లేదంటే గోల చేస్తాడు. ఇక బుజ్జి అయితే అమ్మతోనే బజ్జుంటా అంటూ నానా అల్లరి చేస్తుంది. ఇలా తల్లితో కలిసి నిద్రపోయే చిన్నారుల్లో మానసికాభివృద్ధి ఎలా జరుగుతుందనే దానిపై ఇటీవల ఓ సర్వే జరిగింది. లండన్ మిలీనియం కోహోర్ట్ ఆధ్వర్యంలో 9 నెలల నుంచి 11 ఏళ్ల వయసు ఉన్న దాదాపు 17వేల మంది పిల్లలపై అధ్యయనం చేపట్టారు. తల్లి మానసిక స్థితి, తల్లిదండ్రుల ఆర్థికస్థితి, నమ్మకాలు, తల్లిపాలు, శిశువు రాత్రిపూట మేల్కొనే ఫ్రీక్వెన్సీ వంటి విషయాలనిననంటినీ అనుసంధానించి మరీ పరిశీలించారట. దగ్గర పడుకోబెట్టడం వల్ల అధిక ప్రయోజనాల తోపాటు ఏడెనిమిదేళ్లు దాటినా కొన సాగిస్తే కొన్ని నష్టాలూ ఉన్నట్లు తేలిందట.

**ప్రయోజనాలెన్నో...** పసిపిల్లలైతే మెలకువ వచ్చిన ప్పుడు, ఆకలి వేసినప్పుడు తల్లిపాలు వెంటనే ఇవ్వొచ్చు. ఇలా రెండుమూడేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించే అవకాశం ఉంటుంది. వీరిలో వ్యాధినిరోధక శక్తీ మెరుగ్గా ఉంటుంది. అలాగే తల్లీబిడ్డ మధ్య భద్రతాభావంతోపాటు వారి మధ్య అనుబంధం కూడా పెరుగుతుంది. సాన్నిహిత్యంతోపాటు అమ్మ తోడుందనే భరోసా పిల్లల్లో కనిపిస్తుంది. ఇంకా ఇలా నిద్రపోవడం వల్ల భరోసా కలిగించే ఆక్సిటోసిన్ హార్మోన్ విడుదలనుర ఇది ప్రోత్సహిస్తుంది. దీంతో తల్లిదండ్రులు, పిల్లల మధ్య బంధం బలోపేతం చేయడమే కాకుండా భావోద్వేగ నియంత్రణ వంటి నైపుణ్యాలనూ పెంచుతోందట. అలాగే పిల్లల్లో ఆత్మవిశ్వాసం, సామాజికపరమైన నైపుణ్యాలు వంటివీ అభివృద్ధి చెందుతాయట. ఇక నష్టాలకొస్తే ఏడెనిమిదేళ్లకూ సహనిద్ర అలవాటు దూరం చేయక పోతే, పెద్దయ్యాక స్వతంత్రంగా నిద్రపోవడాన్ని పిల్లలు సవాల్‌గా ఫీల్ అవుతారు. అలాకాకుండా ఉండాలంటే ఆరేడేళ్ల వచ్చేసరికి విడిగా నిద్రపుచ్చడం మంచిది. □

# కప్ తీసుకెళ్తేనే మేలు..

ప్రయాణాల్లోనూ, ఆఫీసుల్లోనూ కాఫీ, టీల్లాంటివి తాగేందుకు చాలామంది పేపర్ కప్ వాడుతుంటారు. మీరూ అలానేనా? అయితే, మీ శరీరంలోకి రోజూకొద్దీ మైక్రోప్లాస్టిక్ పదార్థాలు చేరుతున్నట్లే..



ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్పర్సన్ తేజస్వినీ అనంత్ కుమార్. తాజాగా దీనికి సంబంధించి ఆమె సామాజిక మాధ్యమంలో చేసిన పోస్ట్ వైరలవుతోంది. 100మి.లీ వేడి వేడి పానీయాలు పేపర్ కప్పులో 15 నిమిషాలు ఉంటే చాలు... 25వేల మైక్రోప్లాస్టిక్ ఆకృతుల ఉత్పత్తి అవుతుందని ఐఐటీ ఖరగ్పూర్ పరిశోధనలు చెబుతున్నాయి. ఇవి ఆరోగ్యానికి చేసే నష్టం అంతా ఇంతా కాదు. అందుకే, మీరు ఎక్కడికెళ్లినా సరే.. నీళ్ల బాటిల్తోపాటు, ఓ కప్పు కూడా వెంట పట్టుకెళ్లండి. పేపర్ కప్పులో టీ, కాఫీలు తాగటం నిషేధించండి అని సూచిస్తున్నారీమె. దీన్ని బట్టి. ఇక రోజుకి రెండు మూడు సార్లు పేపర్ కప్ తాగే అలవాటు వారి శరీరంలోకి దాదాపు 75 వేల మైక్రోప్లాస్టిక్ పదార్థాలు తెలియకుండానే వెళ్తాయన్నమాట. ఇవి మహిళల్లో హార్మోన్ల అసమతుల్యతకీ, సంతానోత్పత్తి సమస్యలకీ, పిల్లల్లో ఎదుగుదల లోపాలకీ కారణమవుతాయట. కాబట్టి, ఏదైనామేర మన సొంత కప్ వాడుకోవటం ఉత్తమం. □

# జుట్టూడిపోతోందా?




ఒత్తైన, నల్లని కురులు సొంతం చేసుకోవాలని ప్రతి అమ్మాయీ ఆరాటపడుతుంటుంది. అయితే మనం రోజూ చేసే కొన్ని పనులు వల్ల మనకు తెలియకుండానే కేశాలకు హాని కలుగుతుంది. ఫలితంగా జుట్టు రాలడం, చివర్లు చిట్లడం, నిర్జీవంగా మారడం. వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. మరి, ఆ పొరపాట్లేంటో తెలుసుకుని సరిద్దుకుంటే కురులను చక్కగా సంరక్షించుకోవచ్చు.

ఇంతకీ అవేంటంటే..

**ఆరనివ్వాలి..** కొంతమంది తలస్నానం చేసిన తర్వాత జుట్టు తడిగా ఉండగానే చిక్కు తీసుకుంటూ ఉంటారు. అయితే కేశాలు తడిగా ఉన్నప్పుడు కుదుళ్లు కాసనత బలహీనంగా ఉంటాయి. ఇలాంటి సమయంలో దువ్వుకోవడం వల్ల అవి ఊడిపోవడం లేదా మరింత బలహీనంగా మారి రాలిపోవడం జరుగుతుంటాయి. కాబట్టి తడిగా ఉన్న జుట్టుని దువ్వుకోకూడదు పొడిగా ఆరాకే ఎలాంటి హెయిర్‌స్టైల్‌నైనా ప్రయత్నించడం ఉత్తమం.

**ఇలా చేయద్దు !....**

తలస్నానం చేసిన తర్వాత చాలామంది జుట్టు త్వరగా ఆరిపోవాలనే ఉద్దేశంతో కేశాలను చేతుల మధ్య ఉంచి టవల్‌తో రుద్దుతూ ఉంటారు. అలాగే మరికొంతమంది తలకు టవల్ చుట్టుకుని కాసేపు అలాగే ఉంచేస్తారు. అయితే ఈ రెండు పద్ధతులూ కేశాలకు హాని చేయచ్చం టున్నారు సౌందర్య నిపుణులు. ఎందుకంటే తడిగా ఉన్న జుట్టుకు టవల్ చుట్టి ఉండడం వల్ల కుదుళ్ల వద్ద తేమ అలాగే ఉండిపోయి కుదుళ్లు బలహీనంగా మారడమే కాకుండా చుండ్రు సమస్య కూడా. తలెత్తే ఆస్కారం ఉంటుంది. అలాగే ఈ క్రమంలో చివర్లు చిట్లే అవకాశాలూ ఎక్కువే.



**... వాటిని అవసరమైతేనే....**

తడిగా ఉన్న జుట్టుని ఆరబెట్టుకోవడానికి డ్రయర్, కురులను ఉంగరాల్లా తిప్పడానికి ఉపయోగించే కర్లర్, స్ట్రెయిట్‌నర్.. ఇలా ఒకటేమిటి.. ప్రస్తుతం కేశాలంకరణలో భాగంగా మనం ఉపయోగించే ఎలక్ట్రానిక్ వస్తువులెన్నో! అయితే వీటిని ఎంత తక్కువగా వాడితే జుట్టుకు అంత మంచిదంటున్నారు నిపుణులు. ఎందుకంటే వీటిద్వారా ఉత్పత్తయ్యే వేడి కారణంగా కురులు నిర్జీవంగా మారడం, చివర్లు చిట్లిపోవడం, పొడిబారినట్లుగా కనిపించడం.. ఇలా వివిధ రకాల సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి మరీఅవసరమైతే తప్ప వీటిని వాడకపోవడం మంచిది.

ట్రిమ్మింగ్ చేయించుకోవాలి.

నిర్ణీత వ్యవధుల్లో చిట్లిన చివర్లను ట్రిమ్మింగ్ చేసుకోవడం చాలా అవసరం. లేదంటే కేశాల ఎదుగుదల అక్కడితో ఆగిపోతుంది. అంతేకాకుండా కురులకు సరైన పోషణ కూడా అందక.. ఉన్న జుట్టు కూడా రాలిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి ఎప్పటికప్పుడు ట్రిమ్మింగ్ చేయించుకోవడం కూడా ముఖ్యమే.

**ఆ హెయిర్‌స్టైల్స్ వద్దు..**

చాలామంది నచ్చిందనో లేక డ్రస్ మీదకు నప్పుతుందనో పోనీటెయిల్, బన్స్.. ఇలా రకరకాల బిగుతైన హెయిర్‌స్టైల్స్ వేసుకుంటూ ఉంటారు. అయితే ఇవి కూడా ఎంత తక్కువగా వేసుకుంటే అంత మంచిది. ఎందుకంటే కేశాలను బిగుతుగా లాగి హెయిర్‌స్టైల్స్ వేసుకోవడం వల్ల కుదుళ్లకు రక్తప్రసరణ సరిగ్గా జరగదు. ఫలితంగా జుట్టు రాలిపోయే అవకాశాలుంటాయి. కాబట్టి జుట్టుకు హాని కలగకుండా ఉండే హెయిర్‌స్టైల్స్‌ని ప్రయత్నించడం మంచిది. □

# మొక్కలకు చీమలా?



**చీమలు ఇంట్లో ఉండే ఆహారపదార్థాల చుట్టూ చేరి చిరాకు పెడుతుంటాయి. ఇంతేకాకుండా తోటలో మొక్కలపై చేరి వాటికీ హాని చేస్తాయి. వీటి బెడద తగ్గించే చిట్కాలివి...**

**బేకింగ్ సోడా...** వంటగదిలో దొరికే బేకింగ్ సోడాతో చీమలనురాకుండా చేయొచ్చు. వేపనూనెలో స్పూన్ బేకింగ్ సోడా వేసి రెండింటినీ కలిపి చీమలు ఉండే ప్రదేశంలో రాయాలి. ఇలా చేయడం వల్ల మొక్కలకు పట్టిన చీమలు పోతాయి.

వైట్ వెనిగర్ వైట్ వినెగర్, నీళ్ల సమాన పరిమాణంలో తీసుకుని సీసాలో పోసుకోవాలి. దీన్ని ఇంటి తోటలోని మొక్కల దగ్గర చేరిన చీమలపై పిచికారీ చేయాలి. ఇలా వారానికి రెండు సార్లు ఈ నటిని పిచికారీ చేయం వల్ల చీమలు పోతాయి.

**నిమ్మరసంలో..** సిట్రస్ వాసన చీమలను అరికట్టడానికి సాయపడుతుంది. లీటరు నీటిలో రెండు చక్కల లవంగ నూనె, కాస్త నిమ్మరసం కలిపి మొక్కలపై స్ప్రే చేస్తేఈ వాసనకు చీమలు పారి పోతాయి. □

# పంచుకోవడం నేర్పుతున్నామా?

**ఎంతో ఇష్టంగా ఆడుకొనే తన బొమ్మను చింటూ మరెవ్వరికీ ఇవ్వడు. కానీ..** పక్కింటి రాహుల్ కారు కావాలని పేచీ పెడుతుంటాడు. పిల్లలు చిన్నప్పటి నుంచి తమవద్ద ఉన్నదాన్ని తోటివారితో పంచుకోవడానికి ఇష్టపడుతూన్నరా లేదా.. తల్లిదండ్రులు గుర్తిస్తుండాలి. ఎందుటివారి నుంచి తీసుకోవడమే కాకుండా తనవద్ద ఉన్న దాన్నివ్వడం కూడా నేర్పించాలి. లేదంటే ఇది భవిష్యత్తులో వారి వ్యక్తిత్వ లోపమయ్యే ప్రమాదవం ఉంది.



పిల్లలు తమ బొమ్మలతో ఇతర పిల్లలనూ ఆడుకోనివ్వాలని చెబితే ఒప్పుకోకపోవచ్చు ఈ అలవాటు రావాలంటే తగిన వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలి. నలుగురైదుగురిని బృందంగా ఒకచోట ఆడుకునేలా ప్రోత్సహించాలి. ఆ సందర్భాన్ని వేదికగా తీసుకున్న ఒకరి బొమ్మలను మరొకరు కలిసి పంచుకోవడమెలాగో నేర్పించాలి. అందరం ఒక్కటే అనే భావన వచ్చేలా చేయాలి. దీంతె తనకెంతో ఇష్టమైన బంతి లేదా కారు బొమ్మను మరొకర పిల్లాడు తీసుకెళ్లి పోతాడేమో అనే భయం నెమ్మదిగా వారిలో దూరమవుతుంది. ఆవతలివాడి వల్ల ఉన్న అందమైన బొమ్మ తన వద్ద లేదనే అసూయా తగ్గుతుంది. ఇతరుల వస్తువులను తీసుకవోడమే కాదు.. తన బొమ్మల్ని వారితో పంచుకునే అలవాటూ ఏర్పడుతుంది.

**సరదా ప్రాజెక్టులు..** ఇంట్లో లేదా మైదా నంలో అందరూ కలిసి ఆడుకునేటప్పుడు బాబు చేతిలో అందరికీ సరిపడా బిస్కెట్లో, చాక్లెట్లో ఇచ్చి అందరికీ సమానంగా పంచమన్నాలి. అది వారిలో ఐకమత్య భావనను తెస్తుంది. ఎదుటివారికి ఏదైనాఇచ్చినప్పుడు కలిగే సంతోషం వారికర్థమవుతుంది. పిల్లలందరినీ ఒక చోటచేర్చి క్లే బొమ్మలు వేసిసరంగులేయడం చిత్రలేఖనాలు గీయడం వంటి ఆర్ట్ ప్రాజెక్టులను సరదాగా చేయించాలి. సమష్టిగా చేయించే తోటపని వారి మధ్య స్నేహబంధానాన్ని పెంచుతుంది.

**సాయం చేస్తూ..** స్నేహితులతో ఆటవస్తువులు పంచుకోవడమే కాదు తెలియని వారికి సాయం చేయడమెలాగో కూడా బాల్యం నుంచే నేర్పాలి. నెలకోసారైనా అనాథాశ్రమాలకు తీసుకెళ్లి ఆ పిల్లలను పరిచయం చేయాలి. ప్రత్యేక దినాల్లో వారికి కానుకలిచ్చేలా ప్రోత్సహించాలి. ఈ అలవాటు కష్టంలో ఉన్నవారికి సాయం చేయాలనే ఆలోచనలకు చిన్నవయసులోనే బీజం పడేలా చేస్తుంది. ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా దక్కే ఆనందం ఎలా ఉంటుందో కూడా తెలుసుకోగలుగుతారు. □

# తెలుసుకుందాం..

అమెరికాకు చెందిన ఓ మహిళ (పేషెంట్ ఎస్.ఎమ్)కు భయం అంటే తెలియదట. ఆమెలో భయానికి కారణమయ్యే మెదడు భాగం దెబ్బతినటం వల్లే ఈ పరిస్థితి. అంతేకాదు, ఇతరుల్లోని భయాన్నీ తను గుర్తించలేదట. అయితే, మిగతా భావోద్వేగాలు, జ్ఞాపకశక్తి, తెలివితేటలు మాత్రం ఎప్పటిలానే ఉండేవి. □

# కృష్ణతత్వం

ఆధ్యాత్మికం





**కృష్ణతత్వం భక్తవేదాంత** స్వామి కృష్ణ తత్వాన్ని బోధిస్తే ఒక కథ చెప్పారు. గోకులంలో ఓ వనిత నీళ్ల కుండను తలమీద పెట్టుకునేందుకు ఎవరైనా సాయపడ తారేమోనని చూసింది. అటుగా వెళ్తున్న శ్రీకృష్ణుణ్ణి పిలిస్తే అతడు పలకలేదు. వినిపించ లేదేమో నని మళ్లీ పిలుస్తూ 'కృష్ణా! ఈ కుండ బరువుగా ఉంది. కాస్త సాయం చేయవా? అంది కృష్ణుడు విననట్లే వెళ్లిపోయాడు. ఇతగాడికేమైంది? ఎప్పుడూ అడగకుండానే సాయం చేసేవాడు. ఈ రోజు పిలిచినా పలకలేదు అనుకుంది. అతి కష్టంమీద కుండ ఎత్తుకుని ఇల్లు చేరింది. అప్పటికే అక్కడున్న కృష్ణుడు ఆమెను చూస్తూనే 'రా! కుండదించి పెడతాను అన్నాడు. ఆమె ఆశ్చర్యపోయి ఇందాక పిలిచినా రాలేదు. ఇప్పుడు పిలవకుండా వచ్చావు. నీ సాయం నాకేమీ అక్కర లేదులే' అందామె అలక వహించినట్టుగా, శ్రీకృష్ణుడు నవ్వి నేను భారం దించే వాడినే గానీ పెంచడం నా పని కాదని తెలిసి కూడా ఇలా అంటున్నావేంటి? సర్లే.. ఆ బరువు ఇంకా మోస్తానంటే నీ ఇష్టం అంటూ వెళ్లబోయాడు. దాంతో గోపిక కంగారుగా స్వామీ నీ తత్వం తెలిసిన నేనే మాయలో పడి ఇలా అన్నాను కదా! ఇక సంసార భారాన్ని మోస్తున్నవారి సంగతేంటి? అంది ఎవరు ఎంత భారం పెంచుకున్నా, నన్ను శరణు వేడితే దాన్ని దించేందుకు నేనెప్పుడూ సిద్ధమే అన్నాడు కన్నయ్య. □

# క్యాబేజీ మంచి పోషకాహారం



**క్యాలీఫ్లవర్ లానే క్యాబేజ్ మంచి పోషకాహారం.** ఇందులో విటమిన్లు, ఫొలేట్, మాంగనీస్, క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, పీచు, గ్లూకోజ్, ఫ్రక్టోజ్, ఐరన్, భాస్వరం, సోడియం, జింక్, కాపర్, మాంగనీస్, ఇలా అనేక పోషకాలు ఉన్నాయి. క్యాబేజ్ రోగనిరోధకశక్తిని పెంచుతుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు నొప్పి, వాపుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఇది మంచి బ్యాక్టీరియాను వృద్ధిచేస్తుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. రక్తపోటును నియంతించి, కలెస్ట్రాల్ స్థాయిని క్రమబద్ధం చేస్తుంది. రక్తం గడ్డకట్టకుండా, ఇతరత్రా గుండె జబ్బులు రాకుండా కాపాడుతుంది. ఊబకాయం రానివ్వదు. రేడియేషన్ థెరపీ నుంచి రక్షణ కల్పిస్తుంది. ఎముకలను దృఢంగా ఉంచుతుంది. క్యాన్సర్‌ను సైతం నిరోధిస్తుంది. క్యాబేజ్ రుచికరమే అయినపనపటికీ.. ఒక్కో సీజన్‌లో కాస్త వెగటు వాసన వస్తుంది. అలాంటప్పుడు కూర దించే ముందు అరకప్పు పాలు పోస్తే ఆ వాసన పోవడమే కాకుండా అదనపు రుచి వస్తుంది. కొందరు కూరల్లో గ్రేవీ కోసం ఉల్లికి బదులుగా క్యాబేజ్ వాడుతున్నారు. దీన్ని కూరగానే కాదు.. సలాడ్, సూప్ రూపాల్లోనూ తినొచ్చు. దీంతో చేసే పకోడీ సూపర్‌గా ఉంటుంది. క్యాబేజ్‌లో బ్రసెల్స్, కింగ్ క్యాబేజ్, ఆకుపచ్చ, ఎరుపు, ఊదా రంగుల క్యాబేజ్ ఇలా చాలానే రకాలున్నాయి. బలాన్నీ ఆరోగ్యాన్ని ఇచ్చే క్యాబేజ్‌ని తరచూ తిందామా మరి! □

# వన్డే కెరీర్లో.. నో డకౌట్ హీరోస్

## లిస్ట్‌లో టీమిండియా ప్లేయర్



యశ్‌పాల్ శర్మ



పీటర్ కిర్‌స్టన్



కెప్లర్ వెస్సెల్స్

**న్యూఢిల్లీ:** క్రికెట్ చరిత్రలో పరుగులవర్షంతో పాటు, సెంచరీలతో రెచ్చిపోయిన ఎంతోమంది బ్యాటర్స్ ఉన్నారు. అయితే, ఇలాంటి వారిలో కొంతమంది తమ కెరీర్‌లో ఎప్పుడూ సున్నా వద్ద ఔట్ కాలేదు. ఈ లిస్ట్‌లో ఓ భారతీయ బ్యాటర్ ఉన్నాడు. ఈ ప్లేయర్ భారత జట్టు తరపున సంవత్సరాలుగా క్రికెట్ ఆడాడు. కానీ, అతను ఎప్పుడూ సున్నా వద్ద అవుట్ కాలేదు. టీమిండియా మాజీ లెజెండరీ ఆటగాడు యశ్‌పాల్ శర్మ 42 వన్డేల్లో 883 పరుగులు చేశాడు. 4 హాఫ్ సెంచరీలు కూడా చేశాడు. వన్డేల్లో అతని అత్యధిక స్కోరు 89 పరుగులు. ఈ బ్యాట్స్‌మన్ వన్డేల్లో ఎప్పుడూ డకౌట్ కాలేదు. యశ్‌పాల్ ఆడే సమయంలో, వెస్టిండీస్ జట్టు చాలా డేంజరస్ జట్టు. ఆ బౌలర్లు ఎంతో ప్రమాదకరమైనవారు. అలాంటి సమయం లోనే యశ్‌పాల్ సత్తాచాటాడు.

అలాగే దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ పీటర్ కిర్‌స్టన్ వన్డేల్లో ఎప్పుడూ సున్నాకి అవుట్ కాలేదు. పీటర్ కిర్‌స్టన్ మూడు సంవత్సరాలలో 40 వన్డేలు ఆడి 1293 పరుగులు చేశాడు. అందులో 9 అర్ధ సెంచరీలు ఉన్నాయి. కిర్‌స్టన్ వన్డేల్లో 6 సార్లు అజేయంగా నిలిచాడు. వన్డేల్లో కిర్‌స్టన్ అత్యధిక స్కోరు 97 పరుగులు. దక్షిణాఫ్రికాకు చెందిన కెప్లర్ వెస్సెల్స్ ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా రెండింటి తరపున క్రికెట్ ఆడాడు. కెప్లర్ తన 10 సంవత్సరాల కెరీర్‌లో 109 వన్డేలు ఆడాడు. అందులో 1 సెంచరీ, 26 అర్ధ సెంచరీల సహాయంతో 3367 పరుగులు చేశాడు. కెప్లర్ వన్డేల్లో అత్యధిక స్కోరు 107 పరుగులు. కెప్లర్ తన వన్డే కెరీర్‌లో ఎప్పుడూ సున్నాతో అవుట్ కాలేదు. కెప్లర్ కూడా వన్డేల్లో 7 సార్లు నాటౌట్‌గా నిలిచాడు. ఇక దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ జాక్వెస్ రుడాల్ఫ్ 45 వన్డేల్లో 1174 పరుగులు చేశాడు. ఇందులో 7 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. జాక్వెస్ రుడాల్ఫ్ వన్డేల్లో 6 సార్లు నాటౌట్‌గా నిలిచాడు. వన్డేల్లో జాక్వెస్ రుడాల్ఫ్ అత్యధిక స్కోరు 81 పరుగులు. జాక్వెస్ రుడాల్ఫ్ ఇప్పటివరకు వన్డేల్లో ఎప్పుడూ సున్నాకి అవుట్ కాలేదు.



## గ్లోబల్ చెస్ టోర్నీలో..

# ప్రణవ్‌కు టైటిల్

**న్యూఢిల్లీ:** ఫుజైరా గ్లోబల్ చెస్ 2025 కిరీటాన్ని ప్రణవ్ వెంకటేష్ గెలుచుకున్నాడు. భారత వర్ధమాన స్టార్, ప్రస్తుత ప్రపంచ జూనియర్ ఛాంపియన్ ప్రణవ్ వెంకటేష్ ఫుజైరా గ్లోబల్ చెస్ 2025 సూపర్ స్టార్స్ టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా తన యువ కెరీర్‌లో మరో మైలురాయిని జోడించాడు. చెన్నైకి చెందిన 18 ఏళ్ల ఈ యువకుడు 9కి 7 పాయింట్లు సాధించాడు. తొమ్మిది రౌండ్లలో అజేయంగా నిలిచి తన సమీప ప్రత్యర్థుల కంటే పూర్తి ఆధిక్యతను సాధించాడు.స్పెయిన్ గ్రాండ్‌మాస్టర్ అలాన్ పిచోట్‌పై మంగళవారం జరిగిన నిర్ణయాత్మక చివరి రౌండ్ విజయంతో ప్రణవ్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ పోటీలో, అతను నిహాల్ సరిన్, ఎడ్వర్డో ఇటురిజాగా బోనెల్లి, జోస్ ఎడ్వర్డో మార్టినెజ్ అల్కాంటారా, అమిన్ టబాటబాయి వంటి హెవీవెయిట్లను కూడా ఓడించాడు. అదే సమయంలో సనన్ స్జుగిరోవ్, అభిమన్యు మిశ్రా వంటి ఇతర అగ్ర పోటీదారులతో డ్రా చేసుకున్నాడు. పోటీలో ఉన్న ఇతర భారతీయులలో, ఆదిత్య మిట్టల్ బలమైన ముగింపుతో ఆకట్టుకున్నాడు, 5.5 పాయింట్లతో ఐదవ స్థానంలో మరియు టైబ్రేక్‌లలో ఆరవ స్థానంలో నిలిచాడు. ప్రణవ్‌తో జరిగిన మొదటి రౌండ్‌లోనే ఎదురుదెబ్బ తగిలిన గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరిన్, స్థిరమైన ఆటతో కోలుకుని 5.5 పాయింట్లతో ముగించాడు, కానీ 12వ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

## ఆస్ట్రేలియాకు వరుస షాక్‌లు..

# పాట్ కమిన్స్ ఔట్



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు ఒకేరోజు వరుసగా షాక్‌ల మీద షాక్‌లు తగిలాయి. ఆ జట్టు ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టి20లకు రిటైర్మెంట్ ప్రకటించిన కొద్దిసేపట్లోనే టెస్టు జట్టు కెప్టెన్, పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో కీలక ప్లేయర్ అయిన పాట్ కమిన్స్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఆస్ట్రేలియా జట్టు వచ్చే నెలలో తొలుత న్యూజిలాండ్ పర్యటనకు వెళ్తుంది. అక్టోబర్ తొలి వారంలో 3 టి20లు, ఆ తరువాత అదే నెల 19నుంచి భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటి స్తుంది. ఈ పర్యటనలో 3 వన్డేలు, 5 టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. నవంబర్ 21 నుంచి స్వదేశంలో ఇంగ్లాండ్‌తో 5మ్యాచ్‌ల యాషెస్ సిరీస్ ప్రారంభమవుతుంది. అయితే, పాట్ కమిన్స్ న్యూజిలాండ్, భారత జట్టుతో జరిగే సిరీస్‌లకు అందుబాటులో ఉండడని క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటన చేసింది. కమిన్స్‌కు వెన్నెముక కింద భాగంలో సమస్య ఉన్నట్లు తెలిపింది. కమిన్స్ తిరిగి నవంబర్ 21 నుంచి జరిగే ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో పాల్గొంటారు. ఆస్ట్రేలియా కీలకబౌలర్ మిచెల్ స్టార్క్ అంతర్జా తీయ టి20 క్రికెట్ రిటైర్మెంట్ ప్రకటించిన కొద్ది గంటలకే పాట్ కమిన్స్ వచ్చే రెండు సిరీస్‌లకు అందుబాటులో ఉండడని ఆస్ట్రేలియా తెలిపింది. వీరిద్దరూ ఆస్ట్రేలియా జట్టులో ప్రధాన బౌలర్లు. దీంతో ఇద్దరూ తుది జట్టులో లేకపోవటం ఆ బౌలింగ్ విభాగానికి ఇబ్బందికరమైన విషయమనే చెప్పొచ్చు.

# యుఎస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌కు ఒసాకా

## కోకో గౌఫ్ సంచలన ఓటమి



**న్యూఢిల్లీ:** యుఎస్ ఓపెన్-2025లో ప్రపంచ ర్యాంకర్ కోకో గౌఫ సంచలన ఓటమి పాలయింది. అగర్ అలియాసిమ్‌లను కూడా ఓడించి నవోమి ఒసాకా విజయం సాధించింది. మంగళవారం జరిగిన యుఎస్ ఓపెన్ టెన్నిస్‌లో, రెండుసార్లు ఛాంపియన్ అయిన నవోమి ఒసాకా ప్రపంచ నంబర్ 3 కోకో గౌఫ్‌ను ఓడించి మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. ఆమె గౌఫ్‌ను 6-3, 6-2 తేడాతో ఓడించి ఫైనల్ ఎనిమిదో స్థానానికి చేరుకుంది. ఈ విజయంతో ఒసాకా నాలుగున్నర సంవత్సరాల తర్వాత గ్రాండ్ స్లామ్ క్వార్టర్ ఫైనల్‌కు తిరిగి వచ్చింది. ఆమె విజయంతో, 27 ఏళ్ల ఒసాకా డబ్ల్యూటిఎ ర్యాంకింగ్స్‌లో టాప్ 20లో తన స్థానాన్ని తిరిగి పొందింది. క్వార్టర్స్ ఫైనల్‌లో ఆమె చెక్ రిపబ్లిక్‌కు చెందిన కరోలినా ముచోవాతో తలపడనుంది, ఆమె ఉక్రెయిన్‌కు చెందిన 27వ సీడ్ మార్టా కోస్ట్యుక్‌పై విజయంతో తన స్థానాన్ని బుక్ చేసుకుంది. ఇక పురుషుల సింగిల్స్‌లో, ఫెలిక్స్ అగర్ అలియాసిమ్ ఆండ్రీ రుబ్లెవ్‌ను వరుస సెట్లలో ఓడించాడు. 25వ సీడ్ కెనడియన్ మూడు సంవత్సరాల తర్వాత తన మొదటి గ్రాండ్ స్లామ్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. అగర్ అలియాసిమ్ చివరి ఎనిమిది మందిలో ఆస్ట్రేలియాకు చెందిన అలెక్స్ డిమినార్‌తో తలపడతాడు. ఈ నెల 3న జరిగే క్వార్టర్ ఫైనల్లో నోవాక్ జొకోవిచ్ టేలర్ ఫ్రిట్జ్‌తో తలపడనున్నాడు. 24 సార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్ అయిన ఈ జొకోవిచ్, జర్మనీకి చెందిన జాన్‌లెన్నార్డ్ స్ట్రఫ్‌పై 6-3, 6-3, 6-2 తేడాతో విజయం సాధించి రౌండ్ ఆఫ్ 16లో తన స్థానాన్ని బుక్ చేసుకున్న తర్వాత ఒకే సీజన్‌లో నాలుగు మేజర్‌లలో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న అతి పెద్ద వయస్కుడిగా నిలిచాడు.

## నేషన్స్ కప్‌లో.. భారత్‌కు పరాభవం



**న్యూఢిల్లీ:** సిఎఎఫ్ఎ నేషన్స్ కప్-2025లో ఇరాన్ చేతిలో భారత్ పరాభవం చెందింది. తజికిస్తాన్‌లోని హిసోర్‌లో జరిగిన నేషన్స్ కప్ గ్రూప్ దశ మ్యాచ్‌లో భారత్ జట్టు బ్లూ టైగర్స్ ఇరాన్‌తో 0-3 తేడాతో ఓడిపోయింది. తొలి నిమిషాల్లోనే భారత్ ప్లేయర్ ముహమ్మద్ ఆషిక్ కురునియన్ ఉత్సాహంగా ప్రారంభిం చినా, ఇరాన్ తమ ఆధీనంలోకి తెచ్చుకుని వరుస కార్నర్‌లను కొట్టింది. 23వ నిమిషంలో నిఖిల్ ప్రభు కొట్టిన షాట్ కార్నర్ తర్వాత వైడ్ అవ్వడంతో భారతదేశం అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకోగలిగింది. ఇరానియన్ ఒత్తిడి పెరుగుతున్నప్పటికీ, సందేశ్ జింగాన్ మరియు గురుప్రీత్ విరామ సమయానికి ఆట గోల్ లేకుండానే ఉండేలా చూసుకున్నారు. రెండవ అర్ధభాగంలో ఇరాన్ తన ఆధిపత్యాన్ని గోల్స్‌గా మార్చుకుంది. 59వ నిమిషంలో మొహమ్మద్ అమిన్ హజ్బావి ఇచ్చిన క్రాస్‌ను అమిర్‌హోస్సేన్ హుస్సేన్జాదేహ్ అందుకున్నాడు. అతను బాక్స్ లోపల నియంత్రణ సాధించి, గుర్‌ప్రీత్‌ను దాటి తక్కువ దూరం గోల్ చేసి స్కోరును 1-0తో ముగించాడు. భారత్ మరింత దాడి చేసే సెటప్‌కు మారే ప్రయత్నం చేసినా ఇరాన్ బెంచ్ బలం ఆటను వారికి అనుకూలంగా మార్చింది. 90వ నిమిషంలో అలిరేజా జహాన్‌బక్ష్ కొట్టిన షాట్‌ను గుర్‌ప్రీత్ సేవ్ చేశాడు, ఆ తర్వాత మెహదీ తరేమి మరో బ్లాక్ చేశాడు. కానీ అలీ అలిపూర్ చివరికి నెట్‌ను కనుగొని ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. కొన్ని క్షణాల తర్వాత, స్టాపేజ్ టైమ్‌లో, తరేమి స్కోర్‌షీట్‌ను సాధించాడు, పర్ఫెక్ట్ థ్రెడ్ పాస్‌ను పొంది ఇరాన్‌కు 3-0 విజయాన్ని అందించాడు.

## చారిత్రక కనిష్టానికి

# రూపాయి

## డాలర్ వర్సెస్ రూపాయి 88.14



**ముంబయి, సెప్టెంబరు 2:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. విదేశీ పెట్టుబడులు భారీగా తరలిపోతుండటం, అమెరికా టారిఫ్‌ల ప్రభావంతో రూపాయి తీవ్ర ఒత్తిడికి గురవుతోంది. మంగళవారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి మరో 6 పైసలు బలహీనపడి 88.16 వద్ద సరికొత్త రికార్డు కనిష్ఠ స్థాయికి చేరింది.

ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి 88.14 వద్ద ప్రారం భమై, వెంటనే 88.16 స్థాయికి పడిపోయింది. నిన్న కూడా రూపాయి 88.10 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిలోనే ముగిసింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో 88.33 అనే అత్యంత కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. అమెరికా విధిస్తున్న అధిక టారిఫ్‌లు, విదేశీ పెట్టుబడిదారులు వెనక్కి తగ్గడం వంటి అంశాలు రూపాయి పతనానికి ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. ఈ పరిణామాలపై సిఆర్ ఫారెక్స్ అడ్వైజర్స్ ఎండి అమిత్ పబారి మాట్లాడుతూ, అమెరికా టారిఫ్‌ల వల్ల భారత ఎగుమతుల పోటీతత్వం దెబ్బతింటోంది. దీంతో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు వేచిచూసే ధోరణిలో లేరు. కేవలం గత మూడు ట్రేడింగ్ సెషన్లలోనే భారత ఈక్విటీల నుంచి 2.4 బిలియన్ డాలర్లు వెనక్కి వెళ్లిపోయాయి. ఇది కరెన్సీ, ఈక్విటీ మార్కెట్లలో తీవ్ర అస్థిరతకు కారణమవుతోందని వివరించారు.

సోమవారం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.1,429.71 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించినట్లు ఎక్స్ఛేంజ్ డేటా స్పష్టం చేస్తోంది.

అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ 0.08 శాతం పెరగ్గా, బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 68.45 డాలర్ల వద్ద ఉంది. నిపుణుల అంచనా ప్రకారం రూపాయికి 88.50 వద్ద నిరోధం, 87.50 వద్ద మద్దతు లభించే అవకాశం ఉంది.

# టెస్లాకు భారత్ మార్కెట్లో నిరాశే!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 2:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లాకు నిరాశే ఎదురైంది. ఆశించిన స్థాయిలో బుకింగ్స్ జరగలేదని సమాచారం. ఎన్నో అంచనాలతో భారత విపణిలోకి అడుగుపెట్టిన ఈ కార్లకు బుకింగ్స్ ఏమాత్రం పెరగలేదు. జులై నుంచి ఇప్పటి వరకూ మొత్తం 600 బుకింగ్స్ మాత్రమే వచ్చాయి. కంపెనీ అంచనాల కంటే ఇవి చాలా తక్కువ. భారత్‌లో టెస్లాకు అనుకున్నంత స్పందన రాలేదని కంపెనీభావిస్తోంది. టెస్లా భారత్‌లో ఈ ఏడాది 350 నుంచి 500 కార్లను డెలివరీ చేయాలని ప్లాన్ చేసుకుంది. ఇందు కోసం మొదటి బ్యాచ్ షాంఘై నుంచి ఈ నెల మొదట్లో భారత్‌కు చేరుకోవచ్చని సమాచారం. ఈ వాహనాల డెలివరీలను ప్రస్తుతానికి ముంబై, ఢిల్లీ, పుణే, గురుగ్రామ్ నగరాలకే పరిమితం చేయాలని కంపెనీ భావిస్తోంది. పూర్తి చెల్లింపుల తర్వాతే కార్లను డెలివరీ చేయనుంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది టెస్లా. రియర్‌వీల్ డ్రైవ్, లాంగ్‌రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్ వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్ రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్‌రేంజ్ వెర్షన్ ఆన్‌రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. అయితే, భారత్‌లో సగటు ఎలక్ట్రిక్ కారు ధర రూ.22 లక్షలు ఉంది. టెస్లా మోడల్ వై ధర దాదాపు రూ.60 లక్షల వరకు ఉంది. టెస్లాకు బ్రాండ్ పేరు ఉన్నప్పటికీ ఎక్కువ ధర కారణంగా భారత మార్కెట్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోతోంది.





# ఒక్కరోజులోనే లాభాల ఆవిరి!

**ముంబయి, సెప్టెంబరు 2:** భారత్ ఈక్విటీమార్కెట్లు మంగళవారం రెడ్‌సిగ్నల్ చూపించాయి. ఫ్యూచర్స్ ఆప్షన్స్ కాంట్రాక్టుల ముగింపు సమీపించడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఎన్ఎస్ఇ సూచీలన్నీ దిగువనే ముగిసాయి. గ్లోబల్ అనిశ్చితికి తోడు జిఎస్టీ మండలి ఈనెల 4వ తేదీ జరగనుండటంతో ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఎన్ఎస్ఇ 24650 మార్కువద్ద ప్రారంభం అయి ఇంట్రాడేలో 24,756.10కి చేరింది. తర్వాత అమ్మకాల వత్తిడి పెరగడంతో 24,600స్థాయిలోనే ముగిసింది. బ్యాంకులు, ఆర్థికరంగ కంపెనీల ఒత్తిళ్లు పెరగడం ఒకవైపు అయితే ఎఫ్ఎంసిజి, మెటల్ కౌంటర్లు కొంతమేర కొనుగోళ్ల మద్దతిచ్చాయి. ఎస్అండ్‌పి బిఎస్ఇ సెనెక్స్ 206.61 పాయింట్లు క్షీణించింది. 80,157.88 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ 45.45 పాయింట్లు క్షీణించి 24, 579.60 పాయింట్లవద్ద ముగిసింది. ఎంఅండ్ఎం 4.25శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.15శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.66 శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.27శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.64శాతం పెరిగాయి. బిఎస్ఇలో 2531 కంపెనీల షేర్లుపెరిగితే 1614 కంపెనీల షేర్లు క్షీణించాయి. మొత్తం 147 షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఇక పదేళ్ల బెంచ్‌మార్క్ రాబడులు 0.11శాతం క్షీణించి 6.578గానిలిచాయి. ఇక విదేశీ కరెన్సీ మార్పిడి మార్కెట్‌లో భారత్ రూపాయి మరింత క్షీణించింది. 88.1650కి చెలామణి అయింది. చివరకు 88.10 వద్ద ముగి సింది. ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ అక్టోబరు 3తేదీ నాటివి 0.16శాతం పెరిగి 104,949వద్ద స్థిరపడ్డాయి. యుఎస్ పదేళ్ల బాండ్లు 0.92శాతం పెరిగి 4.283శాతంగా ఉన్నాయి.కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు 2.02 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 69.50డాలర్లుగా నడిచింది. సెన్సెక్స్‌లో పవర్‌గ్రిడ్, ఎన్‌టిపిసి, టాటాస్టీల్, రిలయన్స్, బిఇఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎటర్నల్, ఐటిసి, టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, సన్‌ఫార్మా, టైటాన్, బజాజ్ ఫైనాన్స్ లాభాల్లో ముగియగా.. టిసిఎస్, మారుతి, హెచ్‌సిఎల్ టెక్, ఎస్‌బీఐఎన్, యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, అల్ట్రాటెక్ సిమెంట్స్, ట్రెంట్, టాటా మోటార్స్, కొటక్ బ్యాంక్, ఏషియన్ పేయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎంఅండ్ఎం నష్టాల్లో ముగిశాయి.





# సీనియర్ సిటిజన్లకు ఎయిరిండియా సూపర్ ఆఫర్!

వాణిజ్యం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 2:** దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా సీనియర్ సిటిజన్లకు సూపర్ ఆఫర్ తెచ్చింది. 60 సంవత్సరాలు, ఆ పైన వయసు పైబడిన సీనియర్ సిటిజన్ ప్రయాణికులకు రాయితీలు ప్రకటించింది. దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణాలుకు ఈ డిస్కౌంట్లు వర్తిస్తాయమని పేర్కొంది. విమాన టికెట్లపై గరిష్ఠంగా 25 శాతం వరకు రాయితీలు ఇస్తామని తెలిపింది. అయితే, దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులకు వేరు వేరుగా ఉంటుంది. దేశీయ మార్గాల్లో విమాన ప్రయాణాలు చేసే సీనియర్ సిటిజన్లు ఫ్లైట్ టికెట్ బేస్ ధరలో 25 శాతం తగ్గింపు పొందవచ్చు. ఇందుకోసం సీనియర్ సిటిజన్ ఆప్షన్ ఎంచుకుని డిస్కౌంట్ పొందవచ్చు. ఒకసారి తేదీ మార్చుకునేందుకు అవకాశం ఉంటుంది. 15 కిలోల వరకు అదనపు బ్యాగేజీ అనుమతిస్తారు. అలాగే ప్రోమో కోడ్ ఉపయోగించి యూపీఐ ద్వారా పేమెంట్లు చేస్తే దేశీయ, అంతర్జాతీయ ప్రయాణాలలో ఒక్కో ప్రయాణికుడికి అదనపు లబ్ధి చేకూరుతుంది. ఎయిరిండియా అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా ఈ ప్రయోజనాలు పొందవచ్చు. అంతర్జాతీయ ప్రయాణాలకుసీనియర్ సిటిజన్ స్కీమ్ ద్వారా విమాన టికెట్ బేస్ ధరపై 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఎయిరిండియా తెలిపింది. ఎకానమీ నుంచి ఫస్ట్ కాస్ వరకు అన్నింట్లో ఈ రాయితీ వర్తిస్తుంది. ఒకసారి ప్రయాణ తేదీని మార్చుకోవచ్చు. అయితే, ఛార్జీలు మారితే అదనపు ఛార్జీ చెల్లించాలి. అలాగే 10 కేజీల వరకు అదనపు లగేజీ అనుమతిస్తారు. లేదా ఎకానమీ, ప్రీమియం ఎకానమీల్లో23 కిలోలు ఉన్న రెండు బ్యాగులను తీసుకెళ్లవచ్చు. ఇక బిజినెస్ క్లాస్‌లో వెళ్లా వారు 32 కిలోల ఉన్న రెండు బ్యాగేజీలను తీసుకెళ్లవచ్చు. ఎయిర్ ఇండియా సిటీ లేదా ఎయిర్ పోర్ట్ టికెటింగ్ ఆఫీసులు, కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్, ఎయిరిండియా వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా టికెట్లు కొనుగోలు చేయవచ్చు. సీనియర్ సిటిజన్ ఆప్షన్ ఎంచుకుని డేట్ ఆఫ్ బర్త్ నిరూపించే ఫోటో ఐడీ కార్డును చూపించాల్సి ఉంటుంది. టికెటింగ్, చెక్ ఇన్, బోర్డింగ్ వంటి సమయాలల్లో ఐడీ కార్డును సమర్పించాల్సి ఉంటుంది. ఐడీ కార్డులు లేకపోవడం, వయసు నిరూపించుకోలేకపోతే పెనాల్టీలు పడే అవకాశం ఉంటుంది. వన్ వే, రిటర్న్ బుకింగ్స్‌కు ఈ డిస్కౌంట్లు వర్తిస్తాయి.





## సిఇఓను తొలగించిన నెస్లే!





**న్యూఢిల్లీ, సెప్టెంబరు 2:** ప్రపంచ దిగ్గజ ఆహార ఉత్ప త్తుల సంస్థ నెస్లే సంస్థ తమ సిఇఒ లారెంట్ ఫ్రీక్స్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించింది. తన కింద పనిచేసే ఒక ఉద్యోగితో రహస్యంగా ప్రేమా యణం నడిపినందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ స్పష్టంచేసింది. కిట్‌క్యాట్, మ్యాగీ, నెస్కేఫ్ వంటి బ్రాండ్లతో సుపరిచితమైన నెస్లే కంపెనీ అంతర్గ తంగా విచారణ జరిపింది. ఛైర్మన్ పాల్ బల్కే, లీడ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ పాబ్లో ఇస్లా పర్యవేక్షణలో జరిగిన ఈ విచారణ అనంతరం, ఫ్రీక్స్‌ను తొలగించా లని బోర్డునిర్ణయించింది. కంపెనీ ప్రవర్తనా నియమా వళిని (కోడ్ ఆఫ్ బిజినెస్ కండక్ట్) ఆయన ఉల్లం ఘించినట్లు తేలిందని నెస్లే తెలిపింది. ఫ్రీక్స్ స్థానంలో కొత్త సిఇఒగా ఫిలిప్ నావ్రాటిల్‌ను నియమి స్తున్నట్లు బోర్డు వెంటనే ప్రకటించింది. ఇప్పటివరకు ఆయన నెస్లే అనుబంధ సంస్థ అయిన నెస్ప్రెస్సో బ్రాండ్‌కు సిఇఒగా బాధ్యతలునిర్వర్తిస్తున్నారు. కంపెనీ వృద్ధిప్రణాళికలను ముందుకు తీసుకెళ్లడంలో నావ్రా టిల్ సరైన వ్యక్తి అని బోర్డు విశ్వాసం వ్యక్తం చేసింది.

## ఉద్యోగుల వేతనాలు పెంచిన టిసిఎస్





**ముంబయి, సెప్టెంబరు 2:** దేశీయ ఐటీ సేవల కంపెనీల్లో అతిపెద్దదైన టాటా గ్రూప్ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) తమ ఉద్యోగుల వేతనాలు పెంచింది. ఉద్యోగి పని తీరు, కేటగిరీని బట్టి 4.5 శాతం నుంచి 7 శాతం వరకూ వేతనాలు పెంచినట్లు కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకు సంబంధించిన ఇంక్రిమెంట్ లెటర్లను తమ సిబ్బందికి సోమవారం సాయంత్రం నుంచే టిసిఎస్ పంపించడం మొదలు పెట్టింది. ఈ పెంపు సెప్టెంబర్ నెల నుంచే వర్తిస్తుందని కంపెనీ తెలిపింది. ఈ ఏడాదిలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ ఉద్యోగుల్లో 2 శాతం అంటే దాదాపు 12 వేల మంది ఉద్యోగులను తొలగిస్తామని ఇటీవలే టిసిఎస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఐటీ, టెక్ రంగంలోని ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. అయితే, లేఆఫ్స్ ప్రకటనల వేళ తమ ఉద్యోగులకు జీతాలు పెంచుతూ వెంటనే అమలులోకి తీసుకురావడం గమనార్హం. సి3ఎ, దానికి సమానమైన గ్రేడ్లలో పని చేస్తున్న ఉద్యోగుల్లో అర్హులైన అసోసియేట్స్‌కు ఈ వేతన పెంపు ఉంటుందని ఉద్యోగులకు పంపించిన ఇంక్రిమెంట్ లెటర్లు, ఇమెయిల్స్‌లో టీసీఎస్ ఉన్నతాధికారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో ఏకంగా 12,261 మంది సిబ్బందిని తొలగించేందుకు సన్నాహాలు చేపట్టినట్లు టీసీఎస్ సీఈఓ కృతివాసన్ కొద్ది రోజుల క్రితమే వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా తమ ఆఫీసుల్లో పని చేస్తున్న ఉద్యోగులపై ఈ వేటు ఉంటుందని పేర్కొన్నారు. ఆతర్వాత 30 వేల మందికిపైగా తొలగిస్తున్నారని, కొత్త వారిని ఆన్‌బోర్డింగ్ జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. 12 వేల మంది వరకు మాత్రమే ఈ తొలగింపులు ఉంటాయన్నారు. అంతర్జాతీయ అనిశ్చితులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతలో మార్పుల కారణంగానే ఈ తొలగింపులు చేయాల్సి వస్తున్నట్లు టీసీఎస్ సిఇఒ కృతివాసన్ తెలిపారు. ఇతర ఐటీ, టెక్ కంపెనీలు సైతం టిసిఎస్ దారిలోనే నడిచి భారీ ఎత్తున లేఆఫ్స్ చేపట్టవచ్చని చెబుతున్నా ఇప్పటి వరకు దేశీయ కంపెనీల నుంచి లేఆఫ్స్ ప్రకటనలు రాకపోవడం గమనార్హం.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.